అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 17-02-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి: 11 | సంచిక: 47 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + వెల: 6.50



వికటన్ వెబ్‌సైట్ బ్లాక్

బీజేపీ ఫిర్యాదుతో కేంద్రం నిర్ణయం

మీడియాను బ్లాక్ చేయటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు

ఇది బీజేపీ ఫాసిస్టు స్వభావానికి ఒక ఉదాహరణ :

ఖండించిన తమిళనాడు సీఎం స్టాలిన్

మోడీ-ట్రంప్‌పై కార్టూన్ పబ్లిషింగ్ ఎఫెక్ట్

చెన్నై : తమిళ మీడియా గ్రూపు వికటన్‌కు చెందిన వెబ్‌సైట్ బ్లాక్ అయింది. కొన్ని రోజుల కిందట తన డిజిటల్ మ్యాగజైన్‌లో భారత ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌లకు సంబంధించి వికటన్ మీడియా ఒక కార్టూన్‌ను ప్రదర్శించటమే దీనికి కారణంగా తెలుస్తున్నది. ఈ వ్యంగ్య కార్టూన్‌ను సీరియస్‌గా తీసుకున్న తమిళనాడు బీజేపీ విభాగం.. కేంద్రానికి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఫిర్యాదు ...13లో



ఏసీ గదుల్లోంచి బయటకు రండి

యువ ఐఏఎస్‌లకు సీఎం రేవంత్‌రెడ్డి చురకలు

ప్రజలకు చేరువకావాలని దిశానిర్దేశం

'లైఫ్ ఆఫ్ ఏ కర్మయోగి' పుస్తకావిష్కరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

"కొందరు యువ ఐఏఎస్‌లు ఏసీ గదుల్లోంచి బయటకు వచ్చేందుకు కూడా ఇష్టపడట్లేదు. తమవద్దకు వచ్చిన ఫైళ్లను ఏ కొర్రీపెట్టి నిలుపుదల చేయాలా అని ఆలోచిస్తున్నారే తప్ప, ప్రజాసంక్షేమం కోసం ఏం చేద్దాం అనే ఆలోచనలు తగ్గిపోతున్నాయి. కొందరు యువ ఐపీఎస్ అధికారులు శిక్షణ సమయంలోనే యూనిఫామ్ వేసుకొని, సివిల్ తగాదాల్లో తలదూర్చి, సెటిల్‌మెంట్లు చేస్తున్నారని ఆక్షేపించారు. ముఖ్యమంత్రి మొదలు ఇతర ప్రజాప్రతినిధులకు విధుల్లో దిశానిర్దేశం చేసేలా ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పనితీరు ఉండాలి. రాజకీయ ప్రాపకం కోసం నేతలు ఏం చెప్తే, దానికి తలాడించే పరిస్థితుల్లో మార్పు రావాలి. రిటైర్డ్ అయిన సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఆ దిశగా కొత్తగా వచ్చేవారికి దిశానిర్దేశం చేయాలి. దానికోసం ప్రభుత్వ ఆధ్వర్యంలోనే సెమినార్లు, చర్చాగోష్టులు నిర్వహించాలి" అని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి చెప్పారు. ఐఏఎస్ రిటైర్డ్ సీనియర్ అధికారి ఎమ్ గోపాలకృష్ణనాయుడు తన 60 ఏండ్ల అనుభవాలను అక్షరబద్ధం చేస్తూ 'లైఫ్ ఆఫ్ ఏ కర్మయోగి' పేరుతో పుస్తకాన్ని రచించారు. హైదరాబాద్ బేగంపేటలోని ఐఏఎస్ ఆఫీసర్స్ ఇనిస్టిట్యూట్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సివిల్ సర్వెంట్స్ అందరికీ ఈ పుస్తకం ఒక దిక్సూచిగా ఉంటుందని అన్నారు. ఆనాటి తొలి ప్రధాని నెహ్రూ నుంచి ఈనాటి వరకు దేశంలో వేగంగా జరిగిన మార్పులకు గోపాలకృష్ణనాయుడు ...6లో



భారత్‌కు ట్రంప్ మరోషాక్


ఓటింగ్‌ను పెంచే నిధులకు 'డోజ్' కత్తెర

వాషింగ్టన్: అమెరికా ప్రభుత్వ వ్యవస్థలో వృథా వ్యయం కట్టడే లక్ష్యంగా రూపొందించిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ (డోజ్) విభాగం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా వివిధ దేశాలకు అమెరికా అందించే నిధులకు కోత విధిస్తున్నట్టు ...13లో



కార్పొరేట్ల చేతుల్లోకి టూరిజం

బీఓటీ ప్రాతిపదికన పర్యాటక ప్రాంతాల అభివృద్ధి



రానున్న ఐదేండ్లలో రూ. 20 వేలకోట్ల పెట్టుబడులే లక్ష్యం

రూట్ మ్యాప్ ఖరారు చేసిన ప్రభుత్వం

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో "తెలంగాణ టూరిజం-2025 పాలసీ"

భవిష్యత్‌లో సామాన్యుల సందర్శన మరింత ప్రియం

తెలంగాణ టూరిజం ప్రయివేటీకరణ వైపు అడుగులు వేస్తోంది. ఇప్పుడున్న టూరిస్టు ప్రాంతాలతో పాటు కొత్త వాటిని గుర్తించి బిల్ట్ ఆపరేషన్ ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. వాటిని 15 నుంచి 66 ఏండ్ల లీజుకు ప్రయివేట్ సంస్థలకు అప్పగించనున్నది. రానున్న ఐదేండ్లలో ఈ రంగంలో దాదాపు రూ.20 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసింది. "తెలంగాణ టూరిజం-2025 పాలసీ" పేరిట ప్రభుత్వం తీసుకురానున్న ఈ విధానం అమల్లోకి వస్తే భవిష్యత్‌లో రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల సందర్శన మరింత ఖరీదుగా మారనుంది.

ఊరగొండ మల్లేశం

రాష్ట్రంలో టూరిజం అభివృద్ధిపై సర్కార్ ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రపంచంలో వనరులు, చారిత్రక వారసత్వ సంపద అంతగా లేని దేశాలు సైతం ఈ రంగంపై వచ్చే ఆదాయంతోనే మనుగడ సాధిస్తున్నాయి. అందువల్ల అన్ని హంగులు ఉన్న తెలంగాణ ఈ రంగాన్ని ఆదాయ మార్గంగా మార్చుకోవాలనే లక్ష్యంతో అడుగులు ముందుకు వేస్తోంది. ఈ క్రమంలోనే "తెలంగాణ టూరిజం-2025 పాలసీ"ని ప్రభుత్వం ఖరారు చేసింది. 2025 నుంచి 2030 వరకు ...13లో

బీవోటీ అంటే?

బీవోటీ అంటే నిర్మాణం, నిర్వహణ, బదిలీ అని అర్థం. ఈ మూడు ప్రాతిపదికల ఆధారంగా ప్రాజెక్టును ప్రయివేటు సంస్థలకు అప్పగిస్తారు. ప్రాజెక్ట్ స్థాయిని బట్టి 15-33-66 ఏండ్ల వరకు లీజు కాలాన్ని నిర్ణయిస్తారు. గుర్తించిన ప్రాజెక్ట్ వివరాలు, లీజు కాలపరిమితి, పెట్టుబడి మొత్తం తదితర సమాచారం ఆధారంగా వాటిని ఈ-టెండర్ విధానంలో ప్రయివేట్ సంస్థలకు అప్పగించనున్నారు. ఎంపిక చేసిన ప్రాజెక్టును చేపట్టేందుకు ఈ-టెండర్ విధానంలో ఎవరూ ముందుకు రాకుంటే కంపెనీ స్థాయిని బట్టి నామినేషన్ ప్రాతిపదికన అప్పగిస్తారు. ఉదాహరణకు 33 ఏండ్లకు సదరు సంస్థ ప్రాజెక్టును దక్కించుకుంటే నిర్మాణ సమయాన్ని అదనంగా ఇస్తారు. ప్రాజెక్టును దక్కించుకున్న గడువు కాలంలో సదరు సంస్థ దానిని నిర్వహిస్తుంది. దానిపై వచ్చే ఆదాయాన్ని అదే పొందుతుంది. గడువు కాలం ముగిసిన తర్వాత ఆ ప్రాజెక్టును ప్రభుత్వానికి అప్పగిస్తారు. ఈ విధానం వల్ల సర్కార్ నిధులు వెచ్చించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉండదు.అయితే పెట్టుబడి పెట్టిన ప్రయివేట్ సంస్థలు లాభాలే లక్ష్యంగా నిర్వహిస్తాయి. ఇది పట్టాలెక్కితే రాష్ట్రంలో పర్యాటకరంగం సామాన్యులకు మరింత ప్రియం కానుంది.



కాళ్లకు చైన్లు, చేతులకు సంకెళ్లు..

వలసదారులకు తొలగని కష్టాలు



వివరాలు 3లో

బంగారు గనిలో పెను విషాదం

మాలిలో 48 మంది మృతి

వివరాలు 3లో

ప్రజాసమస్యలు విస్మరిస్తే ఎవరినైనా ఎదిరిస్తాం

కేంద్రం నిధులివ్వకపోతే రాష్ట్ర ఎంపీలు రాజీనామా చేయాలి

నిర్మల బడ్జెట్‌లో ప్రాధాన్యతా రంగాలకు మొండిచెయ్యి


కేటాయింపులపై పునరాలోచన చేయాలి

ఈ నెల 18,19న కేంద్ర బడ్జెట్‌పై ఐక్య ఉద్యమాలకు పిలుపు

కులగణనలో అనుమానాలు నివృత్తి చేసి స్థానిక ఎన్నికలు

నిర్వహించాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

6లో..



కుంభమేళాకు వెళుతూ తొక్కిసలాటల్లో అమాయక ప్రాణాలు గాల్లో కలిసిపోతూనే ఉన్నాయి. అక్కడ భారీ సంఖ్యలో భక్తులు వస్తున్నారన్న విషయం తెలిసి కూడా అటు యోగి, ఇటు కేంద్ర ప్రభుత్వమూ నిర్లక్ష్యంగా వ్యవహరించటం వల్లే ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో మరోసారి తొక్కిసలాట జరగటానికి కారణమైంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాన.. ప్రమాదంపై రైల్వేశాఖ విచారణకు ఆదేశించింది. ప్రభుత్వాల నిర్లక్ష్యంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి.

వివరాలు 3లో

ఈ నిర్లక్ష్యానికి బాధ్యులెవరు...?



ఢిల్లీ రైల్వేస్టేషన్ తొక్కిసలాటలో 18కి చేరిన మృతుల సంఖ్య

ప్రమాదంపై విచారణకు ద్విసభ్య కమిటీ..

పుస్తక ప్రదర్శనకు ఏబీవీపీ అడ్డు

ఉత్తరాఖండ్‌లో బుక్‌ఫెయిర్‌ను నిలిపివేసిన బీజేపీ సర్కారు



ఏబీవీపీ, సర్కారు తీరుపై సర్వత్రా విమర్శలు

డెహ్రాడూన్: నాగరిక సమాజంలో పుస్తక ప్రదర్శనలు నిర్వహించటానికి ఎవరికీ ఎలాంటి అభ్యంతరమూ ఉండదు. కానీ ఉత్తరాఖండ్‌లో నిర్వహించనున్న పుస్తక ప్రదర్శనను ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ విద్యార్థి విభాగమైన ఏబీవీపీ వ్యతిరేకించింది. దీంతో అక్కడి బీజేపీ ప్రభుత్వం బుక్‌ఫెయిర్‌ను రద్దు చేసింది.

శ్రీనగర్, పౌరి గర్వాల్‌లో 15, 16 తేదీలలో జరగాల్సిన పుస్తక ప్రదర్శన అకస్మాత్తుగా రద్దు చేయడంతో పుస్తకప్రేమికులు షాక్‌కు గురయ్యారు. అయితే ఈ నిర్ణయానికి ప్రధాన కారణం ఏబీవీపీనేనని నిర్వాహకులు అంటున్నారు. గాంధీ, నెహ్రూ వంటి నేతల జీవితాలు, వారసత్వాలకు సంబంధించిన సాహిత్యాన్ని విక్రయించడంపై ఏబీవీపీ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ పుస్తకాలను చేర్చడాన్ని ఏబీవీపీ వ్యతిరేకించిందనీ, చివరికి మేము ఈవెంట్‌ను రద్దు చేయాల్సి వచ్చిందని నిర్వాహకులలో ఒకరు విచారం వ్యక్తం చేశారు. పుస్తక ప్రదర్శన రద్దు ఆరోపణలపై సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ నూపుర్ వర్మ స్పందిస్తూ.. రాజకీయ ఒత్తిడి కారణంగా పుస్తక ప్రదర్శనకు అనుమతి నిరాకరించారనే వాదనలు నిరాధారమైనవని అన్నారు. కేవలం ...13లో



అలనాటి నటి కృష్ణవేణి కన్నుమూత

మన దేశంతో ఎన్టీఆర్‌ను వెండితెరకు పరిచయం చేసిన నిర్మాత

ఆమె మృతికి సినీ, రాజకీయ ప్రముఖుల సంతాపం

14లో..

దిగజారిన అదానీ ఆస్తుల విలువ

ఒక్క రోజే 2.73 బిలియన్ డాలర్లు ఆవిరి

కుబేరుల జాబితాలో దిగజారుతున్న ర్యాంకింగ్

స్టాక్ మార్కెట్ నష్టాలతో బేర్ మంటున్న బిలియనీర్లు

వివరాలు 13లో


కార్పొరేట్ల రుణ మాఫీ కోసమే కేంద్రం అప్పులు

ప్రతి బడ్జెట్‌లోనూ తెలంగాణకు అన్యాయం

తెలంగాణలో మేం ప్రజల దశాబ్దాల కష్టాలు తీర్చాం

రాష్ట్ర దశను మార్చి తరగని ఆస్తులు సృష్టించాం :

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కేటీఆర్ లేఖ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల రుణాల మాఫీ కోసమే అప్పులు చేస్తున్నట్టుగా ఉందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కే.తారకరామారావు ఆరోపించారు. ప్రతి బడ్జెట్‌లోనూ తెలంగాణకు అన్యాయం చేస్తున్న తీరును ఎత్తిచూపారు. తెలంగాణలో పదేండ్ల కాలంలో ప్రజల దశాబ్దాలుగా కష్టాలు తీర్చామనీ, అప్పులు చేసినప్పటికీ తెలంగాణకు తరగని ఆస్తులను సృష్టించామని వివరించారు. తెలంగాణకు కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపులను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌కు లేఖ రాశారు. దేశచరిత్రలోనే అత్యధికంగా అప్పులు చేసిన బీజేపీ పాలకులు తమపై అబాండాలు మోపడం దుర్మార్గమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి 14 మంది ప్రధానులు 65 ఏండ్లలో 56 లక్షల కోట్ల అప్పులు చేస్తే..పదేండ్లలో మోడీ సర్కారు రూ.125 లక్షల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. ఆ అప్పులతో ఏంచేశారనేది ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలన తరువాత కూడా తెలంగాణను మిగులు బడ్జెట్ రాష్ట్రంగానే కాంగ్రెస్‌కు అప్పజెప్పామని కేటీఆర్ తేల్చిచెప్పారు. అసలు అప్పులను, మిగులు బడ్జెట్‌తో ముడిపెట్టడం సమంజసం కాదని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ...13లో


ఆజంజాహి భూమిపై నేతల కన్ను

నాడు రాజకీయ జీవితం..నేడు కాసుల వర్షం

వ్యాపారితో మాజీలు, ప్రస్తుత ప్రజాప్రతినిధుల మిలాఖత్

ఆ భూమిని సర్కారు స్వాధీనం చేసుకోవాలి : నగరవాసులు, వామపక్ష కార్మిక సంఘాల డిమాండ్

వరంగల్ నగరంలో ఎంతో మంది రాజకీయ నేతలకు రాజకీయ జీవితాన్ని, మనుగడనిచ్చింది ఆజంజాహి మిల్లు. దాని ఆనవాళ్లు కోల్పోయి ఏండ్లు అయ్యాక కూడా పాలకపార్టీల రాజకీయ నేతలకు కాసుల వర్షం కురిపిస్తోంది. నగరం నడిబొడ్డున వున్న ఆజంజాహి మిల్లు కార్మిక భవనం భూమి మాజీ ప్రజాప్రతినిధులు, ప్రస్తుత ప్రజాప్రతినిధులకు కల్పతరువుగా మారింది. వ్యాపారితో మిలాఖత్ అయి అందినకాడికి దోచుకుంటున్నారు.



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో వచ్చినా అధికార, ప్రతిపక్ష పార్టీలు మిలాఖత్ అయిపోతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాడు ప్రజాప్రతినిధిగా ఈ భూమిని తనకు అత్యంత సన్నిహితుడైన వ్యాపారవేత్తకు కట్టబెట్టడంలో కీలక పాత్ర పోషించి రూ.2 కోట్లు పుచ్చుకుంటే, నాడు ఆ వ్యవహారాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన.. నేడు అధికారంలో వున్న మరో ప్రజాప్రతినిధి రూ.5 కోట్లు దండుకొని మరోమారు తెర ముందుకొచ్చి సదరు వ్యాపారవేత్తకు భరోసా కల్పించారు. దీంతో తీవ్ర విమర్శలు వ్యక్తమవడంతో తన వైఖరి మార్చుకొని ఆ భూమి జోలికి వెళ్లొద్దంటూ మరో ప్రాంతంలో స్థలం చూసుకుంటే సొంత డబ్బుతో కార్మిక భవనం కట్టిస్తానని ప్రకటించడం చర్చనీయాంశమవుతోంది. ఎవరి డబ్బులతో కార్మిక భవనం కడతారు ? సదరు వ్యాపారి ఇచ్చిన డబ్బుతోనేనా ? అని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. ఈ భూమి వివాదాన్ని సాకుగా చూపి ప్రధానంగా పాలక పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు కోట్లాది రూపాయలను సంపాదించుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. తాజాగా బీజేపీ నేతలు కూడా ఈ వ్యవహారంలో భాగస్వాములయ్యారని వార్తలు వినిపిస్తున్నాయి.

రాజీ పడ్డాక భవనమెక్కడిదీ..?

ఆజంజాహి మిల్లు పేరిట తొలుత 1,200 గజాల స్థలమున్నట్టు డాక్యుమెంట్‌లో వుంది. ఇందులో కార్మిక భవనం ఉండేది. 23 ఏండ్ల కిందట మిల్లు మూతపడ్డాక.. దాన్ని కాపాడుకోవడానికి తీవ్రంగా ...13లో

20న ఢిల్లీ సీఎం ఖరారు..?



నేడు జరగాల్సిన బీజేపీ శాసనసభా పక్ష సమావేశం వాయిదా

23తో ముగియనున్న ఢిల్లీ అసెంబ్లీ పదవీకాలం

న్యూఢిల్లీ: 20న రాంలీలా మైదానంలో ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్టు అధిష్టానం లీకులిస్తోంది.దీనిలో భాగంగా సోమవారం జరగాల్సిన శాసనసభా పక్ష సమావేశం వాయిదా పడినట్టు సమాచారం .అయితే ఈ సమావేశం 19న జరగనున్నది. మరుసటి రోజున కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేసేలా అధిష్టానం సూచనలు చేసినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

శాసనసభా పక్ష నాయకుడిని ఎన్నుకోవచ్చు

ఢిల్లీలోని బీజేపీ ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎంపీలు ఈ సమావేశంలో శాసనసభా పక్ష నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉంది. సమావేశ అనంతరం బీజేపీ శాసనసభా పక్ష నాయకుడు, పార్టీ నాయకులతో కలిసి లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి మెజార్టీ సభ్యుల సంతకాలతో కూడిన పత్రాన్ని సమర్పించనున్నట్టు పేర్కొంటున్నారు.

ఈ పేర్లపై ఊహాగానాలు

తమ ఎన్నికల వ్యూహంలో భాగంగా ముఖ్యమంత్రి అభ్యర్థిని బీజేపీ ప్రకటించలేదు. ప్రధాని మోడీ విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చేశారు.సీఎం రేసులో ఎమ్మెల్యేలు విజేంద్ర గుప్తా, ప్రవేశ్ వర్మ రేఖ గుప్తా, సతీష్ ఉపాధ్యాయ్, ఆశిష్ సూద్, పవన్ శర్మ, అజయ్ మహావర్ తదితరుల పేర్లు తెరపైకి వచ్చాయి. ముఖ్యమంత్రి, సహాయక మంత్రుల ఎంపికలో బీజేపీ తుది నిర్ణయం తీసుకుంటుందని కమలం పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఎంపీలకూ ఛాన్స్...

పార్టీలోనే మింగుడుపడని విధంగా బీజేపీ హైకమాండ్ నిర్ణయాలు ఉంటాయని ప్రచారం. ఫలానా వారు సీఎం అనుకుంటే..మధ్యలో మరోకరి తెరపైకి తెస్తున్న ఘటనలు చాలానే ఉన్నాయి. అయితే ఏ ఎంపీనైనా ముఖ్యమంత్రిని చేయగలదనే సంకేతాలిస్తున్నారు.. ఈ విషయంలో కేంద్ర సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు , ఈశాన్య ఢిల్లీ ప్రాంతానికి చెందిన ఎంపీ మనోజ్ తివారీ, న్యూఢిల్లీ ఎంపీ బన్సూరి స్వరాజ్ పేర్లూ వినిపిస్తున్నాయి.ఢిల్లీ అసెంబ్లీ పదవీకాలం ఫిబ్రవరి 23తో ముగియనుంది, కాబట్టి ప్రమాణ స్వీకార కార్యక్రమం అంతకు ముందే జరిగే అవకాశం ఉంది.

సీఎం రేవంత్ రెడ్డి చెప్పింది నిజం

పీఎం మోడీ కన్వర్టెడ్ బీసీ : చనగాని దయాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధానమంత్రి నరేంద్రమోడీ కన్వర్టెడ్ బీసీ అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాట నిజమని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ తెలిపారు. ఆదివారం గాంధీభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఓసీ అయిన మోడీ 2001 తర్వాత ఓబీసీగా మారారని చెప్పారు. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి వాస్తవాలు మాత్రమే మాట్లాడుతారని తెలిపారు. 1981లో మండల్ కమిషన్ 3,460 కులాలను ఓబీసీలోకి చేర్చాలని నివేదిక ఇచ్చిందనీ, ఆ కులాల్లో మోడీ కులం లేదని చెప్పారు. 2001లో సెంట్రల్ లిస్ట్‌లో మాజీ ప్రధాని వాజ్ పేయ్ హయాంలో మోడీ కులాన్ని ఓబీసీలో చేర్చారని తెలిపారు.

1994లో గుజరాత్ సీఎం చింబన్భాయ్ పాటిల్ మోడీ కులాన్ని ఓబీసీలో చేర్చారని తెలిపారు. కేంద్ర జాబితాలో లేకపోవడంతో 2001లో చేర్చారని తెలిపారు. మోడీ కులం మొదట్నుంచి వ్యాపార కులమనీ, ఓబీసీల కులాల స్థితిగతుల పట్ల ఆయనకు అవగాహన లేదన్నారు. చాయ్ వాలా పేరుతో ప్రచారం చేసి ప్రజలను ఆకట్టుకున్నారనీ, అయితే ఆయన దేశాన్ని అమ్మడం మొదలు పెట్టారని విమర్శించారు. నకిలీ బీసీలు దేశానికి ప్రమాదమంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన దాంట్లో తప్పేమి లేదని సమర్థించుకున్నారు. చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. బీసీల పట్ల నకిలీ బీసీలకు చిత్తశుద్ధి ఉండదని స్పష్టం చేశారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత లేదని విమర్శించారు. మోడీ ప్రధాని అయ్యాక సంపన్న వర్గాలకు రూ.166 లక్షల కోట్లను రుణమాఫీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబానీ రూ. 48,500 కోట్లు అప్పు తీసుకుంటే రూ.47,000 కోట్లు మాఫీ చేశారని తెలిపారు. పేదలకు రుణమాఫీకి ముందుకు రాలేదని తెలిపారు. కులగణన చేసి సీఎం రేవంత్ రెడ్డి చరిత్ర సృష్టించారని కొనియాడారు.

రూ.6కోట్ల విలువైన నెక్లెస్ స్వాధీనం

ఢిల్లీ విమానాశ్రయంలో గుజరాతీయుడి అరెస్టు



ఢిల్లీ: అత్యంత ఖరీదైన నెక్లెస్‌ను అక్రమంగా తరలిస్తున్న ప్రయాణికుడిని ఢిల్లీ విమానాశ్రయం అధికారులు అరెస్టు చేశారు. అతడి నుంచి దాదాపు రూ.6 కోట్ల విలువ చేసే నెక్లెస్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని కస్టమ్స్ విభాగం అధికారులు ఆదివారం 'ఎక్స్'లో వెల్లడించారు. ఫిబ్రవరి 12న బ్యాంకాక్ నుంచి ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఓ వ్యక్తిని తనిఖీ చేయగా.. నెక్లెస్‌ను అక్రమంగా తరలిస్తున్న గుర్తించినట్టు తెలిపారు. వజ్రాలు పొదిగి ఉన్న 40 గ్రాముల ఈ నెక్లెస్ విలువ రూ.6.08 కోట్లు ఉంటుందని కస్టమ్స్ తెలిపారు. నిందితుడిని గుజరాత్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించిన అధికారులు.. ఈ కేసును దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పక్షులు కావు..రిజిస్టర్డ్ డ్రోన్లు

దేశవ్యాప్తంగా 29500 వినియోగం..: డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ డీజీసీఏ

ఆకాశంలో మనకు పక్షులు..పిచుకలు కనిపించేవి. కానీ అవి కాలక్రమేణ కనుమరుగవుతున్నాయి. అపార్ట్‌మెంట్ కల్చర్ వచ్చాక ఇండ్ల ముందు కనిపించే అరుదైన పక్షిసంపద కాస్త అదృశ్యమైపోయింది. ఫంక్షన్లలోనే కాదు. మనం తల ఎత్తి ఆకాశం వైపు చూస్తే పక్షుల్లా కనిపించే డ్రోన్లు ఎక్కువవుతున్నాయి. దీనిపై పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 29,500 డ్రోన్లు రిజిస్టరైనట్టు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ డీజీసీఏ అధికారులు తెలిపారు. ఈ ఏడాది జనవరి 29 వరకూ ఉన్న డేటా ప్రకారం దేశ రాజధాని ఢిల్లీలో అత్యధికంగా 4,882 డ్రోన్లు నమోదైనట్టు చెప్పారు. తమిళనాడులో 4,588, మహారాష్ట్రలో 4,132 డ్రోన్లు రిజిస్టర్ అయినట్టు వివరించారు. తర్వాతి స్థానాల్లో హర్యానా, కర్నాటక, తెలంగాణ, గుజరాత్, కేరళ ఉన్నట్టు డీజీసీఏ అందించిన డేటాలో ఉంది. ఇప్పటివరకూ డ్రోన్లకు సంబంధించి 96 రకాల సర్టిఫికెట్లను డీజీసీఏ జారీచేసింది. వాటిలో 65 మోడళ్లను వ్యవసాయరంగంలో వినియోగించేందుకు అనుమతి ఇచ్చింది. రిజిస్టర్ చేసుకున్న ప్రతి డ్రోన్‌కు ప్రత్యేకమైన గుర్తింపు సంఖ్యను డీజీసీఏ జారీచేస్తుంది. డీజీసీఏకు చెందిన రిమోట్ పైలెట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ఆర్‌టీపీఓఎస్ ఇప్పటివరకూ 24,466 రిమోట్ పైలెట్ సర్టిఫికెట్లను జారీచేసింది. డ్రోన్లు ఎగరవేసేందుకు



ఎయిర్ స్పేస్ మ్యాప్ ను అనుసరించాలి. ఎయిర్ స్పేస్ మ్యాప్ లో ఆకుపచ్చ, పసుపు, ఎరుపు జోన్లు ఉంటాయి. గ్రీన్ జోన్ లో డ్రోన్ ఎగరవేసేందుకు ఎలాంటి అనుమతులు అవసరంలేదు. ఎల్లో జోన్ లో మాత్రం ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అనుమతి తీసుకోవాలి. రెడ్ జోన్ లో డ్రోన్లు ఎగరవేయాలంటే కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరని అధికారులు పేర్కొంటున్నారు.

ఆర్థో ఎయిడ్ ఆయిల్ సీజ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తప్పుడు ప్రకటనతో అమ్ముతున్న ఆయుర్వేదిక్ మెడిసిన్ ఆర్థో ఎయిడ్ ఆయిల్‌ను డ్రగ్ కంట్రోల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆదివారం డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. కీళ్ల నొప్పుల చికిత్సకంటూ తప్పుడు ప్రకటనను ఆర్థో ఎయిడ్ ఆయిల్‌ను అమ్ముతున్నట్టు సిరిసిల్ల జిల్లాల్లో డ్రగ్ కంట్రోల్ అధికారులు చేసిన దాడుల్లో బయటపడింది. దీంతో కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. దీనిని హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన లీఫోర్డ్ హెల్త్ కేర్ లిమిటెడ్ తయారు చేస్తున్నది.

'భూమిపైనే అత్యంత తెలివైన ఎఐ గ్రోక్ 3

ఎలన్ మస్క్ కీలక ప్రకటన



న్యూయార్క్ : ప్రపంచంలో ఉన్న టెక్ దిగ్గజాలన్నీ ఎఐ టెక్నాలజీ డెవలప్‌మెంట్ లో పోటీపడుతున్న నేపథ్యంలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కీలక ప్రకటన చేశారు. మస్క్ నేతత్వంలోని కత్రిమ మేధ సంస్థ 'ఎక్స్‌ఏఐ' అత్యంత అధునాతనమైన గ్రోక్ 3 సేవలను అందుబాటులోకి తీసుకురానుందని సామాజిక మాధ్యమాల్లో ప్రకటించారు. భూమిపైన అత్యంత తెలివైన ఎఐ సాధనంగా దీన్ని ఆయన అభివర్ణించారు. భారత కాలమానం ప్రకారం ... మంగళవారం ఉదయం 9 గంటల 30 నిముషాలకు ఈ కొత్త మోడల్ అందుబాటులోకి రానుందని తెలిపారు. ఇప్పటికే గ్రోక్ చాట్‌బాట్ సేవలు విస్తతంగా ప్రాచుర్యం పొందాయి. చాట్ జీపిటికి పోటీగా మార్కెట్లోకి వచ్చిన గ్రోక్, మెరుగైన ఫీచర్లతో వినియోగదారులను ఆకట్టుకుంది. తాజాగా 'ఎక్స్' వేదికగా గ్రోక్ 3 విడుదల కానున్నట్లు మస్క్ ప్రకటించారు. అయితే.. దీని సామర్థ్యాలకు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం వెల్లడించలేదు. టెక్ నిపుణుల అభిప్రాయానుసారం... ఈ కొత్త మోడల్ టెక్ట్స్-టు-వీడియో వంటి అధునాతన ఫీచర్లను కలిగి ఉండే అవకాశముంది. ఈ అప్‌గ్రేడ్‌తో, గ్రోక్ 3 ఓపెన్‌ఏఐ తీసుకొచ్చిన జీపిటి-4, గూగుల్ జెమిని వంటి ఏఐ మోడళ్లకు ప్రధాన పోటీదారుగా నిలవనుంది. ప్రస్తుతం కత్రిమ మేధ విభాగంలో పోటీ తీవ్రంగా పెరిగింది. ఓవైపు ఓపెన్‌ఏఐ తన చాట్‌జీపీటీ మోడళ్లను నిరంతరం అభివద్ధి చేస్తుండగా, గూగుల్ జెమినీని మరింత మెరుగుపరుస్తోంది. మెటా తన ఎల్‌ఎల్ఎఎంఎ సిరీస్‌ను విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో, ఎలాన్ మస్క్ గ్రోక్ 3ను ప్రవేశపెట్టడం టెక్ ప్రపంచంలో కీలక పరిణామంగా నిలిచింది.

మనీలాండరింగ్ కేసులో మారిషస్ మాజీ ప్రధాని ప్రవింద్ అరెస్ట్



పోర్ట్ లూయిస్ : మనీ లాండరింగ్ కేసులో మారిషస్ మాజీ ప్రధానమంత్రి ప్రవింద్ జగన్నాథ్ అరెస్టయ్యారు. శనివారం సాయంత్రం నుంచి ఆయన నివాసం, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించినట్లు మారిషస్ ఆర్థిక నేరాల విభాగం (ఎఫ్‌సిసి) ఆదివారం వెల్లడించింది. ప్రవింద్‌తో పాటు ఆయన భార్య కోబితాను గంటల పాటు విచారించినట్లు పేర్కొంది. అనంతరం ప్రవింద్‌ను అరెస్టు చేసి, సెంట్రల్ మారిషస్‌లోని మెకాలో ఉన్న నిర్బంధ కేంద్రంలో ఉంచినట్లు ఎఫ్‌సిసి ఆదివారం ఉదయం తెలిపింది. సోదాల్లో భాగంగా పలు కీలక డాక్యుమెంట్లు, ఖరీదైన గడియారాలు, అధిక మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. మారిషస్ ప్రధానిగా 2017 నుంచి 2024 వరకు కొనసాగిన ప్రవింద్ జగన్నాథ్.. గతేడాది చివర్లో రాజీనామా చేశారు. ఆ వెంటనే నవీన్ రామ్‌గూలం నూతన ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని ఒప్పందాల్లో ఆర్థిక అవకతవకలు జరిగాయని, వాటిపై ఆడిట్ నిర్వహిస్తామని నవీన్ అప్పట్లో ప్రకటించారు. వీటికి సంబంధించిన విచారణ చేపట్టిన ప్రస్తుత ప్రభుత్వం.. మనీ లాండరింగ్ అభియోగాలపై ప్రవింద్‌ను అరెస్టు చేసింది.

ఏపీలో జీబీఎస్ ప్రమాద ఘంటికలు..

గుంటూరులో చికిత్స పొందుతూ మహిళ మృతి

గుంటూరు: ప్రకాశం జిల్లా అలసందలపల్లికి చెందిన కమలమ్మ గులియన్-బారీ సిండ్రోమ్ (జీబీఎస్)తో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. తీవ్ర జ్వరం, కాళ్లు చచ్చుబడి పోవడంతో కొన్ని రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న బాధితురాలు ఆదివారం కన్నుమూసింది. కమలమ్మ మృతిని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి ధ్రువీకరించారు .అరుదుగా లక్షమందిలో ఒకరిద్దరికే వచ్చే జీబీఎస్ అనే నరాల సంబంధిత వ్యాధి కేసులు ఏపీలో ఇటీవల ఒక్కసారిగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. గుంటూరు ప్రభుత్వాస్పత్రికి (జీజీహెచ్) ఈ నెల 11న ఒక్కరోజే ఏడు కేసులు వచ్చాయి. ఏలూరు, ప్రకాశం, పల్నాడు జిల్లాల నుంచి నలుగురు, గుంటూరు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ముగ్గురు ఈ వ్యాధి లక్షణాలతో ఆస్పత్రిలో చేరారు. వారిలో ఇద్దరు వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. అదే వ్యాధితో కాకినాడలో ఇటీవల ఇద్దరు చేరారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో ఈ వ్యాధితో 17 మంది చికిత్స పొందుతున్నారు.



మేడ్చల్‌లో నడిరోడ్డుపై దారుణ హత్య



రోజూ తాగి వచ్చి న్యూసెన్స్ చేస్తుండటంతో..

సొంత తమ్ముడు, చిన్నాన్న కొడుకు కలిసి హత్య

నిందితులు కత్తులను చేతిలో పట్టుకొని వీరంగం

భయాందోళనలో ప్రయాణికులు

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ జాతీయ రహదారి 44 పై ముందు ఒక వ్యక్తి పరిగెడుతుండగా మరో ఇద్దరు వ్యక్తులు ఆయన వెనక కత్తులు పట్టుకొని పరిగెత్తడాన్ని చూసిన జనాలు ఇదేదో సినిమా షూటింగ్ అనుకున్నారు. అయితే జనాలు అందరూ చూస్తుండగానే కత్తులు పట్టుకొని పరిగెత్తిన ఇద్దరు వ్యక్తులు.. ముందు పరిగెత్తిన వ్యక్తిని పట్టుకొని విచక్షణారహితంగా పొడవడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మేడ్చల్‌లో కలకలం రేపింది. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం సోమవారం పేటకు చెందిన గుగులోతు ఉమేష్ (25) ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అయితే నిరంతరం తాగి కుటుంబ సభ్యులను కొడుతుండేవాడు. ఇదేవిధంగా ఆదివారం సైతం తాగొచ్చి ఇంట్లో గొడవకు దిగాడు. విసుగు చెందిన సొంత తమ్ముడు రాజేష్, చిన్నాన్న కొడుకు లక్ష్మణ్ కత్తులతో బెదిరించడంతో.. ప్రాణ భయంతో ఉమేష్ రోడ్డుమీదకి పరిగెత్తాడు. ఆయన తమ్ముళ్లు వెంటాడి మేడ్చల్ బస్టాండ్ ఇన్ గేట్ వద్ద విచక్షణారహితంగా పొడిచి చంపారు. అనంతరం కత్తులు చేతిలో పట్టుకొని తాపీగా రోడ్డు దాటుకుంటూ వెళ్లిపోయారు. మృతుని ఒంట్లో 12 కత్తిపోట్లు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. కండ్ల ముందే ఒక వ్యక్తిని కత్తులతో పొడవడాన్ని చూసిన బస్ డిపోలోని ప్రయాణికులు, ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కాగా, మృతుని ఉమేష్ పైన రెండు కేసులు ఉన్నాయని, ఒకటి మహిళను హత్య చేసిన కేసుతోపాటు దొంగతనం కేసులో జైలుకు సైతం వెళ్లి వచ్చాడని ఏసీపీ తెలిపారు. కేసు నమోదు చేసు 0కుని దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



ఇంత జనాన్ని ఎప్పుడూ చూడలేదు

- వారిని అదుపు చేయడం సాధ్యపడలేదు
- ఢిల్లీ ప్రమాద ఘటనపై ప్రత్యక్ష సాక్షుల కథనం

ప్రమాద కారణాలపై భిన్నాభిప్రాయాలు

మా విన్నపాలు ఎవరూ వినలేదన్న అధికారులు

న్యూఢిల్లీ : 'మహా కుంభమేళాకు 12 మందిమి వెళుతున్నాం. అప్పటికి ఇంకా ప్లాట్‌ఫారం పైకి కూడా చేరుకోలేదు. మెట్ల వద్దే ఉన్నాము. నా సోదరి సహా కుటుంబ సభ్యులు జనంలో చిక్కుబడిపోయారు. అరగంట తర్వాత ఆమెను విగతజీవిగా చూడాల్సి వచ్చింది' అంటూ సంజయ్ అనే బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు. కుంభమేళాలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు ప్రయాగరాజ్‌కు రైలులో వెళ్లాలని అనుకున్న వేలాది మంది భక్తుల్లో ఆయన కూడా ఒకరు. ఓ వైపు రైలు రాక ఆలస్యం కావడం, మరోవైపు జనరల్ టిక్కెట్ల అమ్మకం కొనసాగడంతో భారీగా చేరుకుంటున్న ప్రయాణికుల కారణంగా స్టేషన్‌లో సూది మొన మోపే స్థలం కూడా లేకుండా పోయింది. ప్రజలు భారీగా రావడం వల్లనే తొక్కిసలాట జరిగిందని, ఊపిరాడక అనేక మంది స్పృహ కోల్పోయారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

అనేక సంవత్సరాలుగా ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో వ్యాపారం చేస్తున్న రవికుమార్ అనే వ్యక్తి మాట్లాడుతూ గతంలో ఇంత జనాన్ని ఎన్నడూ చూడలేదని అన్నారు. '12, 14, 15, 16 నెంబర్ ప్లాట్‌ఫారాల వద్ద ఇసుక వేస్తే రాలనంత జనం చేరారు. ప్రయాగరాజ్ వెళ్లే రైళ్లు అక్కడికే వస్తాయి. స్టేషన్‌లో ఉన్న బ్రిడ్జి చాలా చిన్నది. ప్రజలేమో అపరిమిత సంఖ్యలో వచ్చారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి పైన భారీగా జనం చేరారు. ఆ జన సందోహాన్ని ఎవరూ ఊహించలేదు. పండుగల సమయంలో కూడా అంతమంది రాలేదు. అధికారులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఉన్నప్పటికీ ప్రజలను అదుపు చేయడం సాధ్యం కాలేదు' అని వివరించారు. తొక్కిసలాట సమయంలో అక్కడే ఉన్న ఓ పోర్టర్ మాట్లాడుతూ రాత్రి 8.30 గంటల నుండే జనం రావడం మొదలైందని అన్నారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారని చెప్పారు.

1981 నుండి అదే స్టేషన్‌లో పనిచేస్తున్న మరో పోర్టర్ మాట్లాడుతూ 'గతంలో ఇంత జనాన్ని ఎన్నడూ చూడలేదు. ప్రయాగరాజ్ వెళ్లాల్సిన ప్రత్యేక రైలు 12వ నెంబర్ ప్లాట్‌ఫారం నుండి బయలుదేరాల్సి ఉంది. అయితే దానిని 16వ నెంబర్ ప్లాట్‌ఫారంకు మార్చారు. దీంతో ప్రయాణికులంతా 16వ నెంబర్ ప్లాట్‌ఫారం వద్దకు చేరుకునేందుకు పరుగులు తీశారు. ఈ క్రమంలో ఒకరిని ఒకరు ఢీకొని పలువురు ఎస్కలేటర్ పైన, మెట్ల పైన పడిపోయారు. ప్రజలను ఆపేందుకు పోర్టర్లు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది' అని చెప్పారు. పదిహేను మృతదేహాలను అంబులెన్సుల్లో తరలించామని, ప్లాట్‌ఫారంపై చెప్పులు, బూట్లు, బట్టలు మాత్రమే కన్పిస్తున్నాయని తెలిపారు. తొక్కిసలాట జరగ్గానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించా మని, మూడు నాలుగు అంబులె న్సులు రాగానే వాటిలో క్షత గాత్రులను తరలించామని వివరించారు.

ప్రజలు వస్తారని ఊహించాము కానీ కొద్ది సేపట్లోనే అంతా జరిగిపోయిందని, పరిస్థితి అదుపు తప్పిందని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (రైల్వేస్) కేపీఎస్ మల్హోత్రా చెప్పారు. 13వ నెంబర్ ప్లాట్‌ఫారంపై ఉన్న వారు 14, 15 నెంబర్ ప్లాట్‌ఫారాలపై రైళ్లను చూశారని, దాంతో ఉరుకులు పరుగులు పెడుతూ అక్కడికి చేరుకునేందుకు ప్రయత్నించారని ఓ ప్రత్యక్ష సాక్షి తెలిపాడు. అయితే ప్లాట్‌ఫారం నెంబర్లను మార్చలేదని, ప్రజలు భారీగా చేరుకోవడంతో అదుపు చేయడం సాధ్యపడలేదని ఆయన చెప్పాడు. వైమానిక దళంలో సార్జంట్‌గా పనిచేస్తున్న అజిత్ కూడా తొక్కిసలాట ఘటనకు ప్రత్యక్ష సాక్షి. 'విధులు ముగించుకొని వెళ్లే సమయం. కానీ జనం భారీగా ఉండడంతో వెళ్లలేకపోయాను. ప్రజలకు నచ్చచెప్పేందుకు ప్రయత్నించాను. పెద్ద సంఖ్యలో ప్లాట్‌ఫారంపై గుమికూడవద్దని విజ్ఞప్తి చేస్తూ అనౌన్స్‌మెంట్లు కూడా ఇచ్చాను. ప్రమాదాన్ని నివారించేందుకు అధికారులు విశ్వ ప్రయత్నం చేశారు. అయితే మా విన్నపాలను ఎవరూ పట్టించుకోలేదు' అని ఆయన చెప్పారు.



వెళ్లొద్దని చెప్పినా వినలేదు

కన్నీటి పర్యంతమవుతున్న బాధిత కుటుంబాలు

- సమాచారం ఇచ్చేవారే లేరంటూ ఆగ్రహం
- మృతదేహాల కోసం మార్చురీ వద్ద ఎదురుచూపులు



న్యూఢిల్లీ : అది సెంట్రల్ ఢిల్లీలోని లోక్‌నాయక్ జయప్రకాష్ ఆస్పత్రి. దాని ఎమర్జెన్సీ వార్డు వెలుపల పలువురు ఆతృతగా ఎదురు చూస్తూ కన్పించారు. తమ ప్రశ్నలకు సమాధానాలు చెప్పేవారు ఎవరూ కన్పించకపోవడంతో వారిలో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో చనిపోయిన వారెవరు, గాయపడిన వారెవరు అంటూ అధికారులను ఆరా తీస్తున్నారు. ఎవరి ముఖంలో చూసినా ఆతృత, అసహనం, ఆందోళన, ఆగ్రహం కలగలిసి కన్పిస్తున్నాయి. ఆస్పత్రి వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒకవైపు మృతులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. మరోవైపు గాయపడిన వారిని అత్యవసర వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

'ఇక్కడ సౌకర్యాలు లేవు. సాయం చేసే నాథుడూ లేడు' అని వీరేంద్ర గద్గద స్వరంతో వాపోయారు. ఆయన్ని కదిలిస్తే కన్నీరు ధారాపాతంగా కారిపోతోంది. చాలా సేపటి నుండి ఎదురు చూస్తున్నానని, ఎవరూ ఏమీ చెప్పడం లేదని తెలిపారు. చనిపోయిన వారిలో ఆయన భార్య పూనం రోహిల్లా కూడా ఉన్నారు. గంటల తరబడి గాలింపు ఫలితంగా ఆమె మృతదేహం కన్పించింది. పూనం తన స్నేహితులతో కలిసి కుంభమేళాకు బయలుదేరారు. అయితే ఈ తీర్థయాత్ర చాలా మందికి విషాదంగా మారింది. మరో కుటుంబానిదీ అదే కథ. హర్యానాలోని పానిపట్‌కు చెందిన సంతోష్ మెహతో తన భార్య మరణ వార్త వినగానే హుటాహుటిన ఆస్పత్రికి చేరుకున్నారు. భార్య మృతదేహం కోసం ఆయన మార్చురీ ఎదుట ఎదురు చూస్తూ కూర్చున్నారు. 'ఢిల్లీలో జరిగిన ఘటన గురించి విన్నాను. నా భార్యతో పాటు కుమారుడు, మేనల్లుడు కూడా ఉన్నారు' అని ఆయన అన్నారు. తల్లి మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం పానిపట్ తీసికెళ్లేందుకు ఆమె ముగ్గురు పిల్లలు ఎదురు చూపులు చూస్తున్నారు.

మరోవైపు ఆస్పత్రి లోపల వైద్యులు క్షణం తీరికలేకుండా శవ పరీక్షలు చేస్తున్నారు. మరికొందరు క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నారు. మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ కుమార్ కొందరు సీనియర్ వైద్యులతో కలిసి ఒక వార్డు నుండి మరో వార్డుకు పరుగులు పెడుతున్నారు. చికిత్స కోసం వస్తున్న క్షతగాత్రుల సంఖ్య పెరుగుతుండడంతో వారికి వైద్య సేవలు అందించడంతో తలమునకలవుతున్నారు. చనిపోయిన వారిని ఒకరి తర్వాత ఒకరుగా శవ పరీక్షల నిమిత్తం మార్చురీకి పంపుతున్నారు. గాయపడిన ప్రయాణికులను ఐసీయూకు, ఆ తర్వాత ఆర్థోపెడిక్ విభాగానికి తరలిస్తున్నారు. వారి కుటుంబ సభ్యులు కూడా ఆయా విభాగాలకు చేరుకుంటూ తమ వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీస్తున్నారు.

మృతుల్లో 47 సంవత్సరాల శీలా దేవి ఒకరు. ఇద్దరు పిల్లల తల్లి అయిన శీలా దేవి భర్త, కుమారుడితో కలిసి కుంభమేళాకు పయనమయ్యారు. తొక్కిసలాటలో ఆమె ప్రాణాలు కోల్పోగా భర్త ఉమేష్ గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ స్థితిలో కుమారుడు అమన్ గిరి ఒంటరివాడయ్యాడు. కుంభమేళాలకు వెళ్లవద్దని తల్లికి సలహా ఇచ్చానని, కానీ ఆమె వినిపించుకోలేదని చెప్పాడు. తల్లి మృతదేహాన్ని మార్చురీకి తరలించడంలో అమన్ సాయపడడం అందరినీ కలచివేసింది. రైల్వే స్టేషన్‌లో జరిగిన విషాద ఘటనను గుర్తు చేసుకుంటూ 'మెట్ల మీద జనం రద్దీ అధికంగా ఉన్నదని మా అమ్మ చెప్పింది. మా అమ్మ బాగా లావుగా ఉంటుంది. కాబట్టి మెట్లు ఎక్కలేకపోయింది. తొక్కిసలాట నుండి తప్పించుకునేందుకు ప్రతి ఒక్కరూ మెట్ల వైపు పరుగులు తీశారు' అని చెప్పాడు. కాగా మనోజ్ షా 11 సంవత్సరాల కుమార్తె సురుచి తొక్కిసలాట ఘటనలో తప్పిపోయింది. తన బావమరిది ముకేష్ నుండి వచ్చిన ఫోన్ కాల్‌ను ఆయన గుర్తు చేసుకుంటూ 'తొక్కిసలాట జరిగిందని, జనం ఒకరిపై ఒకరు పడిపోయారని అతను నాకు చెప్పాడు. నా అత్తమామలు కూడా ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. గాయాలతో బయట పడిన ముకేష్ ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతున్నారు' అని తెలిపారు. కుమార్తె సురుచి ఆచూకీ కోసం ఆయన ఆతృతగా వెతుకుతున్నారు.

రొనిత్ సెహ్‌గల్‌ది కూడా దాదాపు ఇలాంటి వ్యథే. తొక్కిసలాట సమాచారం తెలిసిన వెంటనే ఆయన రైల్వే స్టేషన్‌కు పరుగులు తీశారు. ఆయన బంధువు సంగీతా మాలిక్ కుంభమేళాకు బయలుదేరారు. మాలిక్ ప్రయాణ టిక్కెట్ రద్దయినప్పటికీ ఆమె మరో టిక్కెట్ బుక్ చేసుకున్నదీ లేనిదీ కుటుంబ సభ్యులకు తెలియడం లేదు. వారంతా ఆస్పత్రికి చేరే సరికి విషాద వార్త వినాల్సి వచ్చింది. వారి భయం నిజమైంది. మృతుల్లో సంగీత కూడా ఉన్నారు. సాధారణంగా న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది. అది దేశంలోనే అత్యంత రద్దీగా ఉంటే ప్రయాణ హబ్‌గా పేరు పొందింది. శనివారం రాత్రి ప్రజలు మునుపెన్నడూ లేని విధంగా భారీగా స్టేషన్‌కు చేరుకోవడంతో రద్దీ అనూహ్యంగా పెరిగిపోయింది. 'జనం ఒకరిపై ఒకరు పడిపోవడం చూశాను' అని పప్పు అనే యువకుడు చెప్పాడు. భార్య పమ్మి, అత్త పూనంతో కలిసి ఆయన కుంభమేళాకు బయలు దేరారు. దుర్ఘటనలో పూనం ప్రాణాలు కోల్పోయారు. 'అంబులెన్స్ రావడానికి అరగంటకు పైగా సమయం పట్టింది. సకాలంలో వైద్య చికిత్స అంది ఉంటే మా అత్త బతికే వారు' అని పప్పు వాపోయారు.

ఈ నిర్లక్ష్యానికి బాధ్యులెవరు...?

- ఢిల్లీ రైల్వేస్టేషన్ తొక్కిసలాటలో 18కి చేరిన మృతుల సంఖ్య
- ప్రమాదంపై విచారణకు ద్విసభ్య కమిటీ..





న్యూఢిల్లీ : ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు వెళ్లి తిరిగివస్తామో.. లేదో అన్నట్టుగా ఉంది భక్తుల పరిస్థితి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఘోర వైఫల్యం మరోసారి స్పష్టమైంది. కుంభమేళాకు వెళ్లేందుకు ప్రజలు శనివారం రాత్రి పెద్ద సంఖ్యలో రైల్వేస్టేషన్‌కు చేరుకోవడంతో జరిగిన తొక్కిసలాట ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోగా పలువురు గాయపడ్డారు. ప్రత్యేక రైళ్ల కోసం 14, 16 నెంబర్ ప్లాట్‌ఫారాల వద్ద ప్రజలు భారీగా ఎదురుచూస్తున్న సమయంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. అయితే ఈ ఘటనకు కారణమేమిటో తెలియడం లేదని, ప్రయాగరాజ్ వెళ్లాల్సిన రెండు రైళ్లు రద్దవడంతో.. అనౌన్స్‌మెంట్ చేయటంలో గందరగోళం కారణంగా తొక్కిసలాట జరిగిందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇదే విషయాన్ని ఢిల్లీ అగ్నిమాపక సర్వీసుల అధిపతి అతుల్ గార్గ్ చెప్పారు.

భారీగా ప్రయాణికులు.. అదుపు చేయలేక..

ప్రతి గంటకూ 1,500 టిక్కెట్ల చొప్పున రైల్వే సిబ్బంది విక్రయించారని, ఫలితంగా స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసి పోయిందని, అదుపు చేయడం కష్టమైందని డిప్యూటీ పోలీస్ కమిషనర్ తెలిపారు. 14వ నెంబర్ ప్లాట్‌ఫారం వద్ద, 16వ నెంబర్ ప్లాట్‌ఫారం సమీపంలో ఉన్న ఎస్కలేటర్ వద్ద తొక్కిసలాట జరిగిందని ఆయన వివరించారు. రైల్వే స్టేషన్‌కు రావద్దని ప్రజలను కోరినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని, దీంతో పరిస్థితి చేయి దాటిపోయిందని అధికారులు చెప్పారు. ప్రజలను అదుపు చేసేందుకు అధికారులు ప్రయత్నించినా వారు పట్టించుకోలేదని తెలిపారు.

ద్విసభ్య కమిటీతో విచారణ..

ప్రమాదానికి కారణమేమిటో తెలుసుకునేందుకు రైల్వే శాఖ ఇద్దరు సభ్యులతో ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. రైళ్లను రద్దు చేయలేదని, అలాగే ప్లాట్‌ఫారాలను కూడా మార్చలేదని ఉత్తర రైల్వే సీపీఆర్‌ఓ హిమాన్షు శేఖర్ ఉపాధ్యాయ్ తెలిపారు. ఘటనపై విచారణ జరుగుతోందని, నివేదిక వచ్చిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. మృతుల కుటుంబాలకు రైల్వే శాఖ రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని ప్రకటించింది. తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందిస్తారు. ప్రమాదాలు జరిగినపుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్స్‌గ్రేషియోలు ప్రకటించటం, సంతాపాలతో సరిపెడుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రధాని మోడీ దిగ్భ్రాంతి..


తొక్కిసలాట ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కాగా మృతుల సంఖ్యను కేంద్ర ప్రభుత్వం దాచిపెడుతోందని కాంగ్రెస్ మండిపడింది. ఈ ఘటన రైల్వే శాఖ వైఫల్యానికి, ప్రభుత్వ ఉదాశీనతకు అద్దం పడుతోందని విమర్శించింది. జరిగిన ఘటనకు బాధ్యత వహించి రైల్వే మంత్రి రాజీనామా చేయాలని తృణమూల్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఇది మాటలకు అందని విషాదమని అంటూ ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించింది. 'తొక్కిసలాట జరగలేదని తొలుత నరేంద్ర మోడీ, బీజేపీ నేతలు చెప్పుకొచ్చారు. అది వదంతేనంటూ ఖండించారు. ఆ తర్వాత కొందరు గాయపడ్డారని అంగీకరించారు. కొందరు మరణించి ఉండవచ్చునని బీజేపీ చివరికి అంగీకరించక తప్పలేదు' అని రాజ్యసభలో తృణమూల్ ఉప నేత సాగరికా ఘోష్ తెలిపారు. ఇదిలావుండగా లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి అతిశీ, పలువురు సీనియర్ నేతలు ఆస్పత్రికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

> **రైళ్ల సంఖ్య పెంచకుండానే..**
>
> కుంభమేళాకు కావాల్సినన్ని రైళ్లు వేస్తామని కేంద్ర రైల్వేశాఖ ప్రకటించింది. కానీ చివరికి లైట్ తీసుకున్నట్టు స్పష్టమవు తోంది. సాధారణ ప్రయాణికులు ఉన్నప్పుడే.. అనౌన్స్‌మెంట్‌లో ప్లాట్ ఫారాలను మార్చితేనే నానా కష్టాలు పడాల్సి ఉంటుంది. అలాంటిది కుంభ మేళా నుంచి భారీ సంఖ్యలో భక్తులు వచ్చినపుడు.. ప్రయాణికులతో చెలగాటమాడిన తీరే ప్రాణాంతకమైందని ప్రత్యక్షసాక్ష్యులు అంటున్నారు.

26న ముగియనున్న కుంభమేళా

కుంభమేళా 26న ముగియనున్నది. అయితే ప్రమాద ఘటనలు మాత్రం ఆగటంలేదు. ఓవైపు ప్రయాగ్‌రాజ్‌లో వేసిన షామియానాల్లో అగ్నిప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మరో వైపు తొక్కిసలాటల్లో మృత్యుఘోష వినిపిస్తూనే ఉన్నది. ఇప్పటికైనా పాలకులు కండ్లు తెరిచి.. చివరి వరకూ జనం సురక్షితంగా తమ తమ గమ్యస్థానాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పౌర సమాజం కోరుతోంది.





ఎఫ్‌ఎంఆర్‌ఏఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా

కృష్ణానంద్, పార్థ రక్షిత్

ముగిసిన 27వ అఖిల భారత మహాసభ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్రజెంటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎంఆర్‌ఏఐ) నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కృష్ణానంద్, పార్థ రక్షిత్ ఎన్నికయ్యారు. మహారాష్ట్ర రాజధాని ముంబయిలో మూడు రోజుల (ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు) పాటు కొనసాగిన ఎఫ్‌ఎంఆర్‌ఏఐ 27వ అఖిల భారత మహాసభ ఉద్వేగపూరిత వాతావరణంలో ముగిసింది. 1.17 లక్షలకు పైగా సభ్యత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్న 800 మందికి పైగా ప్రతినిధులు ఈ మహాసభకు హాజరయ్యారు. తొలుత ఎఫ్‌ఎంఆర్‌ఏఐ అధ్యక్షుడు రమేష్ సుందర్ జెండా ఆవిష్కరించారు. ప్రముఖ ముంబాయి సర్జన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) మెడికల్ ఎథిక్స్ కమిటీ సభ్యుడు డాక్టర్ సంజయ్ నగ్రాల్ ప్రారంభ ఉపన్యాసం చేశారు. ఏఐటీసీడీ అధ్యక్షుడు జగన్నాథ్ అప్పాజీ షిండే స్వాగతోపన్యాసం చేశారు. సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షులు అశోక్ ధావలే, సీఐటీయూ జాతీయ కార్యదర్శులు ఆర్ కరుమలైయన్, జె.ఎస్. మజుందార్, ఎం.హెచ్ షేక్, డాక్టర్ వివేక్ మాంటెరో, సుకుమార్ దామ్లే, డాక్టర్ తపతి ముఖోపాధ్యాయ, అడ్వకేట్ అరవింద్ తపోలే తదితరులు సౌహార్థ సందేశాలు ఇచ్చారు. ఎంఎస్‌ఎంఆర్‌ఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేంద్ర సింగ్, శ్రీకాంత్ ఫోపాసే అధ్యక్ష వహించారు.

ఎఫ్‌ఎంఆర్‌ఏఐ ప్రధాన కార్యదర్శి శాంతను ఛటర్జీ రిపోర్టు ప్రవేశపెట్టారు. ఈ రిపోర్టుపై రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు చర్చించారు. అనంతరం 286 మందితో నూతన జనరల్ కౌన్సిల్, 99 మందితో వర్కింగ్ కమిటీ, 20 మందితో కార్యదర్శి వర్గం ఎన్నికయింది. ఆలిండియా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కృష్ణానంద్, పార్థ రక్షిత్, కోశాధికారిగా కౌసిక్ రాయ్ చౌదరిలను మహాసభ ఎన్నుకుంది.

ఎన్నికైన ప్రతినిధులు

తెలంగాణ నుంచి వర్కింగ్ కమిటీ సభ్యులుగా భాను కిరణ్, సిహెచ్ శ్రీధర్, జనరల్ కౌన్సిల్ సభ్యులుగా కె.దుర్గా ప్రసాదరావు, కె.జగదీశ్వరాచారి, ఎంఏక్యూ అఫ్రోజ్, బి. రాజ్ కుమార్, ఏఎన్ చారి, ఎల్.లోకేశ్వర రెడ్డి, కె.ఐలయ్య, పి.రాజేష్ కుమార్, ఎం.సతీష్ కుమార్, జి.విద్యా సాగర్, జి. శ్రీనివాస్, ఎ.సదానంద చారి, జి .కిషోర్ ఎన్నికయ్యారు.

ఆంధ్రప్రదేశ్ నుంచి జాతీయ కార్యదర్శిగా జి. మనోహర్, వర్కింగ్ కమిటీ సభ్యులుగా సి. వెంకటరావు, సిహెచ్ కుమార్, డి.ప్రసాద్, యు.ఎస్. రవికుమార్ ఎన్నికయ్యారు. జనరల్ కౌన్సిల్ సభ్యులుగా టీవీఎస్ కోటేశ్వరరావు, ఎస్. సత్తిరాజు, టి. రామకృష్ణ, జి. విశ్వనాథ్, వీవీఎస్ ప్రసాద్, డి.స్రవంత్, ఏఆర్‌సీ వర్మ, ఎస్ఎన్ రణదీప్ సింగ్, కేఎంఎస్‌సీ రాజు, పి. శ్రీనివాసరావు, సిహెచ్ మహేష్ కుమార్, వంశీకృష్ణ, అబ్దుల్ సలీమ్, సిహెచ్ పణీంద్ర కుమార్, ఎస్ మల్లికార్జున, ఐ.కె. కృష్ణమోహన్, పి. చంద్రశేఖర్, ఎస్ ఇస్సాక్, కె. బసవరాజ్ ఎన్నికయ్యారు.

కాళ్లకు చైన్లు, చేతులకు సంకెళ్లు..

వలసదారులకు తొలగని కష్టాలు




న్యూఢిల్లీ : సరైన పత్రాలు లేని వలసదారుల్ని స్వదేశం తిప్పి పంపుతున్న అమెరికా వారిపై అమానవీయంగా ప్రవర్తించడం మానడం లేదు. ఎన్ని విమర్శలు, ఆందోళనలు వస్తున్నా అమెరికా ప్రభుత్వం మాత్రం వలస దారుల్ని సంకెళ్లతోనే బంధించి సైనిక విమానాల్లో తరలిస్తోంది. ఈ విషయాన్ని స్వదేశం చేరకున్న భారత వలస దారులు స్వయంగా తెలిపారు. 'డిపోర్టేషన్'లో భాగంగా 116 మంది భారతీయులతో కూడిన రెండో విమానం శనివారం రాత్రి అమృత్‌సర్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. ఇందులో హోషియార్‌పూర్ జిల్లా కురలా కలాన్‌కు చెందిన దిల్జిత్ సింగ్ అనే వ్యక్తి.. అమెరికా ప్రయాణం గురించి మీడియాతో మాట్లాడాడు. తిరిగి వచ్చే సమయంలో అమెరికా అధికారులు వ్యవహరించిన తీరును వివరించాడు. కాళ్లకు చైన్లు, చేతులకు సంకెళ్లు వేశారని తెలిపారు. విమానం అమృత్‌సర్‌లో ల్యాండ్ అయ్యే ముందు సంకెళ్లను తొలగించారని అని దిల్జిత్ సింగ్ పేర్కొన్నారు. మహిళలకు మాత్రం సంకెళ్లు వేయలేదని తెలిపారు.

ఈ నెల 5న మొదటిగా వచ్చిన విమానంలోనూ 104 మంది వలస దారులకు చేతికి సంకెళ్లుగొలుసులతో బంధించి తీసుకొచ్చారు. దీనిపై తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చినా అమెరికా వెనక్కి తగ్గలేదు.

అమెరికా నుంచి శనివారం వచ్చిన సి-17విమానంలో 116మంది వలసదారుల్లో 65మంది పంజాబ్‌కు చెందినవారు, 33మంది హర్యానాకు చెందినవారు, ఎనిమిది మంది గుజరాత్‌కు చెందినవారు, ఉత్తరప్రదేశ్, గోవా, మహారాష్ట్ర, రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు చొప్పున, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్‌కు చెందిన వారు ఒక్కొక్కరు ఉన్నారని అధికారులు తెలిపారు. పంజాబ్‌కు చెందిన వారిని ఇమ్మిగ్రేషన్, నేపథ్య తనిఖీల తర్వాత పోలీసు వాహనాల్లో వారి ఇళ్లకు తరలించారు. హర్యానా ప్రభుత్వం తమ రాష్ట్రం చెందిన వారికి రవాణా ఏర్పాట్లు కూడా చేసింది.

బంగారు గనిలో పెను విషాదం

మాలిలో 48 మంది మృతి




బమాకో: పశ్చిమ ఆఫ్రికా దేశమైన మాలిలో ఘోర ప్రమాదం సంభవించింది. పశ్చిమ మాలిలో శనివారం ఒక బంగారు గని కుప్పకూలడవంతో 48 మంది కార్మికులు మర ణించారు. పదుల సంఖ్యలో కార్మికులు గాయపడ్డారు. ఆదివారం కూడా ప్రమాద ప్రాంతం వద్ద సహాయక చర్యలు కొనసాగుతు న్నాయని అధికారులు తెలిపారు. పేద దేశమైన మాలి ప్రపంచంలో ప్రముఖ బంగారు ఉత్పత్తి దేశాల్లో ఒకటిగా ఉంది. ఇక్కడ ముడి బంగారాన్ని వెలికి తీసి ఇతర దేశాలకు తరలిస్తుంటారు. అయితే ఇక్కడ గనులను అక్రమంగానూ లేదా ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలోనే మాలి బంగారు గనుల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. శనివారం జరిగిన ప్రమాదం నెల రోజుల వ్యవధిలోనే రెండోది. శనివారం కొండచరియలు విరిగిపడ్డంతో ఈ ప్రమాదం జరిగినట్టు అధికారులు తెలిపారు. కొంత మంది కార్మికులు నీటిలో కొట్టుకుపోయారని వెల్లడించారు. గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతోందని చెప్పారు. కాగా, జనవరి 29న తూర్పు మాలిలో కొలికోరో అనే ప్రాంతంలోని ఒక బంగారు గని కూలడంతో 12 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఎక్కువ మంది మహిళలే. అలాగే, గతేడాది జనవరిలోనూ మాలి రాజధాని బమాకో సమీపంలో జరిగిన దుర్ఘటనలో 70మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం ప్రపంచవ్యాప్తంగా విషాదం రేపింది. మాలి జనాభాలో 2 మిలియన్ల (10శాతం) కన్నా ఎక్కువ మంది మైనింగ్ రంగంపైనే ఆధారపడి జీవిస్తుంటారు. ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకుండా ప్రమాదకర పరిస్థితుల్లోనూ పనిచేస్తుంటారు.

ఇక వశపడ్తలేదు..

ఎక్కిళ్ళు వత్తే
ఏడుపాగి నట్టు
ఊసుల్ని నెమరేసుకుంటూ
దుఃఖాన్ని దిగమింగుతున్నా

బుసలు కొట్టే తాసు
కుబుసం యిప్పుకొని
తెలికపడ్డట్టుజి
కుంపట్ల కుత కుత ఉడుకుతున్న
ఈ మనసును సుత
ఏ కొయ్యకన్నా తగిలిస్తే బాగుండు



నిన్న మొన్న మాటల్ని
కూడేసుకుని కుప్పేసుకుని
ఈక పీక పీక్కుంటూ
కడుపుల ఇంత ఇసం పెంచుకుంటే
ఏం ఫాయిదా...
నిమ్మళంగ వున్న మనసును
పొక్కిలి పొక్కిలి చేయబట్టిరి

నట్టింట్లో కొచ్చిన ఆ
నలుగుర్ని నిలదీసి
తూర్పారబట్టక పోతి
ప్చ్..!

ఏ కువ్వారం లేకుండా జూస్కున్నా
తిన్నింటి వాసాలు లెక్కబెట్టిరి
సారెడు బతుక్కి
ఇన్ని కథలు పదాల్నా..!?

గొంతు పిడసగట్క పోతాంది
కన్నీటి చెమ్మ
పెయ్యంతా తడుముతాంది
ఇక వశపడ్తలేదు..

- డా.కటుకోర్వ్యుల రమేష్
సెల్:9949083327



రెక్కలు తెగిన వలస

దాలరు కాళ్లైంది
దాలరు రెక్కలైంది
మోహించి
దాలరు ముఖానికి
వలస జీవితాన్నద్దితే
వెలిగిపోతూ
బతుకును
ఎదురు తన్నుతోందిప్పుడు
కాళ్ళూ చేతులూ
సంకెళ్ల కుదించి

ఏళ్ళ కొద్ది
కరుడు గట్టిన కలల్ని
గాలి మోటర్కు కట్టేశాడు
అక్రమ వలస కందల
అంకుల్ శ్యామ్!
దాలరు కలలకు
తలుపులు మూసి
సవతి తల్లి పేగు బంధం
కొరికేస్తుంటే

అమెరికా మోడీ అదానీ
ప్రేమలో
తడిసిన ఉపఖండ
సింహాసనం
నాలిక పీకేసుకొని
వర్ణ వివక్ష నేల మీంచి
మతార్థిక వివక్షల
మాతృభూమి విసిరిన
రెక్కలు తెగిన వలస
యవ్వనానికి
భారీ పకోడీ తోరణం
కట్టింది
అచ్చేదిన్ ముఖంతోటి
స్వాగతంగా -


- వడ్డెబోయిన శ్రీనివాస్
9885756071

కాలక్రమంలో కనుమరుగౌతున్న తెలుగు పదాల గురించి ఇంతకు ముందు ఒక వ్యాసంలో ప్రస్తావించాను. చలము, బింకము, మోడి, మొదలైన ఎన్నో తెలుగు పదాలను కొన్ని దశాబ్దుల కింద కవులు, రచయితలు తమ రచనలలో వాడేవారు. ఇవి సంస్కృత పదాలు కావు, దేశ్య విశేష్యాలే అని తెలిసినప్పుడు కొంచెం ఆశ్చర్యం కలుగుతుంది. ఐతే, వీటితో పాటు ఇప్పుడు మరికొన్ని పదాలు అంతరించిపోతున్న శబ్దాల జాతుల (endangered word species) జాబితాలో చేరాయి - బట్టమేక పిట్ట (Great Indian Bustard) లాగా! సైతం అనే మాట అటువంటిదే. దాని గురించే ఈ చిన్న వ్యాసం.

సైతం - కూడ



ఎలనాగ
9866945424



ఈ రెండు పదాలు (సైతం, కూడ) పూర్తిగా సమానార్థకాలు అని ఒకసారి, కావు పరస్పరం భిన్నమైనవి అని మరొకసారి అనిపిస్తుంది - భాషాపండితులకు తప్ప. కూడ కూడాగా రూపాంతరం చెందింది. చాల చాలా అయింది. నుంచి నుంచీ అయింది. సామాజిక మాధ్యమాల్లో ఇటీవలి కాలంలో, తప్ప తప్పాగా మారుతుండటం మనం చూస్తూనే ఉన్నాం. నిఘంటువులను సంప్రదిస్తే, కూడకు సహితమనునర్థమును దెలుపునది, సహార్థకము మొదలైన అర్థాలు కనిపిస్తాయి. సైతంకు కూడా అటువంటి అర్థాలే కనపడుతాయి. సహితముకు రూపాంతరాలు సైతము, సయితము.

కొన్నిసార్లు ఇంగ్లిష్ పదాల సహాయంతో స్పష్టీకరించడం ద్వారా అర్థవివరణ సులభమవుతుంది కాబట్టి, ఆయా సందర్భాల్లో అది అనివార్యం అని చెప్పవచ్చు. ఇక్కడ ఆ విధంగా ఉపయోగపడే ఆంగ్లపదాలు also, even. 'నేను కూడా' అనడానికి I also, నేను సైతం అనడానికి even I సరిగ్గా సరిపోతాయి. నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను అని శ్రీశ్రీ అన్నప్పుడు, ఈ రెండు ఆంగ్ల పదాలలో ఆయన దేన్ని ఉద్దేశించాడో చెప్పాలంటే, వీటి మధ్య ఉన్న భేదాన్ని తరచి చూడాలి. ఇంగ్లిష్ లో ఈ రెండు శబ్దాలు పూర్తిగా సమానార్థకాలు కావని నిస్సందేహంగా చెప్పవచ్చు. Also అంటే in addition, too, as well as. Even కు ఈ అర్థాలకన్న, అయినా/అయినప్పటికీ బాగా సరిపోతాయి. అనూహ్యతను, పోలికలో బలిమిని సూచించడానికి ఈ మాటను వాడుతాం. Even a five-year-old boy can answer this question అంటే ఐదేళ్ల బాలుడు సైతం ఈ ప్రశ్నకు జవాబివ్వగలడు అనీ, Even an affluent person cannot afford to buy it అంటే ధనవంతుడు సైతం దాన్ని కొనలేడు అనీ అర్థాలు. అంటే, కొంత తక్కువతనాన్నో ఎక్కువతనాన్నో ఆపాదించి, ఆ నేపథ్యంలో చెప్పడం అన్నమాట. Also విషయంలో ఇది వర్తించదు. Also కు అదనంగా అని తప్ప వేరే అర్థం లేదు. శ్రీశ్రీ తన కవితా పంక్తిలో evenను కాకుండా also ను ఉద్దేశించాడని అనిపిస్తుంది. లేక even అనేదే అసలైన ఉద్దేశ్యమా? ఇక్కడ 'ఆఖరుకు' అనే మాటను ముందు చేర్చితే అర్థం ఇదమిత్థంగా సుబోధకమౌతుంది. ఆఖరుకు ఐదేళ్ల బాలుడు ... అని రాస్తే అది also కాదు even అని స్పష్టమౌతుంది. ఆఖరుకు అన్న పదాన్ని ముందు చేర్చకుండా అదే భావాన్ని స్ఫురింపజేయాలంటే, నేను లోని 'నే'ను ఒత్తి పలకాల్సిందే తప్ప, లిపి ద్వారా ఈ విషయాన్ని సూచించలేము. దీన్నే కాకువు అంటారు. నేను సైతం అని లిపిలో రాస్తే, 'నే' మీది ఊనిక వ్యక్తం కాదు.

కాబట్టి, also ను సూచించేందుకు 'కూడా', even ను సూచించడానికి 'సైతం' సరిగ్గా సరిపోయే పదాలు అనుకుంటాం. కానీ, అట్లాంటిదేం లేదు. తెలుగు, ఆంగ్లభాషలలోని పదప్రయోగాల సరళిని జాగ్రత్తగా పరిశీలిస్తే, మొదటిదానికి కూడా/సైతం, రెండవదానికి కూడ కూడా/సైతం సరైన పదాలే! అంటే సైతం, కూడ రెండూ పరస్పరం సమానార్థక (interchangeable) పదాలే. కనుక, %Even a five-year-old boy can answer this question అంటే ఐదేళ్ల బాలుడు 'కూడా' ఈ ప్రశ్నకు జవాబివ్వగలడు అనీ, Even an affluent person cannot afford to buy it అంటే ధనవంతుడు 'కూడా' దాన్ని కొనలేడు అనీ అర్థాలు అని కొత్తగా చెప్పుకోవచ్చు. ఐతే, Even I, I also ల అర్థాలు వేరువేరు అనేదాంట్లో ఎలాంటి మార్పూ లేదు. మరి అటువంటప్పుడు, ఇప్పటిదాకా చేసిన చర్చ అంతా కొండను తవ్వి ఎలుకను పట్టడం లాంటిదేనా అంటే, ఔననే చెప్పాలి.

కానీ, ఈ నేపథ్యంలో ఒక ప్రశ్నకు relevance (ప్రసంగ యోగ్యత?) చేకూరుతుందనుకుంటాను. ఆ ప్రశ్న ఏమిటంటే, సైతంను కూడతో సమానంగా కాకుండా చాలా అరుదుగా ప్రయోగించవలసిన అవసరం ఎందుకు, ఎలా ఏర్పడింది? ■

రెండు కోతులు ఒక పిల్లి కథ

మొరుగుతూ కరువ వచ్చే
కుక్కకు బొక్క
ఎలా వేయాలో రాజ్యానికి తెలుసు

తోకూపుతూ వెంట తిరిగేలా
ఎలా దువ్వి మచ్చిక చేసుకోవాలో
నాయకుడికి తెలుసు

నూకలు పెడితే మేకలు కాస్తది
ఆవు తోలు కప్పుకున్న పెద్దపులికి
నొసటన బొట్టు పెట్టి
కాళ్ల కడిగి నెత్తిన నీళ్ల చల్లుకుంటది

బెదిరింపు ఎక్కడిదాకా అంటే
ఏనుగుల దాకా అన్నట్టు
దీని పుట్టుబడే గంత
పెడితే పెళ్లి కోరుతది
లేకుంటే చావు చేస్తది

వినయ విధేయతలు ప్రదర్శించే నక్కలు
రంగులు మార్చే ఊసరవెల్లులు
వీటి ముందు బలాదూర్

బుక్కెడు బువ్వ వేస్తే తింటది
కాళ్ల చాపి సాయమానులో పంటది

గొంతు చించుకు అరవడం లేదు
మీది మీదికి వచ్చి కోర పండ్లతో
పిక్కల్ని చీల్చి కరవడం లేదు
యజమాని కాళ్లను నాలిక తడితో కడిగి
తోక ఊపుడు మాత్రం మరువ లేదు

శునకం రూపంలో ఉన్న మనిషికీ
మనుషుల రూపంలో శతకానికి
ఇప్పుడు పెద్దగా తేడా లేదు

చేతులలో వేప కొమ్మలు
ముఖాన బండారి పూసుకొని
రూపాయి బిళ్ళంత ఎర్రని బొట్టు పెట్టుకుని
సిగాలను ఎగదోస్తూ
అమాయకపు మేకపిల్లలను
అమాంతం గావు పడుతుంది

న్యాయం చెప్పమంటే
బర్రె దుడ్డె నాదేననే
పెద్ద మనిషి తీర్పు
రెండు కోతులు ఒక పిల్లి
రొట్టె పంచడంలో అదే నీతి
ఇప్పుడు మారకుంటే
ఇక ఎప్పుడూ మారదు రీతి

-జూకంటి జగన్నాథం

17న ఆవిష్కరణ సభ

చింతపట్ల సుదర్శన్ అనువాదం చేసిన పుస్తకాలు - **అంటరాని వాడు - ఆర్.కె. నారాయణ్ మాల్గుడి నవలలు** - ఆవిష్కరణ సభ ఈ నెల 17వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరుగుతుంది. ఈ రెండు పుస్తకాలను ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు, ఆర్.వి రామారావు ఆవిష్కరిస్తారు. సభకు కవి యాకూబ్ అధ్యక్షత వహిస్తారు. సభలో మామిడి హరికృష్ణ, కె.పి. అశోక్ కుమార్, ఏనుగు నరసింహారెడ్డి, కె. ఆనందాచారి, కొండపల్లి నీహారిణి ప్రసంగిస్తారు.

- పాలపిట్ట బుక్స్

23న దాశరథి - ఆరుద్ర సాహిత్య సమాలోచన

దాశరథి - ఆరుద్ర శతజయంతి సందర్భంగా సాహిత్య సమాలోచన సభ 23-02-2025, ఆదివారం ఉదయం 10 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. కె.ఆనందాచారి అధ్యక్షతన జరగనున్న ఈ సభలో తెలకపల్లి రవి, డా.ఏనుగు నరసింహారెడ్డి, ఆర్. సీతారాం, నామోజు బాలాచారి, వల్లాభాపురం జనార్ధన, ఆర్. రమేష్, డా.నాళేశ్వరం శంకరం, డా.తిరునగరి శరత్ చంద్ర, అనంతోజు మోహన్‌కృష్ణ, తంగిరాల చక్రవర్తి పాల్గొంటారు. పుప్ర జ్యోతి, డా.మల్లెగోడ గంగాప్రసాద్, డా.బి.బాలకృష్ణ, పెద్దపల్లి తేజస్వి, డా.శివరాత్రి సుధాకర్‌లు దాశరథి సాహిత్యంపై పత్ర సమర్పణ చేస్తారు. డా.గంజి శశిధర్ , తులసి గుగులోత్, మౌనశ్రీ మల్లిక్, డా.లక్ష్మి అసిరెడ్డి, బండారి రాజ్ కుమార్‌లు ఆరుద్ర సాహిత్యంపై పత్ర సమర్పణ చేస్తారు.

- తెలంగాణ సాహితి, 6309873682, 8897765417

23న అజరామర అక్షరం - 'ప్రజల మనిషి' సదస్సు

వట్టికోట ఆళ్వారుస్వామి రచన 'ప్రజల మనిషి' నవలను అజరామర అక్షరం పేరిట 23 ఫిబ్రవరి 2025 ఆదివారం ఉదయం 10గంటలకు కరీంనగర్ ఫిలిం భవన్‌లో పరిశీలన - పరామర్శ సదస్సును తెలంగాణ రచయితల వేదిక నిర్వహించబోతున్నది. ప్రధాన వక్తగా ప్రముఖ పరిశోధకులు రచయిత సంగిశెట్టి శ్రీనివాస్, వక్తలుగా నగునూరి శేఖర్, అన్నవరం దేవేందర్, గజోజు నాగభూషణం హాజరవుతారు.

- సి వి కుమార్, తెరవే, కరీంనగర్.

పుస్తకావిష్కరణ సభ

భగత్‌సింగ్ 'ఇంక్విలాబ్', **ఆర్ఎస్ఎస్ బీజేపీలు కోరుకునేది** ఈ రెండు పుస్తకాల ఆవిష్కరణ సభ ది.18.2.2025 మంగళవారం సాయంత్రం 6 గంటలకు అయిలమ్మ ఆర్ట్ గ్యాలరీ, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉంటుంది. కె.ఆనందాచారి అధ్యక్షతన జరిగే ఈ సభలో ఆవిష్కర్తగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, అనువాదకులు ఎస్ వినయకుమార్, జి రఘుపాల్, ఆర్ వాసు, డి కిష్టారెడ్డి తదితరులు పాల్గొంటారు.

- నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్

మాతృమూర్తులందరూ 'యోధ'లే

The house remains dark till the mother wakes up - Khalil Gibran....

ఖలీల్ జిబ్రాన్ చెప్పిన ఈ మాట మన జీవితాల్లో ప్రతి సందర్భంలో వర్తిస్తుంది. చీకటి ఆవరించిన ఇంటిలోకి అమ్మ వెలుగు తెస్తుంది. ఆ ఇంటిలో కకలావికలమైన కుటుంబాన్ని ఒక దగ్గరకు చేరుస్తుంది. ఆ కుటుంబాలన్నీ తల్లులు చేస్తున్న అనేకానేక త్యాగాల వల్లనే నిలబడి వున్నాయి. అమ్మల మెలకువ, తెలివిడి వలనే ఆ కుటుంబాలు మనగలుగుతున్నాయి. ఇంటా బయటా కుటుంబాల మనుగడ కోసం అమ్మలు చేసే పోరాటం యుద్ధంతో పోల్చదగిందే. ఇది అమ్మలు తమ ఆత్మగౌరవాన్ని, తమ కుటుంబాల్ని, సమాజంలో తమ స్థానాన్ని నిలుపుకోవడానికి సర్వశక్తులు ఒడ్డి చేసే యుద్ధం. ఈ యుద్ధంలో ముందుగా ఎదురయే శత్రువులు చాలావరకు స్వార్థసమాజానికి ప్రతిబింబమయిన తన అయినవాళ్ళే. అమ్మలకు సొంత ఇష్టాఅయిష్టాలుండవు. సొంత నిర్ణయాలు వుండవు. అసలు తనకంటూ సొంత జీవితమూ, ఆ జీవితంలో తమదైన సమయమూ వుండదు. అంతా కుటుంబం, పిల్లలని చూసుకోవడం అనే సాదాఖర్చులో కొట్టుకుపోతుంది.

బాధ్యతలే కాకుండా స్త్రీల హక్కుల గురించి పట్టించుకోవడం గురించి చాలా కాలంగా చర్చ జరుగుతోంది. అప్పుడే స్త్రీవాదం తెలుగు సాహిత్యంలోకి అనేక ప్రశ్నలు, సవాళ్ళతో దూసుకొచ్చింది. అందులో స్త్రీల మాతృత్వం అంశం కూడా ఒకటి. ఒక స్త్రీ తాను మాతృమూర్తి కావాలా వద్దా అనే విషయం సమాజమూ, ఇంట్లో వాళ్ళు, భర్త కాకుండా తానే స్వయంగా నిర్ణయం తీసుకోవడం సముచితం అని ఆలోచనాపరులు భావిస్తున్నారు. దీని కోసం ముందు మాతృత్వం చుట్టూ ఏర్పరిచిన భావజాలాన్ని బద్దలు కొట్టాల్సి వుంది.

ఈ విషయమే మాట్లాడుతూ ప్రముఖ రచయిత్రి ఓల్గా గారు ఈ పుస్తకం ముందుమాటలో " 1.వ్యక్తులుగా స్త్రీల మీద పురుషులు విధించే కంట్రోలుకి ఆధారాలు మతంలో, రాజ్యంలో వుంటాయి. వీటిని నిర్దేశించేది పితృస్వామ్యం. 2. పితృస్వామ్య నిర్మాణం జరిగే క్రమంలో మాతృత్వమనే భావజాల నిర్మాణాన్ని ప్రారంభించారు. స్త్రీలను లొంగదీసుకోవడానికి ఇది అత్యున్నతమైన, మిరుమిట్లు గొలిపే పదునైన ఆయుధమైంది. 3. సమాజ ఆర్థిక నిర్మాణాలలో ఎన్ని మార్పులు వచ్చినా, ఉత్పత్తి సంబంధాలలో ఎన్ని మార్పులు వచ్చినా, పునరుత్పత్తిలోని సాంఘిక సంబంధాలలో మార్పు రాదు. ఆ సాంఘిక సంబంధాల చక్రాన్ని తిప్పే ఇరుసు మాతృత్వ భావజాలం. 4. ఇవన్నీ జరగాలంటే ఈ విషయం (మాతృత్వం) గురించిన మిత్ (అభూత కల్పన, మాయ)లను ఛేదించాలి.

ఈ ప్రతిపాదనలు అర్థం చేసుకుంటే తప్ప, ఆచరిస్తే తప్ప, ఈ మాతృత్వ భావనల, కనపడని హింసల నుండి స్త్రీ విముక్తం కాదు. ఆ మేరకు స్త్రీలను చైతన్యపరుస్తూ రాసిన 53 కథల సమహారమే 'యోధ' పుస్తకం. ఓల్గా గారి సూత్రీకరణల ఆధారంగా చూసినప్పుడు ఈ కథలు మరింతగా అర్థం అయేందుకు అవకాశం వుంది.

ఎండపల్లి భారతి కథ 'తల పండిన గొడ్రాలు' నేరుగా స్త్రీల మాతృత్వం గురించి సమాజంలో చలామణీలో వున్న విలువల గురించి మాట్లాడుతుంది. కలిగిన కుటుంబాలలో కన్నా దిగువతరగతి వాళ్ళలో పిల్లలు లేని వాళ్ళను గొడ్రాలుగా ముద్రవేసి కించపరుస్తూ వుండడం చాలా ఎక్కువ. కనకవ్వదీ ఇక్కడ అదే పరిస్థితి. వాడకట్టు అంతా గొడ్డిదని ఈసడిస్తూ వుంటారు. ఏ రంపులోనయినా ఈ మాటతో కనకవ్వని గుచ్చిగుచ్చి పొడుస్తూ వుంటారు. కనకవ్వ గర్భం దాల్చకపోవడానికి మేల్నరుసు (పెద్ద డాక్టరమ్మ) కారణం చెప్పినా నాటువైద్యానికి మొగ్గు చూపే నిరక్షరాస్యులైన జనం, సరైన వైద్యం చేయించుకోవడానికి సిద్ధపడరు. ఆమె వాడే భాష కూడా ఆమె కథలకు ఒక విధమైన శైలీగత సొబగును అద్దుతుంది. సామెతలు, నుడికారం, యాస ఆమె కతల్లో సునాయాసంగా దొర్లిపోతుంటాయి.



పి.శ్రీనివాస్ గౌడ్
99494 29449

మాతృత్వం అంటే పిల్లని కనడమే కాదు..సరైన విధానంలో పెంచడం కూడా. పిల్ల పెంపకం అనివార్యంగా స్త్రీల మీద అనాయాసంగా తోసేసే పురుషాధిక్య వ్యవస్థ వేళ్ళూనుకొని వున్నప్పుడు, పిల్లలను పెంచాల్సిన బాధ్యత ఎలా ఆ స్త్రీల కుటుంబ సభ్యుల మీదకు మోపబడితుందో సమ్మెట ఉమాదేవి గారి కథ చర్చిస్తుంది.

వి.శాంతి ప్రబోధ గారి కథ 'గణేష్ అలియాస్ గౌరీ' భిన్నమైన కథ. తనలో స్త్రీని కనుగొన్న గణేష్ గౌరిగా మారి, తను ఒక బిడ్డకు జన్మనివ్వాలని కోరుకోవడం, ట్రాన్స్ మహిళ శరీరస్వభావ రీత్యా అది సాధ్యం కాదని, ప్రాణాలకి ప్రమాదమని వైద్యులు తేల్చడంతో పురుషుడు (యువరాజు)గా మారిన యమున సహకారంతో గౌరి ఎలా తన కోరిక తీర్చుకోగలిగిందనేది కథ. ట్రాన్స్ జెండర్ గా మారడమే మనకు ఒక వండర్ అయితే మాతృత్వ స్పర్శను అనుభవించాలనుకోవడం మరొక వండర్. వారు తమకిష్టమైన జీవితాన్ని జీవించడానికి చూపించే తెగువ మనకు అర్థం కావాలంటే we must stand on their shoes. ఈ కథలోని multidimensions మనల్ని ఆలోచనకు, ఆశ్చర్యానికి గురి చేస్తాయి. LGBTQ సమూహాల గురించిన లోతైన అవగాహన వుంటే తప్ప ఇటువంటి కథలు రావు.



వి.ప్రతిమ గారి ' నిగూఢ' కథ మహిళల్లో ఆధునిక పద్ధతుల ద్వారా గర్భం ధరించడం గురించి చెబుతుంది. సరోగసీ, IVF విధానాల ద్వారా కృత్రిమ గర్భధారణ ధరించి సంతానం పొందే విధానం అన్నమాట. పిల్లలు లేరనే వ్యధను, ఇరుగుపొరుగు వెక్కిరింపులు ఇప్పుడు మహిళలు పడనవసరం లేదు. శారద కోడలు పవిత్రకు పిల్లలు లేకపోతే శారద స్నేహితురాలు డాక్టర్ జయప్రద IVF పద్ధతి ద్వారా పవిత్రకు గర్భం వచ్చేలా చేసి, కుటుంబంలో సంతోషం నింపుతుంది. చాలాకాలం తర్వాత ఇండియా వచ్చిన జయప్రద శారదను కలిసి రెండు రోజులు కలిసి వుంటుంది. అంతకాలం తను మోస్తున్న ఒక చిన్న గిల్ట్‌ను శారదకు చెప్పేస్తుంది. ఆ నిగూఢ రహస్యం ఏమిటో కథ చదివి తెలుసుకోవాల్సిందే.

కల్పనా రెంటాల గారి కథ 'నో రిగ్రెట్స్' పిల్లలు వద్దనుకునే శ్రీజ, అనీష్ జంట నిర్ణయం మింగుడు పడని కుటుంబ సభ్యుల తీవ్ర ఒత్తిడుల మధ్య వారిని సమాధానపరచలేక 'Motherhood is not my cup of Tea' అని తెగేసి అంటుంది శ్రీజ. పిల్లల్ని కన్నంత మాత్రాన తల్లి కాలేమని చర్చ చేస్తుంది. Child free గా వుండదలుచుకోవడం వెనుక పిల్ల పెంపకం ఒక పెద్ద సామాజిక బాధ్యత అనే విషయం undercurrentగా చెపుతుందీ కథ.

'మార్పు అనివార్యం' కథలో భండారు విజయ గారు చర్చించిన సమస్య మన సమాజంలో ఎప్పటి నుంచో వున్నా, ఆధునిక సమాజం ఇచ్చిన ఆధునిక ఆలోచన ధోరణి వల్ల ప్రతి సమస్యను సహానుభూతితో చూసే ఒక పద్ధతి అలవడింది. సభ్యసమాజం ఏకపక్షంగా తిరస్కరించే అనేక వ్యవస్థీకృత సమస్యలను కూడా నేడు పరిష్కారం దిశగా ఆలోచిస్తున్నారు. ఈ కథలో విజయ గారు హార్మోన్స్ ఇన్‌బ్యాలెన్స్ వల్ల యువతీయువకుల శరీరాల్లోనూ, తదనుగుణంగా వారిలో మానసికంగా వచ్చే మార్పుల వల్ల ఉత్పన్నమయే సమస్యలను చర్చించారు. కొడుకు మధు ప్రవర్తనలో తేడా కనిపెట్టిన వరుణ కొడుకు 'గే' అని తెలుసుకొని, బాధపడి ఆ సమస్యకు పరిష్కారం కోసం స్నేహితులను సంప్రదిస్తుంది. డాక్టర్స్ సలహా కూడా తీసుకుంటుంది. కానీ పరిష్కారం దొరకదు. క్లాస్‌మేట్ లలిత అక్క మాలతిని కలుస్తారు. మాలతి కొడుకు ఆనంద్ తల్లి సాయంతో జెండర్ ఆపరేషన్ చేసుకొని తనకిష్టమైన అనామికగా మారి, ఒక స్వచ్ఛంద సంస్థలో LGBTQ సమూహం కోసం పని చేస్తూ వుంటుంది. కొడుకు పట్ల ఎంతగానో ఆందోళన చెందుతూ వున్న వరుణను ఉద్దేశించి అనామిక చెప్పిన మాటలు ఈ సమాజమూ, ముఖ్యంగా ఇటువంటి హార్మోన్స్ ఇన్‌బ్యాలెన్స్ వల్ల వచ్చే జెండర్ సెన్సివిటీ సమస్యలు ఎదుర్కొనే తలిదండ్రులు తప్పక చదవాల్సినవి.

డా.దుట్టా శమంతకమణి కథ 'మృదుమధురం' పిల్లల పెంపకం బాధ్యత తండ్రి తీసుకోవడం గురించి మాట్లాడింది. నిజంగానే పిల్లలను పెంచాలనుకుంటే మగవారు ఆ పని భేషుగ్గా చేయవచ్చు. కానీ, లోకరీతి ప్రకారం భారం తల్లి తీసుకుంటుంది కాబట్టి ఊరకుండిపోతారు. కానీ, కొన్ని చోట్ల అరుదుగానైనా భిన్నంగా జరగడానికి ఆస్కారం వుంటుంది కదా! ఈ కథలో అదే జరిగింది. మధు తనని విడిచి వెళ్ళిన భార్య నుండి పిల్లలను తెచ్చుకొని సక్రమంగా, బాధ్యతగా పెంచాడు. మధు స్నేహితురాలు మృదుల కూడా ఇటువంటి పరిస్థితులలోనే పిల్లలను పెంచుతుంది. వీరిద్దరికీ ఎటువంటి ప్రేమభావనలు లేనప్పటికీ రచయిత్రి ఈ కథకు మృదుమధురం అని ప్రధాన పాత్రల పేర్లు పెట్టడం, వీరి నైతిన ప్రవర్తన పట్ల కలిగిన ఏకీభావం వలన కావొచ్చు. అవసరమైనప్పుడు పిల్లల పెంపకం బాధ్యత తండ్రి తీసుకోవడం జరగాలనేది కథ సారాంశం.

మాతృత్వం - భిన్న ధోరణులు అన్నట్టు గానే కథలన్నీ మాతృత్వం చుట్టూ, మాతృత్వం చుట్టూ అల్లుకున్న మాయ చుట్టూ, పునరుత్పత్తి రాజకీయం చుట్టూ, అనేక పొరలుగా అల్లుకున్న మాతృత్వ అనుబంధాల చుట్టూ తిరిగాయి. అనేక ఆశ్చర్యకరమైన కోణాల నుంచి విలువైన చర్చ చేసాయి. కొన్ని సమస్యలకు కొన్ని పరిష్కారాలు ఇచ్చాయి. అయితే ఇన్ని కథల్లో కొన్ని కథలు మాత్రం మాతృత్వం అనే వస్తువు కాకుండా కడుపుతీపి, బంధం, అమ్మ ప్రేమ వంటి ఇతర అంశాల చుట్టూ తిరిగాయి. కొన్ని కథలు అతి సాధారణ స్థాయిలో వున్నాయి.

'యోధ' కథల సంపాదకురాలు భండారు విజయ గారు " 'మాతృత్వ' భావన చాటున స్త్రీలకు ఎదురైన మానసిక, శారీరక సంఘర్షణలను, హింసలను, సామాజిక సవాళ్ళను ఆత్మస్థైర్యంతో ఎదుర్కొని, ధైర్యంగా నిలబడిన ' యోధ'ల జీవిత చిత్రణలే ఈ కథలు " అన్నారు. కాబట్టి మనం ఈ కథలను ఈ వాక్యాల వెలుగులో చదవాల్సిన, అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

'ఒక ఆడది పిల్లలు కనే విషయంలో ప్రశ్నించడమా' అని బుగ్గలు నొక్కుకునే సభ్య సమాజానికి కూడా మాతృత్వమనే మాయ వెనుక ఇన్ని రాజకీయాలు, ఇంత అణచివేత, ఇంత హింస, ఇంత వేదన, ఇంత త్యాగం వుంటాయని, ఆ కోణాలని, ఆ భిన్న వ్యక్తీకరణలను విప్పి చూపించి, అర్థం చేయించే ప్రయత్నం చేస్తాయీ కథలు. కొంత ఆలోచనా ధోరణిని మార్చే ప్రయత్నం కూడా చేస్తాయి. ఆ మేరకు హస్మిత ప్రచురణల సంపాదకుల ప్రయత్నం సఫలీకృతం. ■

ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి

- వార్డెన్ నిర్లక్ష్యమే కారణమని బంధువుల ధర్నా
- పట్టించుకోని అధికారులు




నవతెలంగాణ-వాజేడు

అనారోగ్యంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతిచెందిన ఘటన ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరులో ఆదివారం జరిగింది. విద్యార్థి మృతితో వార్డెన్ నిర్లక్ష్యమే కారణమంటూ పాఠశాల ఎదుట బాధితులు ధర్నా చేపట్టారు. వివరాల్లోకెళ్తే... పేరూరుకు చెందిన సోయం శైలజకు ఇద్దరు కుమార్తెలతోపాటు కుమారుడు సోయం వినీత్ (14) ఉన్నారు. జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఓ ప్రయివేట్ కంపెనీలో పనిచేసుకుంటూ పిల్లలను పోషిస్తోంది. కాగా వినీత్.. పేరూర్ ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. శనివారం గ్రామ హెల్త్ వర్కర్ టాబ్లెట్ ఇవ్వగా తగ్గుముఖం పట్టింది. రెండు రోజులు సెలవులు రావడంతో వినీత్‌ను వారి మేనమామ శ్రీకాంత్ ఇంటికి పంపించారు. ఆదివారం మరలా జ్వరం రావడంతో స్థానిక ఆర్ఎంపీ వద్ద చూపించారు. అయినా తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం ఏటూరునాగారం వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఇందుకు కారణం వార్డెన్ నిర్లక్ష్యమేనంటూ ఆశ్రమ పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. తమ కుమారుని ఆరోగ్య విషయం తమకు తెలపకుండా నిర్లక్ష్యం చేశారని, పాఠశాల వార్డెన్, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు మృతిచెందాడని బాధితులు ఆరోపించారు. గంటకుపైగా పాఠశాల ఎదుట ధర్నా చేసినా సంబంధిత అధికారులు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ ధర్నా విరమించి తిరిగి వెళ్లినట్టు సమాచారం. కాగా, వినిత్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

టెక్స్‌టైల్ ఎగుమతుల్ని పెంచడమే లక్ష్యం

- ప్రధాని మోడీ

న్యూఢిల్లీ: జౌళి ఉత్పత్తుల ఎగుమతుల్ని పెంచడమే లక్ష్యంగా కేంద్రం పలు చర్యలు తీసుకుంటోందని ప్రధాని మోడీ తెలిపారు. ఈ రంగంలో వార్షిక ఎగుమతులను 2030 కన్నా ముందే రూ.9 లక్షల కోట్ల లక్ష్యాన్ని సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఫిబ్రవరి 14 నుంచి 17వరకు జరుగుతున్న భారత్ టెక్స్ కార్యక్రమానికి ఆయన ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. టెక్స్‌టైల్ రంగానికి బ్యాంకులు సహకారం అందించాలని, తద్వారా ఉపాధి పెంచేందుకు సహకరించాలని కోరారు. ప్రపంచంలోనే ఆరో అతిపెద్ద వస్త్ర ఎగుమతిదారుగా ఉన్న భారత్.. గతేడాది 7శాతం వ ృద్ధి నమోదు చేసిందన్నారు. ప్రస్తుతం రూ.3లక్షల కోట్లుగా వార్షిక ఎగుమతుల్ని 2030 నాటికి రూ.9లక్షల కోట్లకు పెంచడమే టార్గెట్‌గా పెట్టుకున్నట్టు తెలిపారు. భారత్ టెక్స్ 2025లో 120కి పైగా దేశాలు పాల్గొంటున్నాయన్నారు.భారత్ హై-గ్రేడ్ కార్బన్ ఫైబర్ తయారీ దిశలో ముందుకు సాగుతోందని, వస్త్ర రంగంలో నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులను తయారు చేసేందుకు క ృషిచేస్తున్నట్టు తెలిపారు. సాంకేతిక వస్త్ర రంగంపై ద ృష్టి సారించామన్నారు. మరోవైపు, ప్రధాన పత్తి రకాల ఉత్పాదకతను పెంచేందుకు కేంద్రం రూ.500 కోట్లతో కాటన్ మిషన్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. అంతేకాకుడా, 2025-26 బడ్జెట్‌లో జౌళి మంత్రిత్వ శాఖకు కేంద్ర బడ్జెట్‌లో రూ.5,272 కోట్లు కేటాయించింది.

డంపింగ్ యార్డ్ పనుల ముట్టడికి యత్నం

- అడ్డుకున్న పోలీసులు..
- 11వ రోజుకు చేరుకున్న నిరసనలు



నవతెలంగాణ-గుమ్మడిదల

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల పరిధిలోని నల్లవల్లి పంచాయతీ ప్యారానగర్‌లో చేపడుతున్న డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులను ఆందోళనకారులు ఆదివారం అడ్డుకోవడానికి ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో.. నిరసన చేపడుతున్న మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నిర్మాణ పనులను నిలపివేయాలని నినదించారు. 11 రోజులుగా నిరసనలు చేపడుతున్నా.. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించడం లేదని.. దాంతో నేటి నుంచి మహిళలందరం కలిసి నిర్మాణ పనులను అడ్డగిస్తామని హెచ్చరించారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు వెంటనే ప్రత్యేక చొరవ తీసుకొని డంపింగ్ యార్డ్ అనుమతులు రద్దు చేస్తూ ఉత్తర్వులను జారీ చేయాలని కోరారు. లేని పక్షాన ఎంతమంది పోలీసు బలగాలు ఉన్నా.. తమ ప్రాణాలను పణంగా పెట్టి అయినా డంపింగ్ యార్డ్ నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాడుతామని స్పష్టంచేశారు.

కుక్కల దాడిలో 27 గొర్రెలు మృతి

నవతెలంగాణ-అర్వపల్లి



గొర్రెల మందపై వీధి కుక్కలు స్వైరవిహారం చేసిన సంఘటనలో 27 గొర్రెలు మృతిచెందిన ఘటన సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం జాజిరెడ్డిగూడెం గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. జాజిరెడ్డిగూడెంలో మెరుగు దేవయ్య రోజు మాదిరిగానే గొర్ల దొడ్డిలో గొర్లను సాయంత్రం వదిలి తాను ఇంటికి వెళ్లాడు. కాగా, అర్ధరాత్రి సమయంలో వీధికుక్కలు గొర్ల గుంపుపై దాడి చేశాయి. ఈ దాడిలో 27 గొర్రెలు మృతి చెందాయి. దాంతో రూ.3 లక్షల నష్టం వాటిల్లింది. బాధిత కుటుంబాన్ని తుంగతుర్తి బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. తనను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

బిజినెస్

స్టింగ్ మెటావర్స్‌కు రూ.10.21 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో గేమింగ్ కంపెనీ స్టింగ్ మెటావర్స్ రూ.10.21 కోట్ల నికర లాభాలు సాధించినట్లు తెలిపింది. ఇదే సమయంలో రూ.115.69 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. 2024 డిసెంబర్ ముగింపు నాటికి 30 లక్షల వినియోగదారుల మైలురాయికి చేరుకున్నట్లు వెల్లడించింది. రెండు నెలల్లోనే కొత్తగా 5 లక్షల ఖాతాదారులను సంపాదించుకున్నట్లు పేర్కొంది. నెలకు ఒక్క బిలియన్ డాలర్ల లావాదేవీలకు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది.

ఐపీఓకు ఇన్నోవేటివ్యూ ఇండియా

- సెబీకి దరఖాస్తు

నవ తెలంగాణ - హైదరాబాద్

ఎన్నికలు, పరీక్షలు తదితర భారీ కార్యక్రమాలకు ఆటోమేటెడ్ యాన్సిలరీ సెక్యూరిటీ, సర్వైలెన్స్ సొల్యూషన్స్ అందిస్తున్న టెక్ ఆధారిత సంస్థ ఇన్నోవేటివ్యూ ఇండియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు రానుంది. ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా రూ.2,000 కోట్ల వరకు నిధులు సమీకరించేందుకు సెబీకి డిఆర్‌హెచ్‌పిని సమర్పించినట్లు ఆ కంపెనీ తెలిపింది. ఈ ఇష్యూలో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) మార్గంలో షేర్లను విక్రయించడం ద్వారా నిధులు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. ఇందుకోసం ఒక్కో షేరు ముఖ విలువ రూ.5గా ఉంటుంది. దేశీయంగా ఎగ్జామినేషన్ ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ సొల్యూషన్స్ విభాగంలో 2024 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం పరంగా 73.7 శాతం మార్కెట్ వాటాతో ఇన్నోవేటివ్యూ ఇండియా అతి పెద్ద కంపెనీగా నిలిచింది.

నార్త్ సిటీ మెట్రో కారిడార్లలో జోరుగా సర్వే

- ఈ నెలాఖరుకల్లా ట్రాఫిక్ సర్వే, భూ సామర్థ్య పరీక్షలు పూర్తి
- మార్చి చివరి నాటికి ఫ్యూచర్‌సిటీతో సహా నార్త్ సిటీ కారిడార్ల డీపీఆర్‌లు సిద్ధం : మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జేబీఎస్ నుంచి మేడ్చల్(24కి.మీ), జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ (21కి.మీ) మెట్రో కారిడార్లకు డీపీఆర్‌ల తయారీకి అవసరమైన వివిధ రకాల సర్వే పనులు జోరుగా సాగుతున్నాయని హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. డీపీఆర్‌ల తయారీకి మూడు రకాలైన అధ్యయనాలు అవసరమని, ట్రాఫిక్ సర్వే, భూసామర్థ్య పరీక్షలు (జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్), పర్యావరణ ప్రభావ అధ్యయనం (ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్) అని వెల్లడించారు. ట్రాఫిక్ సర్వేకి సంబంధించిన అధ్యయనంలో ఈ కారిడార్లలో ప్రస్తుతం జరుగుతున్న రోజు వారీ ప్రయాణాల సంఖ్య, భవిష్యత్‌లో జరగబోయే రోజు వారీ ప్రయాణాల అంచనాలు, జంక్షన్ల వద్ద ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు తీసుకునే మలుపులు, నడక ప్రయాణికుల సంఖ్య, వాహన ప్రయాణాలకు పట్టే సమయం, వాహన ప్రయాణాల్లో ఎంత శాతం మెట్రో రైలుకు మారే అవకాశం, వివిధ మెట్రో స్టేషన్లు ఏర్పాటయ్యే ప్రదేశాల ప్రయాణ సాంద్రత వంటి అనేక అంశాలు పరిశీలిస్తామని చెప్పారు.

మేడ్చల్, శామీర్‌పేట్ రూట్‌లో 25 చోట్ల పరీక్షలు పూర్తి

ప్రాజెక్ట్ పర్యావరణ ప్రభావ అధ్యయనంలో ప్రస్తుత ఈ మార్గాల్లో ఉన్న గాలి పరిశుభ్రత, గాలిలో ఉన్న ధూళికణాల శాతం, కాలుష్య కారకాల నిర్ధారణ, శబ్ద కాలుష్యం, నీటి వనరులు, వృక్ష, జంతుజీవాల జీవ వైవిధ్యం, జీవనాధారభ్రుతులపై ప్రాజెక్టు చూపే ప్రభావం వంటి అంశాలు పరిశీలన చేయాల్సి ఉందని మెట్రో ఎండీ తెలిపారు. ఇక భూసామర్థ్య పరీక్షల్లో ఈ మార్గాల్లో ఉండే వివిధ రకాల మట్టి, రాతి పొరల నమూనాలు, వివిధ నిర్మాణాలకు కావాల్సిన భూ సామర్థ్య పరీక్షలు, భూగర్భంలో నిక్షిప్తమైన నీటి లెవెల్స్ అంచనాలు, భూకంపాలు ఏర్పడే అవకాశాలు వంటి విషయాలూ క్షుణ్ణంగా అధ్యయనం చేసి, మెట్రో స్తంభాలు, స్టేషన్లు, ఇతర నిర్మాణాలను ఎంత బలంగా డిజైన్ చేయాలో నిర్ణయిస్తామన్నారు. సామాన్యంగా ప్రతి అర కిలోమీటర్‌కి ఒక బోర్ హెూల్ చొప్పున భూసామర్థ్య పరీక్షల నమూనాలు తీసుకోవడం జరుగుతోందని, ఒక్కొక్క బోర్ హెూల్‌ను యాభై నుంచి వంద అడుగుల లోతు వరకు డ్రిల్లింగ్ చేసి, ఏ స్థాయిలో భూమి గట్టి తనంగానీ లేదా రాతి పొరలు తగులుతాయో పరిశీలిస్తామని చెప్పారు. ఇప్పటికే హెచ్ఎండీఏ, జాతీయ రహదారుల సంస్థ.. కొన్ని భూ సామర్థ్య అధ్యయనాలు చేపట్టడం వల్ల, ఇప్పుడు తమ సంస్థ జేబీఎస్ - మేడ్చల్ మార్గంలో 25 చోట్ల, జేబీఎస్-శామీర్‌పేట్ మార్గంలో 19 చోట్ల ఈ భూసామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వీటిలో మేడ్చల్ రూట్‌లో 14 చోట్ల, శామీర్‌పేట్ మార్గంలో 11 చోట్ల ఇప్పటికే పరీక్షలు పూర్తయ్యాయని, ఈ నెలాఖరులోగా మొత్తం అన్ని జాగాల్లో ఈ పరీక్షలు పూర్తవుతాయని చెప్పారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సాఫీగా ప్రయాణించే విధంగా ఈ మెట్రో కారిడార్లను నిర్మించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో కేంద్రానికి..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల ప్రకారం ఈ అధ్యయనాలు అన్నీ పూర్తి చేసి మార్చి నెలాఖరుకు శంషాబాద్ విమానాశ్రయం - ఫ్యూచర్ సిటీ మార్గంతో సహా ఈ మూడు మెట్రో మార్గాల డీపీఆర్‌లను సంపూర్ణ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ అనుమతికి సమర్పిస్తామని, రాష్ట్ర ప్రభుత్వ అనుమతి పొందిన తర్వాత డీపీఆర్‌లను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు.

అమెరికాలో ఆర్మీ నిధుల గోల్‌మాల్

- సైనికుల కడుపుకొట్టి దారి మళ్లిన ఫండ్స్ : మిలిటరీ డాట్ కామ్ నివేదిక



వాషింగ్టన్: అమెరికా ఆర్మీ (యూఎస్ ఆర్మీ) ఆహార కార్యక్రమం కోసం సైనికుల నుంచి సేకరించిన నిధులలో అత్యధిక భాగాన్ని ఇతర ప్రాజెక్టులకు మళ్లిస్తున్నట్టు మిలిటరీ డాట్ కామ్ తీవ్ర స్థాయిలో ఆరోపించింది. సేకరించిన నిధుల్లో సగం కంటే తక్కువ మాత్రమే సైనికుల భోజనానికి వినియోగిస్తున్నట్టు పేర్కొన్నది. వారి నుంచి ఆహారం కోసం మొత్తం 225 మిలియన్ డాలర్లు సేకరించగా.. వాటిలో కేవలం 74 మిలియన్ డాలర్లు మాత్రమే వెచ్చించినట్టు నివేదిక వెల్లడించింది. సాధారణంగా బ్యారక్‌లలో ఉంటున్న ప్రతి సైనికుడి వేతనం నుంచి ప్రతి నెలా 460 డాలర్లు కట్ చేస్తారని ఓ అధికారి వివరించారు. సిబ్బందికి ఆహారం అందించడానికి ఈ నియమం పెట్టుకున్నట్టు తెలిపారు.ఇందులో భాగంగా 2024లో దేశంలోని పలు స్థావరాల్లోని సైనికుల నుంచి 225 మిలియన్ డాలర్లు తీసుకున్నారనీ, కానీ వాటిలో దాదాపు 151 మిలియన్ డాలర్లను ఇతర ప్రాజెక్టులకు మళ్లించారని మిలిటరీ డాట్‌కామ్ వెల్లడించింది. అయితే, వారి నుంచి సేకరించిన వాస్తవ నగదు మరింత అధికంగా ఉండే అవకాశం ఉన్నట్టు అనుమానం వ్యక్తం చేసింది. మరోవైపు, జార్జియాలోని ఫోర్ట్ స్టీవర్ట్‌లో సైనికుల నుంచి 17 మిలియన్ డాలర్లు వసూలు చేస్తే.. అందులో కేవలం 2.1 మిలియన్లు మాత్రమే ఆహారం కోసం ఖర్చు చేసినట్టు నివేదికలు పేర్కొంటున్నాయి. ఫుడ్ కోసం కేటాయించిన నిధులలో దాదాపు 87శాతం ఇతర ప్రాజెక్టులకు మళ్లించినట్టు తెలిపాయి.

సైనికుల ఆహారం నుంచి నిధులను దొంగిలిస్తూ.. సైనిక సంసిద్ధతను సాధించడం సాధ్యం కాదని ప్రతినిధుల సభ సభ్యుడు జుల్ టోకుడ వ్యాఖ్యానించారు.

సైనికుల నుంచి దాదాపు 151 మిలియన్ డాలర్లు సేకరించారనీ, కానీ అవసరాలకు తగినట్టు మాత్రం ఆహారం అందించలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనితో సైనికులు ఆహార కొరతను ఎదుర్కొంటున్నారన్నారు. వారికి నాణ్యమైన ఆహారం అందించటంలేదని పలువురు అధికారులు ఫిర్యాదు చేశారు. సరిగ్గా ఉడకని మాంసం, నాసిరకం కూరగాయలతో భోజనం పెడుతున్నట్టు వెల్లడించారు.

దేశ రక్షణకు ఏం చేసినా చట్ట ఉల్లంఘన కాదు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్

- వైరల్‌గా మారిన వీడియో పోస్టు



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పాలనలో డిఫరెంట్‌గా చూపాలనుకుంటున్నారో.. ఏమో కానీ ఆయన తీరు వివాదాస్పదమవుతూనే ఉన్నది. నిత్యం పదుల సంఖ్యలో కార్యనిర్వాహక ఉత్తర్వుల (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్)పై సంతకాలు చేస్తున్నారు. వీటిల్లో అక్రమ వలసలకు వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యలు, ట్రాన్స్‌జెండర్లు యూఎస్ సైన్యంలో పనిచేయకుండా నిషేధం, ప్రభుత్వ నియామకాలపై బ్యాన్, క్యాపిటల్ హిల్‌పై దాడిచేసిన వారికి క్షమాభిక్ష, ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ నేతృత్వం వహిస్తున్న డోజ్‌కు కీలక బాధ్యతలు అప్పజెప్పడం, ఫెడరల్ వర్క్‌ఫోర్స్‌ను తగ్గించే ప్రయత్నాలు, జన్మత వచ్చే పౌరసత్వం రద్దు వంటి విషయాలపై పలు వ్యాజ్యాలను ఎదుర్కొంటున్నారు. యూఎస్ రాజ్యాంగానికి విరుద్ధంగా ఆయన నిర్ణయాలు తీసుకుంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో తన సొంత సోషల్ మీడియా ట్రూత్ వేదికగా ట్రంప్ చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. "తన దేశాన్ని రక్షించేవాడు ఎలాంటి చర్యలు తీసుకున్నా.. అది చట్టాల్ని ఉల్లంఘించినట్టు కాదు" అని ఫ్రెంచ్ నియంత నెపోలియన్ వ్యాఖ్యలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ పోస్టుతో ఆయన తన చర్యలను సమర్థించుకుంటున్నట్టు స్పష్టమవుతోంది. ఫ్రాన్స్‌ను నెపోలియన్ పరిపాలిస్తున్న సమయంలో.. తన నిరంకుశ పాలనను సమర్థిస్తూ తరచూ ఆయన ఈ వ్యాఖ్యలు చేసేవారు. ట్రంప్‌నకు బద్ధవిరోధి అయిన కాలిఫోర్నియా సెనేటర్ ఆడమ్ షిఫ్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. అమెరికా అధ్యక్షుడు 'నిజమైన నియంతలా మాట్లాడారు' అని అభివర్ణించారు.

అంతర్జాతీయ కార్యక్రమాలకు యూఎస్ ఎయిడ్ సంస్థ ద్వారా అందుతున్న నిధులను నిలిపివేస్తున్నట్టు ట్రంప్ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, ఈ ఆదేశాలపై ఫెడరల్ జడ్జి అమీర్ అలీ తాజాగా తాత్కాలికంగా స్టే ఇచ్చారు. తన ఉత్తర్వును అమలు చేస్తున్నదీ, లేనిదీ అయిదు రోజుల్లో తెలపాలని ట్రంప్ సర్కారును ఆదేశించారు.

బ్రెజిల్ వేదికగా బ్రిక్స్ సదస్సు

- జులై 6, 7 తేదీల్లో నిర్వహణ : విదేశాంగ మంత్రి మౌరో వియోరా వెల్లడి

రియో డి జనీరో : బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు బ్రెజిల్ లోని రియో డి జనీరోలో జరగనున్నట్టు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. జులై 6, 7 తేదీల్లో దీనిని నిర్వహించనున్నట్టు ఆ దేశ విదేశాంగ మంత్రి మౌరో వియోరా వివరించారు. బ్రిక్స్ దేశాల అభివృద్ధి, సహకారం, ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు ఈ సదస్సుల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్టు తెలిపారు.గతేడాది అక్టోబరులో రష్యాలోని కజాన్ నగరం వేదికగా ఈ సదస్సు జరిగిన సంగతి తెలిసిందే. దీనికి ప్రధాని మోడీ, రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో సహా పలువురు దేశాధినేతలు హాజరయ్యారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలోని పరిస్థితులు, ఉగ్రవాదం వంటి సమస్యలపై దేశాధినేతలు చర్చించారు. ఈ సమావేశంలోనే భారత్, చైనాల సరిహద్దు వివాదంపై కీలక చర్యలు తీసుకొన్నారు. బ్రిక్స్ దేశాలు ఉమ్మడి కరెన్సీ రూపొందించడంపై దృష్టి సారించాలని పుతిన్ ఆ సదస్సులో పిలుపునిచ్చారు. ప్రస్తుతం కూటమిలోని దేశాలు డిజిటల్ కరెన్సీ వాడుకునేందుకు భారత్‌తో కలిసి రష్యా పని చేస్తుందన్నారు. ఈ ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్రంగా పరిగణించారు. డాలర్‌కు ప్రత్యామ్నాయంగా మరో కరెన్సీని వాడకంలోకి తెస్తే ఆ దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తామంటూ హెచ్చరించారు.

సింధ్‌లో నెత్తురోడిన రహదారులు

- 16మంది దుర్మరణం.. 45 మందికి గాయాలు

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో రహదారులు నెత్తురోడాయి. రెండు వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 16మంది చనిపోగా.. 45మందికి గాయాలైనట్టు పోలీసులు వెల్లడించారు. సింధ్ ప్రావిన్స్‌లోని ఖైర్పూర్ సమీపంలోని రాణిపుర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 11మంది మృతిచెందగా.. 35మందికి గాయాలయ్యాయి. బురేవాలా నుంచి వస్తున్న బస్సు జాతీయ రహదారిపై రిక్షాను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అలాగే, షహీద్ బెనజీరాబాద్ జిల్లాలోని ఖాజీ అహ్మద్ పట్టణం సమీపంలో మరో ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న వ్యాన్.. ట్రయిలర్‌ను ఢీకొట్టడంతో ఐదుగురు మృతిచెందగా.. 10మంది గాయపడ్డారు. వేగంగా ప్రయాణిస్తున్న వ్యాను.. తొలుత గాడిద బండిని ఢీకొట్టి ఆ తర్వాత ఎదురుగా వస్తున్న ట్రయిలర్‌ను ఢీకొట్టడంతో ఈ ఘటన జరిగినట్టు పోలీసులు వివరించారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

సహకారబ్యాంకులో రూ.122 కోట్ల స్కాం

- ఆ బ్యాంకులో డబ్బు విత్‌డ్రాపై ఆర్బీఐ నిషేధం



ముంబయి : న్యూ ఇండియా కోఆపరేటివ్ బ్యాంకును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నిషేధించింది. ఈ సహకార బ్యాంకు నుంచి రుణాలు పంపిణీ చేయకుండా ఆపింది. మరోవైపు ఖాతా దారులు డబ్బు విత్‌డ్రా చేసుకోకుండా ఆంక్షలు పెట్టి.. విచారణకు ఆదేశించింది. ఈ బ్యాంకులో రూ. 122 కోట్ల కుంభకోణం జరిగిందని తేలింది. బ్యాంక్ జనరల్ మేనేజర్ హితేష్ మెహతాపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ముంబయి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎలా గుర్తించారు..?

న్యూ ఇండియా కోఆపరేటివ్ బ్యాంక్ జనరల్ మేనేజర్ హితేష్ మెహతా అకౌంట్స్ హెడ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అకౌంట్స్ తనిఖీ చేయగా రూ.122 కోట్ల మేర కుంభకోణం జరిగిందని గుర్తించిన యాక్టింగ్ సీఈఓ దేవర్షి ఘోష్ ఫిర్యాదు చేయటంతో.. స్కాం గుట్టు వెలుగులోకి వచ్చింది. ప్రభాదేవి, గోరేగావ్ శాఖల రిజర్వ్ నిధులను తారుమారు చేశాడని ఆరోపణలున్నాయి. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ముంబయి పోలీసు ఆర్థిక నేరాల విభాగం దర్యాప్తు చేస్తున్నది. మార్చి 2024 నాటికి, ఈ బ్యాంకులో రూ.2436 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. డిపాజిట్ ఇన్సూరెన్స్ పథకం కింద డిపాజిటర్లకు రూ.5 లక్షల వరకు బీమా క్లెయిమ్ చేసుకునే హక్కు ఉంది. డిపాజిటర్లు తమ క్లెయిమ్‌లను బ్యాంకులో జమ చేయాలని కోరారు.

సహకార బ్యాంకుపై ఎందుకు చర్య సుకున్నారు?

ఈ బ్యాంకు ద్రవ్యతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర బ్యాంకు చర్య తీసుకుంది. ఈ బ్యాంకు లిక్విడిటీ స్థితి గురించి ఆందోళనలు ఉన్నాయి. దీని కారణంగా పొదుపు, కరెంట్ లేదా ఏదైనా ఇతర డిపాజిట్ ఖాతా నుంచి డబ్బును ఉపసంహరించుకోవడంపై ఆర్బీఐ ఆంక్షలు విధించింది. డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ చర్యలు అమలు చేసినట్టు ఆర్బీఐ తెలిపింది. ముంబయిలోని అంధేరీ, బాంద్రా, బోరివలి, చెంబూర్, ఘాట్కోపర్, గిర్గావ్, గోరేగావ్, నారిమన్ పాయింట్, కండివలి, మలాడ్, ములుండ్, శాంతాక్రూజ్ , వెర్సోవాలలో నూతన బ్రాంచీలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు నవీ ముంబయి, థానే, పాలెర్, పూణే, సూరత్‌లలో కూడా ఉంది. అయితే బ్యాంకులో స్కాం జరిగిన విషయం తెలియగానే తాము పైసాపైసా కూడబెట్టుకున్న డబ్బులు తిరిగి వస్తాయా..రావా..? అని ఖాతాదారుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

భూభారతి జిందాతిలిస్మాత్ లాంటిది

- కేసీఆర్ పర్సనల్ ఎజెండాతోనే ధరణి : టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భూ భారతి అన్ని సమస్యలకు జిందాతిలిస్మాత్ లాంటిదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. కేసీఆర్ తన సొంత ఎజెండాతోనే ధరణిని తీసుకొచ్చారని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ రెవెన్యూ ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం, డైరీ, క్యాలెండర్-2025 ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి వల్ల రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. కేసీఆర్ రాష్ట్ర ప్రజలను మోసం చేసినట్టే రెవెన్యూ ఉద్యోగులను కూడా మోసం చేశారని తెలిపారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారనీ, ఖజానా అంతా ఖాళీ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతగా ఉందని చెప్పారు. భూ సమస్యలన్నీ భూ భారతితోనే పరిష్కారమవుతాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మెన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు లచ్చిరెడ్డి, తెలంగాణ రెవెన్యూ ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కొనగాల మహేష్, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు బాణాల రామ్‌రెడ్డి, తెలంగాణ తాహసీల్దార్ల అసోసియేషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షులు రాధ, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పాక రమేష్, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే బిక్షం తదితరులు పాల్గొన్నారు.

ప్రమీలకు మెరుగైన వైద్యం

- వైద్యులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహబూబ్‌నగర్ జిల్లా మారేడుపల్లికి చెందిన ప్రమీల అనే మహిళ అనారోగ్యంతో ఉస్మానియా ఆసుపత్రికి వెళ్తే ఆమెకు ఆధార్ కార్డు లేదని వైద్యం చేయడానికి నిరాకరించిన ఘటనపై పత్రికలో వచ్చిన వార్త కథనంపై ఉస్మానియా ఆస్పత్రి వైద్యులపై వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదరర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రమీలకు వెంటనే మెరుగైన వైద్యాన్ని అందించాల్సిందిగా ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ప్రమీలకు మెరుగైన వైద్యాన్ని ఆదివారం ఉదయం నుంచి అందిస్తున్నారు. ప్రమీల ఆరోగ్యం క్రమంగా మెరుగైందని ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు మంత్రి దామోదర్ రాజనర్సింహకు తెలియజేశారు.

గురుకులాలపై కాంగ్రెస్ కుట్ర

- ఆ విద్యాసంస్థలపై తల్లిదండ్రులకు తగ్గుతున్న విశ్వాసం : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పేద బిడ్డలను విద్యకు దూరం చేయాలనే దురుద్దేశంతోనే గురుకులాలపై కాంగ్రెస్ సర్కారు కుట్ర పన్నుతున్నదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కే.తారకరామారావు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌వేదికగా ఆయన స్పందించారు. బీఆర్ఎస్ ప్రభుత్వమున్నప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ గురుకులాల్లోని ఐదో తరగతిలో 41 వేల సీట్లకు 1.68 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే నేడు 51 వేల సీట్లకు గానూ 80 వేలమంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారనీ, ఒక్కఏడాదిలో 88 వేల దరఖాస్తులు తగ్గాయని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో గురుకులాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు విశ్వాసం సన్నగిల్లుతున్నదని తెలిపారు. కేసీఆర్ గుర్తులు లేకుండా చేయాలన్న సంకుచిత మనస్తత్వంతోనే దళిత, గిరిజన, బడుగు, మైనార్టీ పిల్లలు చదువుకునే గురుకులాలపై సీఎం రేవంత్‌రెడ్డి వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే ఆకలి చావులు, పాముకాట్లు, ఆత్మహత్యలు, ఫుడ్ పాయిజనింగ్‌లతో చనిపోయిన విద్యార్థులు 50 మందికిపైనే ఉన్నారని విమర్శించారు. గురుకులాల్లో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలను మంత్రులు కనీసం పరామర్శించలేదనీ, తాము వెళ్తామంటే నిర్బంధాలు ప్రయోగిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా లక్షల మందికి బంగారు భవిష్యత్తుపై ఆశలు కల్పించేలా గురుకులాలపై సమీక్షించి మెరుగైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పటిదాకా కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

టీఐఎస్-2025కు ముఖ్యఅతిథిగా కేటీఆర్‌కు ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బెంగుళూరులో నిర్వహించే టెక్, ఇన్నోవేషన్ సమిట్(టీఐఎస్)-2025కు ముఖ్య అతిథిగా హాజరుకావాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కే.తారకరామారావుకు ఆహ్వానం అందింది. సదస్సులో కీలక ప్రసంగం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ సదస్సు ఈ నెల 27, 28 తేదీల్లో బెంగళూరులో జరగనుంది. 'డిజిటల్ ఇండియాను ముందుకు తీసుకెళ్లడం : సాంకేతికతరంగాన్ని ఆధునీకరించడం, భవిష్యత్తు కోసం వ్యూహాలు, ఆవిష్కరణలు' అనే అంశంపై ఆయన కీలక ప్రసంగం చేయనున్నారు. "ది ఏఐ టెకేడ్" థీమ్‌తో నిర్వహించనున్న ఈ సమిట్‌లో కృత్రిమ మేధస్సు వ్యాపారం, సాంకేతికతపై చూపించే ప్రభావంపై 150 మందికిపైగా ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు, వివిధ ప్రభుత్వాల ప్రతినిధులు చర్చించనున్నారు. గాలా ఐడియా అవార్డుల కార్యక్రమం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

తెలంగాణ నీటి ప్రయోజనాలు కాంగ్రెస్‌కు పట్టవా?

- మాజీ మంత్రి టి.హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కృష్ణా జలాలను అడ్డూ అదుపూ లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరలించుకుపోతుంటే రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోకుండా చోద్యంగా చూడటం దుర్మార్గమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులను ఏపీ తరలించుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంటున్నదని ప్రశ్నించారు. ఈ వాటర్ ఇయర్‌లోనే అక్రమంగా 646 టీఎంసీలను తరలిస్తే ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. సాగర్ ఆనకట్ట కేంద్రబలగాల ఆధీనంలో ఉందనీ, వాటి పర్యవేక్షణలో మాత్రమే నీటిని విడుదల చేసుకోవాల్సి ఉన్నప్పటికీ ఏపీ మాత్రం ఇష్టారాజ్యంగా నీటిని తరలిస్తున్నదని విమర్శించారు.

తెలంగాణ తాగునీటి అవసరాలకు శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నిలువ ఉంచాల్సిన కోటాను ఏపీ తీసుకెళ్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదని పేర్కొన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకూ కేఆర్ఎంబీ పరిధిలోని ప్రాజెక్టులపై త్రీమెన్ కమిటీ సమావేశం ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ సర్కారు ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఏపీ నీటి తరలింపును ఇప్పటికైనా అడ్డుకోకపోతే సాగర్ ఆయకట్టుకు ప్రమాదం ఏర్పడే ప్రమాదముందనీ, సాగర్‌లో నీటిమట్టం పడిపోతే హైదరాబాద్ నగరానికి తాగునీటి సమస్య సైతం ఏర్పడుతుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఏపీ నీటి దోపిడిని అడ్డుకోవాలనీ, ఈమేరకు కృష్ణా బోర్డుపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.



ఏసీ గదుల్లోంచి బయటకు రండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యక్ష సాక్షి అని చెప్పారు. ఐఏఎస్‌లు అనగానే ఎస్ఆర్ శంకరన్, టీఎన్ శేషన్, మన్మోహన్‌సింగ్ వంటి నిబద్ధత కలిగిన ఉద్ధండులు గుర్తొస్తారని అన్నారు. వారు తమకు అప్పగించిన బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించి, ప్రజల హృదయాల్లో స్థానాన్ని పదిలం చేసుకున్నారని కొనియాడారు. అలాంటివారి అనుభవాల నుంచి నేటి సివిల్ సర్వెంట్స్ ఎంతో నేర్చుకోవాల్సి ఉందన్నారు. గతంలో రాజకీయ నాయకులు అంశాలను ప్రస్తావిస్తే దానిలోని లోతుపాతులు, లాభనష్టాలను ఐఏఎస్‌లు వివరించేవారనీ, కానీ ఈ రోజుల్లో ఎందుకో అది తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నిర్ణయాలపై నాయకులకు అధికారులు విశ్లేషణ చేసి చెప్పాలని అభిప్రాయపడ్డారు. గతంలో ఐఏఎస్ అధికారులు నిత్యం ప్రజల్లో ఉండేవారనీ, రాజకీయ నాయకుల కంటే ప్రజలు అధికారులనే ఎక్కువగా గుర్తుంచుకునేవారని చెప్పారు. కానీ ఇప్పుడు కలెక్టర్లు ఏసీ రూముల్లోంచే బయటకు వెళ్లడం లేదనీ, వారి ఆలోచనలు, విధానాల్లో మార్పు రావాలని కోరారు. నిబద్ధత కలిగిన అధికారులకు తప్పకుండా గుర్తింపు ఉంటుందనీ, పేదలకు సాయం చేయాలనే ఆలోచన అధికారులకు ఉండాలని చెప్పారు. ఆ దిశగా రాష్ట్రంలోని అధికారులు పాలనపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధ్యక్షత వహించారు. ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, పుస్తక రచయిత ఎమ్ గోపాలకృష్ణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిత్యనృత్య ఉత్సవం తెలంగాణ బాలోత్సవం

- ప్రజాపాటకు నీరాజనం : సినీ కవి సుద్దాల అశోక్ తేజ



నవతెలంగాణ - ముషీరాబాద్

నిత్య నృత్య ఉత్సవం తెలంగాణ బాలోత్సవాన్ని ప్రజల వద్దకు ప్రజాపాటను శాస్త్రీయ నృత్య నీరాజనం పేరుతో తీసుకెళ్ళడం గొప్ప పరిణామమని సినీ గేయ రచయిత, కవి సుద్దాల అశోక్ తేజ అన్నారు. ఆదివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో బాలోత్సవం ఉపాధ్యక్షులు కె.సుజావతి అధ్యక్షతన జరిగిన 'ప్రజాపాటలకు నృత్య నీరాజనం' కార్యక్రమంలో సుద్దాల అశోక్ తేజ మాట్లాడారు. భారత దేశంలో 9 నృత్యాలున్నాయని, వాటిని శాస్త్రీయ నృత్యాలుగా గుర్తించిన భరతముని నాట్య శాస్త్రాన్నే అందరూ అనుసరిస్తున్నారని తెలిపారు. 'ఏదో నాకు తెలిసినంత వరకు చెప్పాను.. చెప్పనివెవైనా ఉంటే.. లోకం నుంచి చూసి తెలుసు కోవాలి" అని భారతముని చెప్పినట్టు చెప్పారు. రసజ్ఞులకు పరిమితమైన ఇహపరాలను దాటి ప్రజాపాటలను ప్రజల వద్దకు చేర్చడం ఒక సాహసమని, ఈ ప్రయత్నంలో తన వంతుగా ఉచితంగా పాటలు రాసి మీకు అందజేస్తానని అన్నారు. జ్ఞానం ఎవరికీ గుత్తాధిపత్యం లేదని, జ్ఞానమంటే ప్రజలదే అని తెలిపారు. ఒకప్పుడు సంపదను, అక్షరాన్ని కైవసం చేసుకున్న వర్గాలు.. ఉత్పత్తి వర్గాలకు చదువును కూడా దూరం చేశాయన్నారు. కరుడుగట్టిన సంప్రదాయంలో కూడా ఆధునిక ఆలోచనలు తీసుకొచ్చే ఒక అద్భుతమైన కార్యక్రమం నిర్వహించారుని కొనియాడారు. ఈ రంగంలో మార్పులు సాధ్యమేనని నిరూపిం చేందుకు కొత్త తలుపులు తెరిచారని, శాస్త్రీయ సంగీతం సార్వజనీనమని రుజువైందని అన్నారు. ప్రతి పాట అభ్యుదయం, ప్రగతిశీలం, ప్రజల బాణీలోకి తీసుకొచ్చారని తెలిపారు. సామాజిక ప్రయోజనాన్ని చేకూర్చిన పాటలే.. మనుగడ కొనసాగుతాయని అన్నారు. నేటి నుంచి భువనగిరి, మహబూబ్‌నగర్, వరంగల్ తదితర పట్టణాలు, పల్లెల్లో కూడా ప్రదర్శనలు ఇస్తారని, దానికి తల్లితండ్రులు, నృత్య గురువులు, పెద్దలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. చరిత్ర అంటే కొనసాగింపే కాదు.. ఖాళీలు కూడా ఉంటాయని, సాంస్కృతిక రంగంలో ఖాళీలను తెలంగాణ బాలోత్సవమే పూరించాలని తెలిపారు. అందుకు తన వంతు సహాయం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎస్. సోమయ్య, కోశాధికారి జి.బుచ్చిరెడ్డి, ఉపా ధ్యక్షులు ఇ.మమత, కల్చరల్ కో ఆర్డినేటర్ ఇందిరా, నృత్య గురువులు రమణి సిద్ధి, రేణుక ప్రభాకర్, ప్రసూన నూతి, గుమ్మడం శైలజ తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ హత్య, మృతదేహం లభ్యం

- తానే హత్య చేశానంటూ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన వ్యక్తి


(ఫైల్)

నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

సంగారెడ్డి జిల్లాలో లారీ డ్రైవర్ ఆంగోత్ దశరథ్ (26) హత్యజరగగా, ఆయన మృతదేహాన్ని నిజాంపేట్ మండలం మెగ్యానాయక్ తండా శివారులో ఆదివారం పోలీసులకు లభ్యమయింది. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం రామ్ చందర్ తండాకు చెందిన దశరథ్‌ను మెగ్యానాయక్ తండాకు చెందిన గోపాల్ హత్య చేసి పోలీసులకు లొంగిపోయాడు. సంగారెడ్డిలోని ఓ చక్కెర పరిశ్రమలో లారీ డ్రైవర్‌గా దశరథ్ పనిచేస్తున్నాడు. కాగా, శుక్రవారం దశరథ్ కనిపించకుండా పోవడంతో అతని భార్య సంగారెడ్డి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుండగానే శనివారం నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో తానే దశరథ్‌ను హత్య చేశానంటూ గోపాల్ అనే వ్యక్తి పోలీసులకు లొంగిపోయాడు. నారాయణఖేడ్ పోలీసులు గోపాల్ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసు జాగిలాలను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, దశరథ్‌ను కనిపెట్టాలని డిమాండ్ చేస్తూ అతని కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం రోడ్డుపై బైటాయించి ఆందోళన చేపట్టారు. తండాలో ఎలాంటి ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు చేపట్టారు. ఆదివారం ఎట్టకేలకు మృతదేహం లభ్యమయింది. ఈ క్రమంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు. హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని నారాయణఖేడ్ పోలీసులు తెలిపారు.

ఒక వైపు దాడులు... మరోవైపు అమ్మకాలు



ఆగని నకిలీ వైద్యం, నకిలీ మందుల దందా

- ప్రజారోగ్యానికి పెను ప్రమాదంగా మారిన వైనం
- సరఫరాదారులపై చర్యలు తీసుకోకుంటే సమస్యకు పరిష్కారమెట్లా?
- మూలాల్లోకి వెళ్లేదెప్పుడు?



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో నకిలీ వైద్యం, నకిలీ మందుల సమస్య పెచ్చుమీరుతున్నది. ఒక వైపు ప్రభుత్వపరంగా, చట్టబద్ధ సంస్థలు వరుస దాడులు చేస్తున్నా వీటికి పూర్తి స్థాయిలో అడ్డుకట్ట పడటం లేదు. రాష్ట్రంలో ఎలాంటి వైద్యం చేసే అర్హత లేని వారు వేలాది మంది వైద్యం ప్రాక్టీస్ చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. అదే సమయంలో అశాస్త్రీయ వైద్యం చేస్తుండటంతో ప్రతి రోజూ చిన్న చిన్న దుష్పరిణామాలతో పాటు ప్రజల ప్రాణాలూ పోతున్నట్టు వరుస ఘటనలు గమనిస్తే అర్థమవుతున్నది. ఎలాంటి అర్హత లేని వారు చేసే వైద్యం తరచూ వివాదస్పదంగా మారుతున్నది. ఆహారోత్పత్తుల పేరుతో లైసెన్స్ తీసుకుని ఫలానా రోగానికి చికిత్సకు ఉపయోగపడుతుందంటూ అమ్మే ఫుడ్ సప్లిమెంట్లు బయట పడుతూనే ఉన్నాయి. కాలం చెల్లిన మందు లు దాడుల్లో వెలుగులోకి వస్తున్నాయి. వైద్యంపై అవగాహన లేని వారు ఇష్టానుసారంగా రోగులతో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ సిఫారసు చేసి అలవాటుగా చేస్తుండంతో భవిష్యత్తులో యాంటీ మైక్రోబయాల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) సమస్య అధికమవుతుందని డాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంటే కొన్ని మందులను అదే పనిగా అవసరం లేకపోయినా తరచూ వాడటం ద్వారా అవి పని చేయని పరిస్థితి తలెత్తడం. ఇదే జరిగితే దశాబ్దాలు, శతాబ్దాల పరిశోధన ఫలితంగా కనుగొన్న మందులు సైతం అత్యవసర పరిస్థితిలో పని చేయని ఒక భయానక పరిస్థితి దాపురిస్తుంది.

డీసీఏ, టీజీఎంసీ దాడులు...

గతంలో ఎన్నడూ లేనంతగా డ్రగ్ కంట్రోల్ అథారిటీ, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ క్రియాశీలకంగా పని చేస్తున్నాయి. గత ఏడాదికి పైగా వరస దాడులతో నకిలీ వైద్యులను పట్టుకుంటూ, నకిలీ మందులను సీజ్ చేస్తున్నాయి. నకిలీ వైద్యాన్ని అరికట్టేందుకు, నకిలీ మందులను పూర్తిగా కనుమరుగు చేసి నకిలీ మందులరహిత రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నా ... ఆ లక్ష్యం సమీపంలో ఉన్నట్టు కనిపించడం లేదు. రాష్ట్రంలో ఎలాంటి విద్యార్హత లేకుండా దాదాపు 50 వేల మంది అల్లోపతి వైద్యాన్ని చేస్తున్నారనీ, వీరి వల్ల గ్రామీణుల ఆరోగ్యం ఎక్కువగా దెబ్బతింటున్నదని డాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నూతన పాలక వర్గం కొలువుదీరిన తర్వాత యాంటీ క్వాకరీ సెల్‌ను బలోపేతం చేసింది. వరుస దాడుల్లో దాదాపు 1,000 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసులు నమోదు చేయించి వారిపై కఠిన చర్యలు తీసుకునేలా పకడ్బందీగా ముందుకెళ్తున్నది. ఆర్ఎంపీ, పీఎంపీలు, అనుభవ వైద్యులు, గ్రామీణ వైద్యులుగా పిలవబడే వారు అర్హత, అవగాహన లేకుండా వైద్యం అందిస్తున్నారని అల్లోపతి వైద్య సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అదే సమయంలో కొంత మంది మాత్రమే ఇలాంటివి చేస్తుండగా మిగిలిన వారంతా ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ప్రాథమిక చికిత్సకే పరిమితమై ప్రజారోగ్యానికి సహకరిస్తున్నారని ఆయా సంఘాల నాయకులు బదులిస్తున్నారు. కొంత మంది చేస్తున్న తప్పుడు పనులకు అందరిని నిందించడం సరికాదని కోరుతున్నారు.

సమస్యకు మూలమెక్కడా?

నకిలీ వైద్యానికి, నకిలీ మందులకు మూలాల్లోకి వెళితే తప్ప ఈ సమస్యకు పూర్తిగా పరిష్కారం దొరికేలా కనిపించడం లేదు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వెయ్యి కేసులు నమోదు చేసినా, డ్రగ్ కంట్రోల్ అథారిటీ మరో వెయ్యి కేసులు నమోదు చేసినా నకిలీ కొనసాగుతూనే ఉంది. ఆయా మందుల తయారీదారులను, సరఫరాదారులను పట్టుకుని శాశ్వతంగా నిషేధించే కఠిన చట్టాలు ప్రయోగిస్తే తప్ప వీటిని అరికట్టలేమని నిపుణులు చెబుతున్నారు. గ్రామాల్లో శాస్త్రీయ వైద్యాన్ని, వైద్యులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజలను శాస్త్రీయ వైద్యంవైపు అలవాటు చేయొచ్చని సూచిస్తున్నారు.

ఇందుకోసం వైద్యారోగ్యశాఖలో డాక్టర్లు, నర్సుల సంఖ్యను పెంచడంతో పాటు ప్రతి గ్రామానికి కనీసం ఒక ప్రాథమిక వైద్యశాల తప్పనిసరి చేయాలని వారు కోరుతున్నారు. క్వాలిఫైడ్ వైద్యున్ని, వైద్య సిబ్బందిని అందుబాటులోకి తేవడమే శాశ్వత పరిష్కారం తప్ప, దాడులతో పూర్తిగా నిర్మూలన జరగదని చెబుతున్నారు. శాస్త్రీయ వైద్యం అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ప్రజలకు ఆ వైద్యాన్ని అందుబాటులోకి తేవడం ద్వారా నాటు వైద్యం నుంచి ప్రజలను దూరం చేసినట్టు అనుభవాలున్నాయి. మన రాష్ట్రంలోనూ ఆ దిశగా ప్రభుత్వం ముందుకెళ్లాల్సిన అవసరముంది.

నలుగురు నకిలీ వైద్యుల గుర్తింపు

- తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో టీజీఎంసీ బృందం తనిఖీలు
- జిల్లా వైద్యాధికారి కార్యాలయం నుంచి బ్రోకర్ల ద్వారా నకిలీ డాక్టర్ల సెంటర్లకు అక్రమంగా అనుమతి



నవతెలంగాణ-తుర్కయంజాల్

హైదరాబాద్ నగరంలో నకిలీ వైద్యుల హల్‌చల్ కొనసాగుతోంది. పేద ప్రజల అవసరాలు, అమాయకత్వం, అవగాహన లోపం వాళ్లకి వరంగా మార్చుకొని వారి వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరు కాయలుగా నడుపుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి జిల్లా తుర్కయాంజాల్‌లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం సభ్యులు డాక్టర్ వి. నరేష్ కుమార్, డాక్టర్ కడాలి విష్ణు ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఎన్ఎంసీ చట్ట విరుద్ధంగా ఎంబీబీఎస్ విద్యార్హత లేకుండా అల్లోపతి వైద్యం నిర్వహిస్తున్న నకిలీ వైద్యుల సెంటర్లపై తనిఖీలు నిర్వహించింది.

తుర్కయంజాల్ కమ్మగూడలోని రాజర్షి ఇన్ఫర్మిటీ నిర్వాహకులు చంద్రశేఖర్ ఎంబీఏలో హాస్పిటల్ మేనేజ్‌మెంట్ చదివి డాక్టర్ అవతారం ఎత్తాడు. తన సెంటర్‌కు రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో 2023లో డాక్టర్ కాత్యాయని, ఈఎన్‌టీ సర్జన్ పేరు మీద ఒక బ్రోకర్ ద్వారా అనుమతి తీసుకొని క్వాలిఫైడ్ డాక్టర్ ఎవరూ లేకుండా తన వద్దకు వచ్చే పేషంట్లకు తానే డాక్టర్ అని నమ్మించి ఇష్టానుసారంగా యాంటీ బయోటిక్స్, స్టెరాయిడ్ ఇంజెక్షన్స్, సెలైన్లు ఇవ్వడంతో పాటు ప్రిస్కిప్షన్ రాస్తున్నట్టు తనిఖీ అధికారులు గుర్తించారు. రాజర్షి ఇన్ఫర్మిటీ అనుమతికి సర్టిఫికెట్స్ ఇచ్చిన డాక్టర్ కాత్యాయని.. వారానికి ఒకసారి వచ్చి వెళ్తారని చెప్పిన నిర్వాహకుడు చంద్ర శేఖర్‌ను డాక్టర్ ఫోన్ నెంబర్ అడగగా తన వద్ద లేదని, డాక్టర్ ఎవరో కూడా తెలియదని చెప్పి తనకు బ్రోకర్ సర్టిఫికెట్స్ ఇచ్చి డీఎంహెచ్‌వో ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ చేయించాడని తెలిపారు. సదరు బ్రోకర్ పేరు కూడా గుర్తులేదని, నెంబర్ కూడా దొరకట్లేదని నీళ్లు నమిలడం విశేషం. కాగా, తమ వద్ద కౌన్సిల్ రిజిస్టర్‌లో ఉన్న నెంబర్ ఆధారంగా డాక్టర్ కాత్యాయనిని ఫోన్‌లో సంప్రదించిన తనిఖీ అధికారులకు.. సదరు సెంటర్ నిర్వాహకుడు ఎవరో తెలియదని డాక్టర్ చెప్పడం గమనార్హం. అదే ప్రాంతంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా చదివి ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అయన్ష్ డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వహిస్తున్న పి. మహేష్, ఏఎన్ఎం చదివి కమ్మగూడ ప్రాంతంలో స్మార్ట్ క్యూర్ క్లినిక్ నిర్వహిస్తున్న చంద్రమ్మ అలియాస్ చంద్రకళ, బ్రాహ్మణపల్లి ఎక్స్ రోడ్డులో 10వ తరగతి మాత్రమే చదివి వాసు మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్‌లో అల్లోపతి వైద్యం చేస్తున్న సీహెచ్ శ్రీనివాస్‌పై ఎన్ఎంసీ 34,54 ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్టు టీజీఎంసీ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మెన్ డా వి.నరేష్ కుమార్ తెలిపారు. రాజర్షి ఇన్ఫర్మిటీ హాస్పటల్ అనుమతిలో తన సర్టిఫికేట్ దుర్వినియోగం గురించి లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలని డాక్టర్ కాత్యాయనికి నోటీసు ఇవ్వనున్నట్టు టీజీఎంసీ సభ్యులు డాక్టర్ కడాలి విష్ణు తెలిపారు.

ప్రజాసమస్యలు విస్మరిస్తే ఎవరినైనా ఎదిరిస్తాం



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి/ ఆత్మకూరు

ప్రజాసమస్యలను విస్మరిస్తే.. పాలక వర్గాలనెవరినైనా ఎదిరిస్తామనీ, ప్రాధాన్యత రంగాలకు కేంద్రం బడ్జెట్ కేటాయింపులపై పున:సమీక్ష చేయకపోతే గ్రామాల్లో కేంద్ర మంత్రులు, ఎంపీలను తిరగనివ్వబోమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. కేంద్రం నిధులివ్వకపోతే ఎంపీలు తక్షణం రాజీనామా చేయాలని తెలిపారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా ఈనెల 18,19 తేదీల్లో ఆందోళన చేపట్టనున్నట్టు వివరించారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అరుంధతి భవన్‌లో '2025-26 బడ్జెట్ వివిధ రంగాలపై ప్రభావం' అనే అంశంపై సీపీఐ(ఎం) మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి ఎ.రాములు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో జాన్‌వెస్లీ మాట్లాడారు. రాష్ట్రంలో 30 లక్షల మంది సొంతింటి జాగా లేని వారున్నారనీ, వారందరికీ ఇంటిస్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు లక్షలాది ఎకరాలున్నా.. దళిత, గిరిజన, మైనార్టీ, పేదలకు ఇంటి జాగా ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాలను పాక్షికంగా అమలు చేశారనీ, భూమి లేని వ్యవసాయ కూలీలకు ఇస్తామన్న సహాయం గురించి మాట్లాడటం లేదని ఆరోపించారు. ఇక దళితులకు గత పాలకులు కుటుంబానికి రూ. 10 లక్షలు ఇస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి రూ.12 లక్షలు ఇస్తామని ఎన్నికల్లో గెలిచి మాట తప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికే కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చామని గుర్తు చేశారు. ఇచ్చిన మాట తప్పితే.. కాంగ్రెస్‌ను సైతం ప్రజాక్షేత్రంలో నిలబెడతామని హెచ్చరించారు. కులగణనలో ఉన్న అనుమానాలను నివృత్తి చేసి వెంటనే స్థానిక ఎన్నికలు నిర్వహించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని సూచించారు. జనాభాలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు తగ్గి ఓసీలు పెరగడంలో ఔచిత్యం ఏమిటని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, బల్బులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనీ, ఇలాంటి స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేయాలని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో బీహార్ వంటి రాష్ట్రాలకు అధిక నిధులు ఇచ్చి తెలంగాణకు నిధులు కట్ చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యంగా, రాష్ట్ర విభజన సమయం లో పొందుపరిచిన హామీలను ఎందుకు అమలు చేయటం లేదని నిలదీశారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల్లో అత్యంత కీలకమైన పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలోనూ మాట తప్పారని అన్నారు. బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ, రైల్వే కోచ్, మెట్రో, మూసీ ప్రక్షాళన వంటి వాటికి ఎందుకు నిధులు కేటాయించలేదో బీజేపీ రాష్ట్ర ఎంపీలు, మంత్రులు చెప్పాలన్నారు. పరిశ్రమలకు, ఉపాధి రంగానికి, దళిత, గిరిజనులకు బడ్జెట్‌లో ఎందుకు స్థానం కల్పించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. బడ్జెట్ పున:సమీక్ష చేసి ప్రాధాన్యతా క్రమంగా నిధులు కేటాయించాలని కోరారు. ఈనెల 18,19న చేపడుతున్న ఆందోళనకు ప్రజలు, మేధావులు, మహిళలు, కార్మికులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, వెంకట్రాములు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, పద్మ మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మెన్ ఒబేదుల్లా కోత్వాల్, సీనియర్ న్యాయవాది బెక్కెం జనార్ధన్, జిల్లా నాయకులు చంద్రకాంత్, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, ఆదిలక్ష్మయ్య, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపద అందరికీ సమానంగా ఉండాలి : జాన్ వెస్లీ



దేశ సంపద అందరికీ సమానంగా ఉండాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. వనపర్తి జిల్లా అమరచింత పట్టణానికి వచ్చిన జాన్‌వెస్లీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జీఎస్ గోపి అధ్యక్షతన ఏర్పాటుచేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. దేశంలో సంపద ప్రజలందరి చేతుల్లో లేదని, కేవలం 200 మంది చేతుల్లో రూ.30 లక్షల కోట్ల ఆస్తులు కూడబెట్టబడ్డాయని తెలిపారు. సంపద అందరి చేతిల్లో సమానంగా ఉన్నప్పుడే పేదరికం ఉండదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేశం నాగరాజు గౌడ్, సీపీఐ(ఎం) జిల్లా సీనియర్ నాయకులు జబ్బార్, అమరచింత సీనియర్ నాయకులు మహిముద్, వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ భవన్‌లో
కేసీఆర్ జన్మదిన వేడుకలు

- ఏర్పాట్లను పరిశీలించిన తలసాని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఆదివారం వేడుకల వేదిక తెలంగాణ భవన్‌లో జరుగుతున్న ఏర్పాట్లను హోంశాఖ మాజీ మంత్రి మహమూద్ అలీతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు జన్మదిన వేడుకలు ప్రారంభం అవుతాయని తెలిపారు. వేడుకల్లో భాగంగా డప్పు కళాకారులు, గిరిజన వేషధారణ నృత్యాల ప్రదర్శనతో పాటు కేసీఆర్ జీవిత, రాజకీయ ప్రస్థానంతో కూడిన ప్రత్యేక డాక్యుమెంటరీ ప్రదర్శన ఉంటుందని వివరించారు. 71వ జన్మదినం సందర్భంగా 71 కిలోల భారీ కేక్‌ను కట్ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ వేడుకలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీమంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, కార్పొరేషన్ మాజీ చైర్మెన్లు, పార్టీ నాయకులు, అభిమానులు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భవన్ ఇన్‌చార్జి రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తలసాని సాయికిరణ్ యాదవ్, ఆనంద్ గౌడ్, విప్లవ్ కుమార్, గుర్రం పవన్‌కుమార్ గౌడ్, మన్నె గోవర్ధన్ రెడ్డి, మన్నె కవిత రెడ్డి, వెంకటేష్, కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూజిలాండ్‌లో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 71వ జన్మదినోత్సవ వేడుకలను ఆదివారం న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో ఘనంగా నిర్వహించినట్టు ఆ దేశ బీఆర్ఎస్ నాయకులు రామారావు, కిరణ్ పొకల, అరుణ్ ప్రకాశ్, కళ్యాణ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కేసీఆర్ దార్శనికత, నాయకత్వం, తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించిందని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రంలో ప్రకాశ్ బిరాదార్, సుధీర్‌బాబు రాచపల్లి, మోహన్ రెడ్డి, పీవీఎస్ రావు, శ్రీనివాస్ పుదారి తదితరులు పాల్గొన్నారు.

జలగం వెంగళరావు పార్కులో మొక్కలు నాటిన బీఆర్ఎస్ నేతలు

- కేసీఆర్‌కు వృక్షార్చనతో జన్మదిన శుభాకాంక్షలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకులు మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ పిలుపు మేరకు వృక్షార్చనలో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని జలగం వెంగళరావు పార్కులో కార్పొరేషన్ల మాజీ చైర్మెన్లు 40 మంది పాల్గొని పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సంతోశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ కార్పొరేషన్ చైర్మెన్లు మేడే రాజీవ్ సాగర్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, దేవీప్రసాద్, ముజీవుద్దీన్, గూడూర్ ప్రవీణ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్, జూలూరి గౌరీ శంకర్, మెట్టు శ్రీనివాస్, సుమిత్ర ఆనంద్, రజిని సాయిచంద్, మంత్రి శ్రీదేవి, మన్నె కవిత, చిరుమళ్ళ రాకేష్, ఆంజనేయులు గౌడ్, గజ్జెల నగేష్, వాసుదేవ రెడ్డి, వై.సతీశ్‌రెడ్డి , పాటిమీది జగన్, ఇంతియాజ్, వల్యా నాయక్, దామోదర్ గుప్తా, కిశోర్ గౌడ్, ఉపేంద్ర, పల్లె రవి, అక్బర్, నాగేందర్ గౌడ్, మఠం భిక్షపతి, వెంకటేశ్వర్ రెడ్డి, సర్వోత్తమ్, మన్నె గోవర్ధన్, తుంగ బాలు, గోసుల శ్రీనివాస్, శ్రీధర్, రాఘవేంద్ర యాదవ్, పూర్ణచందర్ ,సతీష్, ఎన్ ఎన్ రాజు, అమృత్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంతోశ్‌కుమార్ మాట్లాడుతూ..తమ పిలుపు మేరకు కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని కార్పొరేషన్ల చైర్మెన్లు మొక్కలు నాటడం సంతోషకరమన్నారు. వారందరికీ బీఆర్ఎస్ పక్షాన, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ పక్షాన ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు మొక్కలు నాటాలనీ, రక్తదానాలు చేయాలని పిలుపునిచ్చారు.

పెద్దగట్టు జాతర ప్రారంభం

- జాతరలో అత్యంత కీలకమైన దేవరపెట్టె కేసారం నుంచి పెద్దగట్టుకు తరలింపు
- కత్తులు, కటార్లతో,బేరీలు, గజ్జెల చప్పుడుతో మార్మోగిన పెద్దగట్టు
- అట్టహాసంగా గంపల ప్రదర్శన



నవతెలంగాణ-చివ్వెంల

రెండేండ్లకోసారి జరిగే తెలంగాణలోనే రెండో అతిపెద్ద జాతరగా పేరు గాంచిన సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న పెద్దగట్టు శ్రీ లింగమంతుల స్వామి జాతర ఆదివారం ప్రారంభమయింది. ఢమరుకమైన బేరీల చప్పుడు.. కత్తులు, కటార్లతో విన్యాసాలు, బరిశెలు, కాళ్లకు కట్టిన గజ్జల చప్పుడు, గంపలు నెత్తిన పెట్టిన మహిళల శివాలు.. యాదవ సోదరులతో పాటు సంప్రదాయ నృత్యాలతో జాతర అట్టహాసంగా ప్రారంభమైంది.

గట్టుకు చేరిన దేవరపెట్టె

జాతరలో అత్యంత కీలకమైన దేవరపెట్టె, దేవునిగంప తరలింపు కార్యక్రమం ఆదివారం భేరీల చప్పుడుతో.. యాదవుల సంప్రదాయం ప్రకారం సూర్యాపేట రూరల్ మండలం కేసారం గ్రామం నుంచి వేలాది మంది భక్తుల ఆనందోత్సవాల మధ్య పెద్దగట్టుకు చేర్చారు. కేసారంలో పెద్దగట్టు ఆలయ చైర్మెన్ పోలేబోయిన నర్సయ్యయాదవ్, ఈఓ కుశలయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు, యాదవ సోదరులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని పూజలు చేసి గట్టుకు చేరారు. దేవరపెట్టెలో ఉన్న 33 మంది దేవతలు, బోనం, గంపతో పాటు నూతన పట్టు వస్త్రాలు శ్రీ లింగమంతుల స్వామి, అందనపు చౌడమ్మకు సమర్పించడంతో జాతర ప్రారంభమైంది.

వైభవంగా గంపల ప్రదర్శన

ఆదివారం ఉదయం నుంచి పెద్దగట్టు ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. వేలాదిమంది భక్తులు ట్రాక్టర్లు. ఆటోలు ఇతర వాహనాలలో గట్టుకు చేరి తమ ఆరాధ్య దైవమైన లింగమంతుల స్వామి వందనం చౌడమ్మకు గంపలను పూలతో అలంకరించి తమ మొక్కులను తీర్చుకున్నారు. బేరీల చప్పుడు, కత్తులు కటార్లతో యాదవ సోదరుల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. యాదవ సోదరులు సంప్రదాయ దుస్తులతో అలంకరణ చేసుకొని తన ఇష్ట దైవమైన స్వామికి మొక్కుకొని తమ కోరికలు తీర్చాలని వేడుకున్నారు.

బైకానుల ఆచారం ప్రకారం యాదవ సోదరులు అమ్మవారికి నైవేద్యంగా వడ్డించేందుకు పసుపు, కుంకుమ, పూల దండలతో అలంకరించిన గొర్రెపోతులు, మేకలను గుట్టపైకి తీసుకువచ్చి ప్రదక్షిణలు చేయించి తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. జాతరకు వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా రూట్‌మ్యాప్ ప్రకారం జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. సోమవారం భక్తులు అధికసంఖ్యలో వస్తున్నందున ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని పోలీసులు వెల్లడించారు.

హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ

దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి జాతరలో భక్తుల ఆరోగ్యం దృష్ట్యా వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామని డీఎంహెచ్‌ఓ కోటాచలం తెలిపారు. ఆలయ పరిసరాల్లో 9 క్యాంపులు ఏర్పాటు చేశామని, భక్తులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నా పక్కనే ఉన్న హెల్త్ క్యాంప్‌లో తమ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. జాతర పూర్తయ్యేవరకు అన్నివేళలా అందుబాటులో ఉంటారని వెల్లడించారు.

సోమవారం | ఫిబ్రవరి 17, 2025 | www.navatelangana.com

'బచ్పన్' పాఠశాలలో దంతాల చెకప్

నవతెలంగాణ-కొత్తపేట





మన ఆరోగ్యం మన చేతిలోనే ఉందని డాక్టర్ నరేష్ అన్నారు. బచ్పన్ అకాడమిక్ హైట్స్ పాఠశాలలో పిల్లలకు రాష్ట్ర డెంటల్ స్కానింగ్ కార్యక్రమంలో ఆదివారం దంతాల చెకప్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మన శరీరంలోని ప్రతి అవయవం మనకు ముఖ్యమైనదని, అందులో నోటిలోని పళ్ళు ఎంతో ముఖ్యమైనవని అన్నారు. తర్వాత పిల్లలకు ఏ విధంగా బ్రష్ చేసుకోవాలి, పళ్ళను ఎలా కాపాడుకోవాలి, ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి అనే విషయాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సరీ నుండి ఏడో తరగతి విద్యార్థులు, పాఠశాల డైరెక్టర్ జితేంద్ర దేవి తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్‌లో జరిగిన హజరత్ సయ్యద్ బాబా షర్ఫుద్దీన్ గంధం ఊరేగింపు కార్యక్రమానికి ఆదివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డిలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, నాయకులు బేకుల శశిధర్ రెడ్డి, బేకుల సుధాకర్, రెడ్డి, తుళ్ల నరహరి గౌడ్, తుళ్ళ సునీత గౌడ్, అనురాధ, మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

క్రమశిక్షణతో కూడిన చదువుతోనే విజయం



- నాగార్జున విద్యాసంస్థల చైర్మెన్ గుమ్మకొండ విఠల్ రెడ్డి
- ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-మీర్‌పేట్

క్రమశిక్షణతో కూడిన చదువుతోనే విజయం సాధిస్తారని నాగార్జున విద్యాసంస్థల చైర్మెన్ గుమ్మకొండ విఠల్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. మీర్‌పేట్ నాగార్జున మాంటిసరి ఐఐటీ ఓలింపియాడ్ పాఠశాల 12వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా



నిర్వహించారు. గత సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో 10/10 సాధించిన 12 మంది విద్యార్థులకు పదివేల రూపాయల బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో మంచి ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ చాలా అవసరం అని అన్నారు. అలా ఉన్నప్పుడే జీవితంలో విజయం సాధిస్తారని పేర్కొన్నారు. మా విద్యాసంస్థలలో నాణ్యత ప్రమాణలకు తొలి ప్రాధాన్యత ఉంటుందని, అందుకే మా పాఠశాలలో చదివే విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుంటారని తెలిపారు. విద్యతోపాటు విద్యార్థుల వ్యక్తిగత వికాసానికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పట్ల శ్రద్ధ పెట్టాలని సూచించారు. చిన్నారులను మొబైల్, లాప్ టాప్‌లకు, జంక్‌ఫుడ్‌లకు దూరంగా ఉంచాలని కోరారు. త్వరలో మేడ్చల్ కొంపల్లిలో అంతర్జాతీయ ప్రమాణాలతో నార్త్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన క్షీరసాగర మథనం, రామాయణం, నృత్యా నాటకం, బాహుబలి, చంద్రముఖి, జై జవాన్ జై కిసాన్, శివ తాండవం తదితర ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ రజిని విఠల్ రెడ్డి, సిఏఓ శేషరావు, అకాడమిక్ డిన్ రాజశేఖర్, పాఠశాల ప్రిన్సిపల్ మహేష్, విద్యార్థుల తల్లీదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీకి జన్మదిన శుభాకాంక్షలు



నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీకి హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహ్మద్ షకీల్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. షబ్బీర్ అలీని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మహ్మద్ షకీల్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీకి మహ్మద్ షకీల్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మైనారిటీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని షబ్బీర్ అలీ అభిప్రాయం వ్యక్తం చేశారని మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహ్మద్ షకీల్ తెలిపారు. షబ్బీర్ అలీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహ్మద్ షకీల్‌తో పాటు ఓల్డ్ మలక్ పేట డివిజన్ కాంగ్రెస్ నేతలు జహంగీర్ బాయ్, నిజాం, ముషారఫ్, ఇమ్రాన్, అన్వర్, అర్షద్, ఫయిమ్, మున్నా ఫజిల్, మహబూబ్ అలీ ఉన్నారు.

మరోసారి కులగణన సర్వే



నవతెలంగాణ-తుర్కయంజాల్

తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ కుల గణన సర్వే (SEEPEC)లో గతంలో పాల్గొనని వారికి ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చినట్లు పుర కమిషనర్ అమరేందర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుండి 28వ తేది వరకు సర్వేలో పాల్గొనని వారు తమ వివరాలను పుర పరిధిలోని రాగన్నగూడలో ఉన్న వార్డు కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలను టోల్ ఫ్రీ నెంబరు 040 - 21111111 మరియు పుర కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

'వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి'



నవతెలంగాణ-బడంగ్‌పేట్

పేద ప్రజలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వారు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 8వ డివిజన్ మాజీ కార్పొరేటర్ జీ.ఇంద్రసేన అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 8వ డివిజన్ పరిధిలోని జయసూర్య పట్నం కాలనీలో కామినేని హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ఎంతో మంది పేద ప్రజలు అనేక అంటూ వ్యాధులతో బాధపడుతున్నారని, ఆ వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్త చర్యగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని అందుకోసం ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కామినేని ఆస్పత్రి వైద్యులు రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నాగోల్

పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం పలు ప్రైవేట్ ఆస్పత్రులు, స్వచ్ఛంద సంస్థలు, కాలనీల సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి అన్నారు. ఆదివారం నాగోల్ చౌరస్తాలోని సుప్రజ ప్రైవేట్ ఆస్పత్రి, కమలానగర్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమల నగర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆర్థిక పరిస్థితులను గమనించి నాగోల్‌లోని సుప్రజ ఆస్పత్రి యాజమాన్యం నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ శిబిరానికి విచ్చేసి వారికి షుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించిట్లు తెలిపారు. తర్వాత వైద్యులు వారికి సలహాలు, సూచనలతో పాటు మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసరా హయత్‌నగర్ సర్కిల్ ఉపాధ్యక్షులు పార్టీ ఆదిరెడ్డి, కమల నగర్ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు మోతే పూలమ్మ, కమల నగర్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డి.ఉపేందర్ రెడ్డి ,ప్రధాన కార్యదర్శి సారంగం, సుప్రజ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ నీలిమ, క్యాంప్ కోఆర్డినేటర్ వి.కార్తికేయ, వైద్య బృందం మనీషా, దివ్య, స్వాతి, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-చంపాపేట్

యాకుత్‌పురా నియోజకవర్గం సంతోష్ నగర్ చంద్రయాన్ గుట్ట కంచన్ బాగ్ డివిజన్ తెలంగాణ గిరిజన సంఘం మిధాని తండా వద్ద ఆదివారం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిరిజన అధ్యక్షులు మూడవ ధర్మనాయక్, సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ సెక్రెటరీ ఎండి అబ్బాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం. శ్రీనివాస్‌లు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, గిరిజన సంఘం హైదరాబాద్ సౌత్ కార్యదర్శి ఎం బాలు నాయక్ గిరిజన సంఘం



హైదరాబాద్ అధ్యక్షులు వి రామకుమార్, కంచన్ ఎస్సై లింగరాజు, పోలీస్ సిబ్బంది, సీఐటీయూ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎం. శ్రవణ కుమార్, ఎం మీనా, ఆవాజ్ కార్యదర్శి అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీపిల్లలు అదృశ్యం



నవతెలంగాణ-చంపాపేట్

తల్లీపిల్లలు అదృశ్యమైన ఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీపురం కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీపురం కాలనీలో ఆరు నెలలుగా గిరిమోని మహేశ్, కృష్ణవేణిలు నివాసం ఉంటున్నారు. కృష్ణవేణి గృహిణి. మహేశ్ కూలీ పనిచేస్తుంటాడు. వీరికి కుమారుడు గణేశ్, కుమార్తె ప్రణతి ఉన్నారు. గణేశ్ కూలీ పనులకు వెళ్లి తిరిగి ఇంటి వచ్చాడు. ఈ క్రమంలో భార్య పిల్లలు కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన అతడు అన్ని చోట్ల వెతికినా వాళ్ల ఆచూకీ లభించక పోవడంతో మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సురేశ్ తెలిపారు.

కుమ్మరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామకోటి



నవతెలంగాణ- హయత్‌నగర్

కుమ్మరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మన్సూరాబాద్ డివిజన్‌కు చెందిన ఏలుకోండ రామకోటిని నియమించారు. ఈ మేరకు ఆదివారం రామకోటి మాట్లాడుతూ 2019 నుండి సంఘంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పని చేసినట్టు తెలిపారు. రాజకీయాల్లో ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తానని, కుమ్మర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం తనకు ఈ అవకాశం ఇచ్చిన వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకార మోహన్, రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నవతెలంగాణ-హయత్‌నగర్

అనివార్య కారణాల వలన నేడు(సోమవారం) విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని సరూర్‌నగర్ విద్యుత్ డీఈ రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.11కేవీ గోటేటి ఫంక్షన్ హాల్ ఫీడర్..రాక్ టౌన్ రోడ్ నెంబర్ 1,2,3. సాయి నగర్, లలితా నగర్ పరిసర ప్రాంతాల్లో, 11కేవీ సాయి నగర్ ఫీడర్..చాణిక్యపురి కాలనీ, సాయి నగర్ రోడ్ నెంబర్ 1,2 పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం



నవతెలంగాణ -హయత్ నగర్

ఓ మహిళ అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అబ్దుల్లాపూర్ మండలం కళానగర్ గ్రామానికి చెందిన కొండపల్లి శారద.. ఆమె భర్త తాగి ఈ నెల 15న ఆమెతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో శారద చిన్న బిడ్డను తీసుకొని ఇద్దరు పిల్లలను ఇంట్లోనే వదిలేసి వెళ్ళిపోయింది. ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో ఈటల



నవతెలంగాణ-హయత్‌నగర్

రేణుక ఎల్లమ్మ, దేవాలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి మాల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డిలు హాజరయ్యారు. తర్వాత ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, డివిజన్ అధ్యక్షులు గంగని శ్రీను, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సంఘీ అశోక్, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి ఎంతో కృషి



మర్రి నర్సింహారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

ది భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం బ్యాంకు చైర్మెన్‌గా రైతుల ఆర్థికాభివృద్ధి కోసం ఎంతో కృషి చేయడం జరిగిందని చైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలోని ది భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం బ్యాంకు చైర్మెన్‌గా తన పదవి కాలం 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భాగ్యనగర్ రైతు సేవ సొసైటీ వైస్ చైర్మెన్ బంగారు బాబుతో పాటు డైరెక్టర్లు, నాదర్ గుల్ గ్రామ రైతులకు, నాయకులకు, మండలం సంబంధించిన బ్యాంకు సభ్యులకు, బీఆర్ఎస్ పార్టీ, వివిధ పార్టీల నాయకులకు, మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం సబితా ఇంద్రారెడ్డికి శ్రేయోభిలాషులకు ప్రత్యేకంగా ధన్యవాదములు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గత 5 సంవత్సరాలుగా బ్యాంకు చైర్మెన్‌గా రైతులకు, ఖాతాదారులకు సేవ చేయడం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మరో మారు 6 నెలలు పదవి కాలాన్ని పొడిగించినందుకుగాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదములు తెలియజేశారు. అనంతరం నాదర్‌గుల్ గ్రామంలోని బ్యాంకు కార్యాలయంలో కేక్ కట్ చేసి, స్వీట్లను పంపిణీ చేశారు.

ప్రజా గొంతుక 'నవతెలంగాణ'



నవతెలంగాణ-చంపాపేట్

ప్రజా గొంతుక నవ తెలంగాణ దిన పత్రిక అని హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ ఆల్ జోన్ జనరల్ సెక్రెటరీ అడ్వకేట్ కిషన్ శర్మ సౌత్ ఈస్ట్ జోన్ అధ్యక్షులు ఖాజా ఫుజియుద్దీన్, నారాయణ రెడ్డి, సంతోష్ నగర్ సీఐ కె. సత్యనారాయణ అన్నారు. హైదరాబాద్ జిల్లా యాకుత్‌పురా నియోజకవర్గం సంతోష్ నగర్ డివిజన్ పరిధిలోని కంచన్‌బాగ్ మీదని ఫిషల్ బండ క్రాస్ రోడ్డు ఎం. కె క్రౌన్ ఫంక్షన్ హాల్లో సౌత్ ఈస్ట్ జోన్ పీస్ కమిటీ మంత్లీ మీటింగ్‌లో పలువురు పీస్ కమిటీ సభ్యులతో కలిసి వారు 2025 నూతన సంవత్సర



'నవతెలంగాణ' క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీస్ కమిటీ సభ్యులందరూ సమాజ సేవలో ముందుండాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజలందరూ, పీస్ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించాలని కోరారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలను వెలికి తీయాల్సిన బాధ్యత పత్రికలపై ఉందన్నారు.

పది మందికి ఉపయోగపడే కథనాలను ప్రచురించే పత్రికలను ప్రజలు ఎల్లప్పుడూ ఆదరిస్తారన్నారు. నిర్భయంగా నిజాలను వెలుగులోకి తీసుకురావడంలో నవతెలంగాణ పాత్ర ప్రత్యేకమైనదని కొనియాడారు. అధికారులకు, పాఠకులకు, ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తుందన్నారు. అంతేకాదు ప్రజా సమస్యలను తీర్చేందుకు నవతెలంగాణ దిన పత్రిక ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీస్ కమిటీ సభ్యులు హఫీజ్ ముజాఫర్ హుస్సేన్, ఆజాజ్ ఖాద్రి, నసిరుద్దీన్, నమాజుద్దీన్, రిజ్వాన్, పోలీస్ సిబ్బంది డి. కిరణ్ కుమార్, ఎండి ఫఫత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లప్పుడూ ప్రజా సేవలో ఉంటా :మాజీ కౌన్సిలర్



నవతెలంగాణ-తుర్కయంజాల్

పదవి ఉన్నా, లేకున్నా ఎల్లప్పుడూ ప్రజా సేవలో ఉంటానని తుర్కయంజాల్ మున్సిపాలిటీ మునుగనూర్ గ్రామం 15వ వార్డు మాజీ కౌన్సిలర్ వేముల స్వాతి అమరేందర్ రెడ్డి అన్నారు. 5 సంవత్సరాల పదవి కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా మాజీ కౌన్సిలర్‌ను అంజనాపూరి కాలనీ అండ్ గోల్డెన్ స్ట్రీట్ కాలనీ వాసులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ మాట్లాడుతూ కాలనీవాసులు తమ సేవను గుర్తించి సన్మానించినందుకు సంతోషంగా ఉందన్నారు. కాలనీవాసుల ఆదరాభిమానాలు తమపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, చంద్రశేఖర్, నర్సింహ, వాసు, తిరుపతయ్య, సంతోష్ కుమార్, మహేందర్ గౌడ్, రాజారత్నం, కార్తీక్ ప్రభు, శివ నాయక్, శంకర్, వెంకటేష్ కుమార్, సంతోష్, మోహన్ చారి, నారాయణ రావు, కార్తీక్, షేక్ సాధిక్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలి

మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

నేటి సమాజంలో విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు.



మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బడంగ్‌పేట్‌లోని తిరుమల గార్డెన్స్‌లో న్యూ మాస్టర్ మైండ్ స్కూల్ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి హాజరై మాట్లాడారు. విద్యతోనే సమాజంలో ప్రతి ఒక్కరికీ గౌరవం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ బంగారు అనిత ప్రభాకర్, హాస్య నటుడు జబర్దస్త్ చలాకి చంటి, బేకుల సుధాకర్ రెడ్డి, మాష్టర్ మైండ్ స్కూల్ యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సహస్ర ఫిజియో రిహాబ్ సెంటర్ ప్రారంభం



నవతెలంగాణ-హయత్‌నగర్

సహారా ఎస్టేట్స్‌లో ఏర్పాటు చేసిన సహస్ర ఫిజియో రిహాబ్ సెంటర్‌ను జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి ఆదివారం హాస్పిటల్ నిర్వాహకులు డా.లక్ష్మీ నర్సింహులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రస్తుతం మనం తీసుకుంటున్న కలుషిత ఆహార పదార్థాలు ఎక్కువగా ఉండడం వలన కీళ్ల నొప్పులు, వెన్నుముక నొప్పులు, శరీరంలోని రక్తం సరఫరా సాఫీగా ఉండేందుకు ఉపయోగపడేది ఫిజియోథెరపీ అని.. ఈ యొక్క రియాబిటేషన్ వలన ఎంతో మందికి తొందరగా చికిత్స నయం అవుతుందని తెలియజేశారు. ఉదయాన్నే మనం చేసే వ్యాయామం వలన ఎలాంటి కీళ్లనొప్పులు, ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలను తలెత్తకుండా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ప్రదీప్, డాక్టర్ భార్గవి, డాక్టర్ అబ్దుల్లా, డాక్టర్ అశ్విని, డాక్టర్ కృతి సీనియర్ సిటిజన్స్ సత్యనారాయణ, జానీమియా, రామచంద్ర రెడ్డి, ఆదినారాయణ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాక్‌టౌన్ సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ -నాగోల్

నాగోలు డివిజన్ పరిధిలోని రాక్‌టౌన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రాక్‌టౌన్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏ. వినోద్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మహిపాల్ రెడ్డిలు కోరారు. ఈ మేరకు షామీర్‌పేటలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఈటల రాజేందర్‌ను ఆదివారం వారు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటు, అనధికారికంగా ఉపయోగిస్తున్న స్మశాన వాటికలను కాలనీ నుండి వేరే ప్రాంతానికి తరలించి.. తమ కాలనీలోని పార్కులకు తగిన నిధులను మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ ఈటల రాజేందర్ తప్పకుండా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాక్ టౌన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎర్ర వినోద్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మణిపాల్ రెడ్డి, మాజీ ప్రెసిడెంట్స్ రాంరెడ్డి, మాధవ రెడ్డి, వెంకటరెడ్డి సంజీవ రెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
సోమవారం | ఫిబ్రవరి 17, 2025 | www.navatelangana.com

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

రంజాన్ మాసంలో మస్జీద్, ప్రధాన రహదారులో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నను ఓ ప్రకటనలో కోరారు. రంజాన్ మాసంలో ముస్లింలు ప్రతి రోజూ ఉపవాసం ఉంటూ రోజుకు ఐదుసార్లు నమాజ్ చేస్తూ నిష్ఠగా ఉంటారన్నారు. దీంతో పాత బస్తీలోని అన్ని ప్రాంతాలన్నీ శుభ్రంగా ఉండే విధంగా అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చెత్త కుప్పలను తొలగించాలని ఆయన కోరారు. చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకోవాలని మస్జీద్‌ల వద్ద బస్తిలలో సాయంత్రం సమయంలో అదనపు సిబందిని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ప్రజాఏక్త పార్టీ మద్దతు కోరిన కేడి దినేష్..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో నిర్మిస్తున్న ఉస్మానియా ఆస్పత్రి నిర్మించ వద్దని చేస్తున్న పోరాటానికి ప్రజాఏక్త పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌ను ఆయన కార్యాలయంలో ఆదివారం కలిసి మద్దతు కోరామని టీడీపీ వాణిజ్య శాఖ రాష్ట్ర సెక్రెటరీ కేడి దినేష్ తెలిపారు. ఈ సందర్భంగా తన పూర్తి మద్దతు తెలియజేస్తున్నానని ఆయన చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ పరిరక్షణ సమితి నాయ కులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దుకు ఉద్యమించాలి

- టీయుసీఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ



నవతెలంగాణ-ముషీరాబాద్

లేబర్ కోడ్స్ రద్దుకు ఉద్యమించాలని ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలని టీయుసీఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ తెలిపారు. ఆదివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల టీయుసీఐ ప్రథమ మహాసభ టీయుసీఐ అధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన టీయుసీఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి దేశ కార్పొరేట్లకు, వారి ఆస్తులను పెంపొందించుకోవడానికి రూపొందించారన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన విమాన, నౌకాయానం, రైల్వే, బ్యాంకింగ్, ఎల్ఐసి, డిఫెన్స్, బొగ్గు, భూగర్భ ఖనిజ సంపద కార్పొరేట శక్తులకు దోచి పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిది గంటల పని దినం రద్దుచేసి, 12 గంటల పని విధానం తెచ్చి పెట్టారని ఉత్పత్తి, సర్వీసు సేవా రంగాలలో మరమనుషులను (రోబోలు) ప్రవేశపెట్టి కార్మిక వర్గానికి పని లేకుండా చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ప్రజా వతిరేక విధానాలకు పాల్పడుతున్నారని, కార్మిక వర్గం సంఘటితమై కార్మిక వర్గ హక్కులకై పోరాడా లని, పిలుపునిచ్చారు. టీయుసీఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అన్మేష్ మాట్లాడుతూ కార్మికవర్గం దేశ సంపదను సృష్టిస్తుంటే నేటి ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్నారన్నారు. హైదరాబాద్ రంగారెడ్డి మేడ్చల్ జిల్లాల టీయుసీఐ ప్రధాన కార్యదర్శి వి.ప్రవీణ్ మాట్లాడు తూ 2015 సంవత్సరంలో మహాసభలు జరుపుకున్నామని తిరిగి నేడు జిల్లా 9వ మహాసభ, టీయుసీఐ ప్రథమ మహాసభ జరుపుకుంటున్నామన్నారు. ఈ మహాసభల్లో నూతన నాయకత్వాన్ని ఎన్నుకొని ప్రభుత్వాల కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలన్నారు. ఈ మహాసభలో ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ ఎండి అఫ్జల్, కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, తెలంగాణ భవన ఇతర నిర్మాణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.నల్లన, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.లక్ష్మి, కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకురాలు వీరమణి ప్రసంగించారు.

కార్మికపక్షపాతిగా సంజీవరెడ్డి చెరగని ముద్ర

- తెలంగాణ కాంగ్రెస్ టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్



నవతెలంగాణ-ముషీరాబాద్

కార్మికపక్షపాతిగా మాజీ మంత్రి సంజీవరెడ్డి చెరగని ముద్ర వేస్తూ ఎల్లప్పుడూ వారి శ్రేయస్సు కొరకు కృషి చేస్తున్నారని తెలంగాణ కాంగ్రెస్ టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. జాతీయ ఐఎన్టీయూసీ అధ్యక్షులు డాక్టర్ జి.సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు తెలంగాణ అంధ్రప్రదేశ్ ఐఎన్‌టీయుసీ, వీఎస్‌టీ కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో రాంనగర్ వీఎస్‌టీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ జన్మ దిన వేడుకలకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, మాజీ తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆర్సి కుంతియా, మాజీ పీసీసీ అధ్యక్షులు వి.హనుమంతరావు, జాతీయ ఐఎన్టియుసి ఉపాధ్యక్షులు, ఉత్తరప్రదేశ్ అధ్యక్షులు, అశోక్ సింగ్, కర్ణాటక అధ్యక్షులు లక్ష్మీ వెంకటేశం, మినిమం వేజెస్ బోర్డు చైర్మెన్ తెలంగాణ జనక్ ప్రసాద్ హాజరై సంజీవరెడ్డిని ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంజీవరెడ్డి కార్మిక నాయకుడిగా కాకుండా శాసనసభ్యుడుగా కార్మిక ఉపాధి శిక్షణ మంత్రిగా పనిచేశారని కొనియాడారు. ఎల్లప్పుడూ కార్మికుల సంక్షేమం కోసమే ఆలోచిస్తారన్నారు ఆరోగ్య రీత్యా నవ నవయవనుడిగా ఉంటూ చురుకుగా ఉంటారన్నారు. ఆయన ఇటువంటి జన్మదినాలు ఇంకా ఎన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీసీ నాయకులు చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు,ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్ , బాబరు సలీం పాషా, సత్య జిత్ రెడ్డి, వీఎస్‌టీ కార్మిక యూనియన్ నాయకులు రాజు, ఎల్.డి పాల్, నగేష్, ఏఆర్ శ్రీనివాసులు, డి కృష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశంలోని సమస్యల పరిష్కారానికి ఆసక్తి చూపని కేంద్రం..



- రాష్ట్ర స్థాయి కేడర్ మీట్‌లో ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్

నవతెలంగాణ-ధూల్ పేట్

ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ సమస్యల పరిష్కారానికి తమ సంస్థ నిరంతరం కృషి చేస్తుందని మూవ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ముహమ్మద్ అబ్దుల్ అజీజ్ అన్నారు. పురానీహవేలిలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర స్థాయి కేడర్ మీటింగ్ జరిగింది. 'తెలంగాణలో రాజకీయ, సామాజిక పరిస్థితులు- మన బాధ్యతలు' అనే అంశంపై నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎంపీజే ఒక రాజకీయేతర, సామాజిక సంస్థ అన్నారు. ఇది కులమతాలకతీతంగా ప్రజల సమస్యలపై పోరాడుతుందన్నారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం పూర్తిగా ముస్లిం వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని, కేంద్రం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును ఎంపీజే తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. దేశంలో చాలా సమస్యలున్నటికీ వాటి పరిస్కారానికి ఏమాత్రం చొరవ చూపకుండా కేవలం ఒక వర్గానికి టార్గెట్ చేస్తూ పాలన సాగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం అవలంభిస్తున్న ముస్లిం వ్యతిరేక విధానాలను సెక్యులర్ నాయకులనబడే చంద్రబాబు నాయుడు, నితిష్‌కుమార్‌లు పరోక్షంగా మద్దతినిస్తున్నారని ముస్లిం సమాజం భావిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ అడ్వకేట్ మసూద్ అలీఖాన్ తోపాటు ఎంపీజే రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఫరీసా ఖాద్రి, జనరల్ సెక్రెటరీ సలీమ్ల హిందీ, ప్రతినిధులు ఏ.ఏ నయీమ్, షేక్ ఖాసిం, ఫైనాన్స్ సెక్రెటరీ అహ్మద్ హెచ్. షకీల్ తదితరులు పాల్గొన్నారు.

హజ్రత్ ఇమామ్ మెహదీ అలీ సలాం జయంతి వేడుకలు



నవతెలంగాణ-ధూల్‌పేట్

హజ్రత్ ఇమామ్ మెహదీ అలీ సలాం 1191 జయంతిని శనివారం షియా ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. పాతబస్తీలోని ఆలీనగర్, దారుల్ షిఫా, పురాని హవెలి, మదీనా, బహదూర్ పురా, కిషన్ బాగ్, ప్రాంతాల నుంచి సహెర ముబారక్ ఊరేగింపు కోహె ఖాయం చేరుకుంది. ఈ సందర్భంగా దారి పొడవునా ఏర్పాటు చేసిన స్వాగత వేదికల వద్ద సహెరె ముబారక్ ఊరేగింపునకు ఘనంగా స్వాగతం పలికారు. హజ్రత్ ఇమామ్ మెహదీ అలీ సలాం జన్మదిన ఉత్సవాలలో పాల్గొన్న షియాముస్లిం మత పెద్దలు హజ్రత్ జీవిత విశేషాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మౌలానాహైదర్ రజా రాజ్వి, మౌలానా దిల్దార్ హుస్సేన్, మీర్ ఫిరసత్ అలీ బాకరి,లియాఖత్ హుసేన్ రాజవి, తదితరులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ వార్షిక స్పోర్ట్స్ మీట్ ముగింపు వేడుకలు



నవతెలంగాణ-అంబర్‌పేట

స్పోర్ట్స్ మీట్ కేవలం అథ్లెటిక్ ప్రతిభ యొక్క వేడుక మాత్రమే కాదు, క్రీడలు, టీమ్ వర్క్‌కు దోహదం చేస్తుందని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ వ్యవస్థాపక చైర్మెన్ మణికొండ వేద కుమార్ అన్నారు. ఆదివారం ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ వార్షిక స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ ప్రీ ప్రైమరీ విద్యార్థులు ఉత్సాహ టీమ్ వర్క్ ప్రదర్శించి కార్యక్రమంలో పాల్గొన్నారు. మైఖేల్ ఆశిష్ వ్యాఖ్యాతగా వ్యవహరించి జ్యోతి వెలిగించడంతో ఈ కార్యక్రమం ప్రారంభమై జ్ఞానం, సంకల్పానికి ప్రతీకగా నిలిచింది. పీపీ-2కు చెందిన ఇద్దరు విద్యార్థులు సాదరంగా స్వాగతం పలికి ఉత్సాహభరితమైన వేడుకకు వేదికను సిద్ధ పరిచారు. జయలక్ష్మి మేడమ్ కొరియోగ్రఫీ చేసిన అద్భుతమైన స్వాగత నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో డీన్ రామాంజుల మేడమ్, ఓజీఎస్ జూనియర్ ప్రిన్సిపాల్ ఫాతిమా మేడమ్, సీబీఎస్ఈ ప్రిన్సిపాల్ రేఖారావు, ఎస్ఎస్సీ అధ్యాపకురాలు రాజశ్రీ దాగా స్ఫూర్తిదాయక ఉపన్యాసాలతో విద్యార్థులు క్రీడాస్ఫూర్తి, పట్టుదలను అలవర్చుకున్నారు. ఫ్లవర్ గార్లాండ్స్, పోమ్ పోమ్స్, గొడుగులు, క్రికెట్ బ్యాట్స్ వంటి ఉపకరణాలను ఉపయోగించి విద్యార్థులు తమ సమన్వయం, సృజనాత్మకతతో ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో డ్రిల్ నృత్య ప్రదర్శనలు ఒక ప్రధాన హైలైట్‌గా నిలిచాయి. ముఖ్య అతిథిగా అంజలి రజ్దాన్ హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఈపీ 2020 గురించి మాట్లాడారు. ఇది భారతదేశంలో కొత్త విద్యా వ్యవస్థను ఎలా రూపొందిస్తుందో నొక్కి చెప్పారు. కొత్త తరం-జెన్ జెడ్ జెన్ ఆల్ఫా- బోధనలో వినూత్న విధానాలు అవసరమన్నారు. చీఫ్ ప్యాట్రన్, పాఠశాల వ్యవస్థాపకుడు వేదకుమార్ మణికొండ మాట్లాడుతూ విద్యార్థుల ఐక్యత కృషి అని కొనియాడారు. వారి అంకితభావాన్ని సమగ్ర విద్య పట్ల పాఠశాల యొక్క నిబద్ధతను ప్రశంసించారు. వార్షిక స్పోర్ట్స్ మీట్ కేవలం అథ్లెటిక్ ప్రతిభ యొక్క వేడుక మాత్రమే కాదు.. క్రీడలు, టీమ్ వర్క్ సంపూర్ణ అభ్యాసం ద్వారా యువ మనస్సులను పెంపొందించడానికి ఓజీఎస్ జూనియర్స్ యొక్క నిబద్ధతను లభిస్తుందన్నారు. స్కూల్ ఓజీఎస్ జూనియర్స్‌ను తీర్చిదిద్దడంలో వారి వెనుక ఉన్న దార్శనికురాలు ప్రార్థనా మణికొండకు ప్రత్యేక ప్రశంసించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అపారమైన సహకారం అందించినందుకు కరస్పాండెంట్ ప్రభాకర్‌ను కూడా ప్రశంసించారు.

క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదం

- కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభించిన ఈసీ నగర్ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ గౌడ్
- వివేకానంద యూత్ క్లబ్, గణేష్ మహారాజ్ గ్రూప్ ఆధ్వర్యంలో కబడ్డీ టోర్నమెంట్





నవతెలంగాణ-చర్లపల్లి

క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడుతాయని యువత చెడు దారి పట్టకుండా క్రీడలు చక్కగా ఉపయోగపడతాయని ఈసీ నగర్ సొసైటీ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఈసీ నగర్ కాలనీలో వివేకానంద యూత్ క్లబ్, గణేష్ మహారాజ్ గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. అండర్-16 పది టీములు, అండర్-19లో మూడు టీములు మొత్తం 13 టీములు పాల్గొన్నవి. టోర్నమెంట్‌లో విజయం సాధించిన టీములకు ప్రథమ బహుమతి ట్రోఫీ, ప్రశంస పత్రంతో పాటు వెయ్యి రూపాయల నగదును అందజేశారు. ద్వితీయ బహుమతికి ట్రోఫీతో పాటు రూ. 500ల నగదు, ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ఈసీ నగర్ సొసైటీ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి జగ్గరాజు, ఈసీ నగర్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్‌వీ ప్రసాద్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎస్.సత్తిరెడ్డి, వివేకనంద యూత్ క్లబ్ వ్యవస్థా పకులు (ఫౌండర్) శరత్ సుదర్శి, గణేష్ మహా రాజ్ ఫౌండర్ గణేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత చెడు దారి పట్టకుండా వివేకానంద యూత్ క్లబ్, గణేష్ మహరాజ్ గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల సమయంలో ఎదురయ్యే ఎదురు దెబ్బలు నిరుత్సాహానికి దారితీయకూడ దని, ప్రతి ఓటమి భవిష్యత్తులో విజయానికి అవకాశంగా ఉపయోగ పడుతుందని పాల్గొనే వారి టీంలకు వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివేకానంద క్లబ్ స భ్యులు ఉషశ్రీ సహస్రిక, రితిక తదితరులున్నారు.



యోగాతో శారీరక ఆరోగ్యం పదిలం

- ఎమ్మెల్యే ముఠాగోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

యోగాతో శారీరక ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్వాన ఫౌండేషన్ సహకారంతో ఐదు రోజుల పాటు జరిగిన ఉచిత యోగా, మెడిటేషన్ ముగింపు కార్యక్రమానికి ముఠా గోపాల్ హాజరై మాట్లాడారు. మానవ శరీరం నిరంతరం కఠిన సవాళ్లను ఎదుర్కొంటుందని, వాటన్నింటిని అధిగమించాలంటే నిరంతరం యోగా సాధన చేయాలన్నారు. మానసిక ప్రశాంతతో పాటు శరీర పటుత్వం పెరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు ముఠా జైసింహ, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పి.వి. నిరంజన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి, ఇంటర్నేషనల్ మాజీ అధ్య క్షులు వి.నాగభూ షణం, హౌస్ ఫెడ్ డైరెక్టర్ ఎ. కిషన్ రావు, ఎస్ రమేష్ రెడ్డి, టి.స్కైలాబ్ బాబు, కృష్ణ, శంకర్ ముదిరాజ్, తొట్లగోపి, సత్య నారాయణ తదితరులున్నారు.

'ఎమ్మెల్సీ అభ్యర్థులు గవ్వల శ్రీకాంత్, లక్ష్మీలను గెలిపించాలి'

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల్లో దళిత బహుజన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న గవ్వల శ్రీకాంత్, గవ్వల లక్ష్మీలను గెలిపించాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ కోరారు. అభ్యర్థుల గెలుపునకు ఎన్నికల ప్రచారం నిమిత్తం పార్టీ నాయకుల బృందం ఆదివారం హైదరాబాద్ నుండి ఉత్తర తెలంగాణ ప్రాంతానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులను ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేశాయని, నిరుద్యోగులకు భృతి చెల్లించకుండా ద్రోహం చేశాయన్నారు. కాంగ్రెస్, బీజేపీ వంటి మనువాద, కాషాయ దోపిడీ పార్టీల ఎమ్మెల్సీ అభ్యర్థులను ఈ ఎన్నికల్లో ఓడించాలని, దళిత బహుజన పార్టీ అభ్యర్థులు గవ్వల శ్రీకాంత్ (పట్టభద్రుల) సీరియల్ నెంబర్.5, గవ్వల లక్ష్మీ సీరియల్ నెంబర్.3లను గెలిపించాలని ఆయన కోరారు.

అంబర్‌పేట నియోజకవర్గం ఉపాధ్యక్షుడిగా పుల్లూరి అశోక్ చారి



నవతెలంగాణ-అంబర్‌పేట

ఆల్ ఇండియా శ్రీ విరాట్ విశ్వకర్మ ఉమెన్ అండ్ యూత్ ఫెడరేషన్ అంబర్‌పేట నియోజకవర్గం ఉపాధ్యక్షుడిగా పటేల్ నగర్‌కు చెందిన పుల్లూరి అశోక్ చారిని జాతీయ వ్యవస్థాపకులు అర్నాజి జైన్ కుమార్‌చారి, జాతీయ సెక్రెటరీ చిన్నయ్య, ఆచారి జగదీషన్, తెలంగాణ ఇన్‌చార్జి శ్రీశైలం శ్రీనివాస్ చారి, తదితరులు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ చారి మాట్లాడుతూ బాధ్యతాయుతంగా పనిచేస్తానని నాకు ఈ అవకాశం ఇచ్చిన సంఘం పెద్దలందరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలోతెలంగాణ సెక్రటరీ శ్రీ లక్ష్మీ నరసింహ సేన చారి, గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ బి.లక్ష్మణాచారి, జనరల్ సెక్రెటరీ ఎస్.నరేందర్ చారి, హైదరాబాద్ ఉమెన్ రింగ్ అధ్యక్షురాలు కుందారం బాలమని, గ్రేటర్ అంబర్‌పేట డివిజన్ మహిళ వింగ్ అధ్యక్షురాలు కే.స్వాతి, రామంతపూర్ డివిజన్ ఉమెన్ వింగ్ అధ్యక్షులు ఎన్.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఏఐఎస్ఎఫ్ నాయకులకు సన్మానం'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ అధ్యక్షులు వీరాజ్, కార్యదర్శి దినేష్‌లను ఉస్మానియా యూనివర్సిటీ మాజీ జాయింట్ రిజిస్ట్రర్ ఉప్పర్ ఎల్లేష్ ఆదివారం హిమాయత్ నగర్ లోని సమైక్య కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉప్పరి ఎల్లేష్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రభుత్వ విద్య పరిరక్షణ, కామన్ విద్యా విధానం కోసం ఉద్యమించాలని కోరారు.అదే విధంగా దేశ వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమం బలోపేతం కోసం కృషి చేయాలని ఆయన సూచించారు.



సంకటహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకొని యాదాద్రి లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్, కాంగ్రెస్ నాయకులు జెల్లీ శ్రీమంత్ గిరి, బీజేపీ సీనియర్ నాయకులు చింతల శ్రీనివాస్ ముదిరాజ్, కెంచెచంద్రశేఖర్ తదితర నాయకులు పాల్గొన్నారు. **నవతెలంగాణ-అంబర్‌పేట**

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా వామపక్ష కమ్యూనిస్టుల నిరసనకు మద్దతిస్తాం

- సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బి.పురుషోత్తం



నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా 18,19 తేదీల్లో వామపక్ష కమ్యూనిస్టుల నిరసనకు మద్దతుగా సోషలిస్ట్ పార్టీఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ తరపున పూర్తిగా మద్దతు ప్రకటిస్తామని వ్యవస్థాపక అధ్యక్షులు బి.పురుషోత్తం తెలిపారు. ఈ మేరకు ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థ ఎన్నిక ల్లో ఎవరి మద్దతు లేకుండానే బలమున్న ప్రతిచోట పోటీలో ఉం టామని తెలియజేస్తున్నామని కేంద్ర బడ్జెట్‌లో మోడీ ప్రభుత్వం ప్రజల మౌలిక అవసరాలకు కేటాయింపులు తగ్గించి సంపన్నుల కు రాయితీలు పెంచిందని సామాన్య ప్రజలకు తీవ్ర ద్రోహం చేస్తు న్నారని ధ్వజమెత్తారు. ఈ బడ్జెట్‌కు ప్రత్యామాయ ప్రతిపాదన లకు రూపొందించి వాటిని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ వామ పక్ష కమ్యూనిస్టు పార్టీలు 18,19న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్నారని కమ్యూనిస్టులతోపాటు సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ పాల్గొంటుంద న్నారు. ఈ సమావేశం ద్వారా తెలియచేయడం జరిగినది భీమా రంగంలో 100శాతం ఎఫ్డిఐ ఉపసంహరించాలని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ ప్రభుత్వ ఆస్తులను ప్రయివేట్ వారికి అప్పగించడం ఆపాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో డిమాండ్ చేశారు. శిశు సంక్షేమ సంఘానికి కేటాయింపులు పెంచాలని స్కీమ్ వర్కర్ల గౌరవేతనంతో పారిశ్రామ సంస్థలో స్త్రీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్ని రంగాలలో పురుషులతో పాటు స్త్రీలకు సమానంగా రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ట్రాఫిక్ సిగ్నల్‌లో ట్రాఫిక్ పోలీసులు అవలంభిస్తున్న పనితీరును నిగ పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఉచిత ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేసి ఈ ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లోకి వెళ్లాలని సూచించారు.

మూఢనమ్మకాలను పారద్రోలడంలో ముందుండాలి

- ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం



నవతెలంగాణ-ముషీరాబాద్

మూఢనమ్మకాలను పారద్రోలడంలో సైంటి ఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ముందు వరుసలో ఉండి పని చేయాలని ఉస్మానియా యూని వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాసిం అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారత నాస్తిక సమాజం అనుబంధ విద్యార్థి సంఘం సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆవిర్భావ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ కాశీం హాజరై మాట్లాడుతూ.1972లో ఏర్పడి గత 53 సంవత్సరాలుగా సమాజంలోని మూఢత్వం, అసమానతల నిర్మూలనకై భారత నాస్తిక సమాజం పోరాడుతుందని తెలిపారు. ప్రజాకవి జయరాజు మాట్లాడుతూ సమ సమా జం నిర్మాణంలో ఎస్ఎస్ఎఫ్ భాగం కావాలని కోరారు. సమాజంలోని మూఢన మ్మకాలను పారద్రోలడంలో ముందు వరుసలో ఉండి పని చేయాలని విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు రమేశ్ సూచించారు. ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేదాంత్ మాట్లాడుతూ ప్రయివేట్ విద్య సంస్థలు ర్యాంకుల కోసం విద్యార్థులను ఒత్తిడి చేస్తూ విద్యాలయాలను కర్మాగారాలుగా మార్చాయని శాస్త్రీయ విద్యా విధానం కనుమరుగైందని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల సమస్యల పరిష్కారం దిశగా అన్ని విద్యార్థి సంఘాలు కృషి చెయ్యాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వర్, సీనియర్ నాయకులు ద్రావిడ ఉదయ్, నాస్తిక్ రాకేష్, సత్యశోధక్ భా.నా.స నాయకులు ఉప్పులేటి నరేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ మోహన్, రాష్ట్ర నాయకులు శివ కల్యాణి, వెంకటేష్, పవన్ జిల్లా నాయకులు అన్వేష్, శివ శంకర్ తదతరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి



- టైక్వాండో స్టేట్ చాంపియన్షిప్ అసోసియేషన్ పోటీలలో వక్తలు

నవతెలంగాణ-ముషీరాబాద్

క్రీడాకారుల్లో ఆత్మ విశ్వాసంతో పాటు తనను తాను రక్షించుకునే నమ్మకం కలిగే విధంగా తీర్చిదిద్దాలని 8వ, టైక్వాండో స్టేట్ ,ఛాంపియన్షిప్ అసోసియేషన్ ట్రెజరర్ మారుతి వరప్రసాద్ అన్నారు. టైక్వాండో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో టైక్వాండో చాంపియన్ షిప్ 2025 జరిగాయి. ఈ పోటీలకు మారుతి ప్రసాద్ హాజరై ప్రారంభించారు. ఈ పోటీలలో దాదాపు 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి మిర్ వహజ్ అలీఖాన్, మహేశ్వర్ , కొమ్మయ్య మల్లిక, గుర్రం కృష్ణ, నరసింహ విజయ్‌కుమార్, మాస్టర్స్ సురేష్, కృష్ణ హాజరై బహుమతులు, సర్టిఫికేట్లు అందజేశారు. అనంతరం మహేశ్వర్, ప్రేమ్ రాజ్ మాట్లాడుతూ పిల్లల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జనరల్ సెక్రెటరీ రాజకీయ నాయకులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 129 డివిజన్ సంజయ్ గాంధీ నగర్ పరధిలోని షాపూర్ నగర్‌లో నూతనంగా నిర్మించిన ఎస్‌టి.మాథ్యూస్ చర్చ్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కె.అనిల్ కుమార్ (బుజ్జి), 130 డివిజన్ అధ్యక్షులు సోమన్నాగారి శ్రీధర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, సల్మాన్ రాజ్, భాస్కర్ రెడ్డి, గొల్ల జాన్, రోషన్, నర్సింహా రెడ్డి, శ్యామ్, చారీ మరియు పాస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతాయని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం ఓమ్ని ఆస్పత్రి ఆధ్వర్యంలో బాలాజీనగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఉచిత మెగా వైద్య ఆరోగ్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని ప్రారంభించారు. ఇందులో భాగముగా సూపర్ స్పెషాలిటీ వైద్యులు ఆర్థోపెడిక్స్, జనరల్ మెడిసిన్, స్పైన్ సర్జన్,గైనకాలజీ, ప్రాథమిక పరిక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గం కో - ఆర్డినే టర్ సతీష్ అరోరా, ఓమ్ని హాస్పిటల్ సీఓఓ డాక్టర్ వారిస్, జీఎం శ్రీనివాస్, సుభాష్ గౌడ్, కాంచనా పల్లి నాగరాజు, ఆరోగ్య రెడ్డి, జస్వంత్, ఆసిఫ్ ఖాన్, కృష్ణ రెడ్డి, అశోక్, సావిత్రి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోమేటిక్ బీపీ కియోస్క్ ప్రారంభం..

కూకట్‌పల్లి: ఉదయం పూట వాకింగ్ చేసేవారికోసం కూకట్‌పల్లి నల్ల చెరువులో ఆటోమేటిక్ బీపీ కియోస్క్ ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. కూకట్‌పల్లి నల్ల చెరువు పార్కులో, హెూలిస్టిక్ హాస్పిటల్ ఎండీ.డాక్టర్ విఎస్.రామచంద్ర సీనియర్ కార్డియాలజిస్ట్ ఆధ్వర్యంలో.. ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభించారు. పార్కులో ఉదయం పూట వాకింగ్ చేసుకునే వారికి, బీపీ కియోస్క్ ద్వారా రక్తపోటు కియోస్కలు అపాయింట్‌మెంట్ అవసరం లేకుండా.. ప్రజలు తమ రక్తపోటును త్వరగా, సులభంగా తనిఖీ చేయడంలో సహాయపడతాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, మార్కెటింగ్ మేనేజర్ చంద్ర శేఖర్ సంతోష్, ప్రభాకర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ హామీలను పూర్తి చేయాలి

- ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు ఈ.ఉమామహేష్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే పూర్తి చేయాలని ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు ఈ.ఉమామహేష్ కోరారు. ఈ మేరకు ఆదివారం క్రాంతి ఆటో యూనియన్ ఐడీపీఎల్ అడ్డ ఆ టో డ్రైవర్ల సమావేశం గాంధీనగర్ ఏఐటీయూసీ కార్యా లయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతి థిగా ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రూ.12.000 ఇస్తామని, అదేవిధంగా మీటర్ చార్జీలు పెంచుతామని అనేక వాగ్దానాలు చేసి నేడు వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలమై య్యారన్నారు. ఆటో డ్రైవర్లకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు గతంలో సమ్మె నోటీసులు ఇస్తే ప్రస్తుత రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆటో డ్రైవర్ల సమ స్యలను నెరవేరుస్తామని చెప్పి నేటికీ రెండు నెలలు గడిచినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడం సిగ్గు చేటన్నారు. ఏఐటీయూసీ ఆటో డ్రైవర్ రాష్ట్ర యూని యన్ ఇచ్చిన పిలుపుమేరకు రానున్న రోజుల్లో కుత్బు ల్లాపూర్ నియోజకవర్గంలో కూడా అన్ని ఆటో కార్మిక సంఘాలను సంఘటితం చేసి పెద్ద ఎత్తున ఆందోళనను నిర్వహిస్తామని హెచ్చరించారు. కేంద్రంలో ఉన్నటువంటి బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండు బూర్జువా పార్టీలే కాబట్టి అవి రెండు కూడా వ్యాపారవర్గ దృష్టితోనే పరిపాలన సాగిస్తాయని అన్నారు. కార్మిక వర్గ దృక్పథంతో పనిచేయవని కార్మిక వర్గ దృష్టితోటి పనిచేసే ఏకైక పార్టీలు కమ్యూనిస్టు పార్టీ లేనని కాబట్టి కార్మిక వర్గ లోకమంతా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఉంటే కార్మికులే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలను పరిష్కరించుకోవచ్చని వ్యా ఖ్యానించారు. ఈ విషయాన్ని కార్మిక నాయకులందరూ ప్రజలకు తెలియజేసేలా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి వంగాల శ్రీని వాస్, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు వి.హరి నాథ్, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కుమార్, ఆటో యూనియన్ నాయకులు విజయ్, చందు, పూర్ణ, యాదన్న, నగేష్, సుమారు 40 మంది ఆటో యూనియన్ కార్మికులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ రేణుక ఎల్లమ్మ రజతోత్సవ వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఆధ్యాత్మికతతోనే ప్రశాంత జీవనం పొందుతారని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారంలోని శ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఆలయంలో ఆదివారం నిర్వహించిన రజతోత్సవంలో(జాతర)ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనాల మధ్య అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరి పై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ముత్యపాగ సహదేవ్, పెరిమాల రవి, ముత్యపాక నర్సింగ్ రావు, బైగన్ నర్సింగ్ రావు, తుపాకుల నర్సింగరావు, తుపాకుల సురేష్, పెరిమాల రాకేష్, చిత్తారమ్మ ఆలయ చైర్మెన్ అంతయ్య గౌడ్, కార్యదర్శి రాచకొండ బాలరాజ్, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జీఎస్ఆర్‌కు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

జీఎస్ఆర్‌కు, సప్పిడి భాస్కర్ ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు,(ఐటీయూసీ) ఇంటర్నేషనల్ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్.ఉమ్మడి ఆం ధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యులు, ఏఐసీసీ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ గొంగ ళ్ల సంజీవరెడ్డి జన్మదినం.. ఈ నెల ఫిబ్రవరి 18 ఛత్తీస్ గఢ్ రాష్ట్రంలో జరపుకుంటున్నారు. టీపీసీసీ లేబర్ సెల్ ఆధ్వర్యంలో.. హైదరాబాద్‌లో ఆయన నివాసానికి సప్పిడి భాస్కర్ వెళ్లి ముందుగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంబాగ్ ప్రకాష్ గౌడ్ (టీపీసీసీ లేబర్ సెల్ చైర్మెన్) గోంగళ్ల సత్యజీత్ రెడ్డి (ఐఎల్ఓ- ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజెషన్ మెంబర్)సప్పిడి భాస్కర్ (తెలంగాణ రాష్ట్ర లేబర్ సెల్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్, కాందాడి సుదర్శన్ రెడ్డి అధ్యక్షులు లేబర్ సెల్ మేడ్చల్ జిల్లా లేబర్ సెల్ నాయకులు, ఆయిల శ్రీధర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

నేడు ఆర్‌జికే 2,ఇందిరమ్మ కాలనీ ఫీడర్‌ల పరిధిలో ఉ 10.00గం ల నుంచి మధ్యాహ్నం 01.00 వరకు ఆర్‌జి కే బ్లాక్స్, తులసాయి కన్స్ట్రక్షన్స్, గ్రీన్ హిల్స్ కాలనీలలో అలాగే మధ్యాహ్నం 01.30గం నుంచి సాయంత్రం 04.30గం ల వరకు ఇందిరమ్మ కాలనీ, బహదూర్‌పల్లి ఏరియాలలో విద్యుత్ లైన్ నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని, ఈ అంత:రాయానికి ప్రజలు సహకరించాలని డిపిపల్లి విద్యుత్ శాఖ ఏఈ ఎస్.సురేందర్ రెడ్డి తెలిపారు.

శ్రీ లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్టాపన



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

129 - సూరారం డివిజన్ వైష్ణవి నగర్ నందు నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయ ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన యాగంలో స్వామి వారి అశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మనం చేపట్టే ప్రతి కార్యక్రమంలో విఘ్నాలను తొలగించి శుభాలను చేకూర్చే లక్ష్మీ గణపతి స్వామి వారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోపరేటీవ్ చైర్మెన్ మన్నె రాజు, మాజీ కౌన్సిలర్ జక్కుల కృష్ణ యాదవ్, వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మెన్ వేణు యాదవ్, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు వేమన్ రెడ్డి, యాదగిరి, అధ్యక్షులు వెంకట నరసయ్య ప్రధాన కార్యదర్శి నాగభూషణం, ఆలయ కమిటీ సభ్యులు రాము, అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సంఘం కార్యవర్గం నియామకం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అల్లాపూర్ డివిజన్ రాణ ప్రతాప్ నగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మాదవాచారి, ప్రధాన కార్యదర్శిగా సాంబయ్య, కోశాధికారిగా శ్యామ్ సుందర్ రెడ్డి, చైర్మెన్ రవిందర్ గౌడ్, లింగం, వైస్ ప్రెసిడెంట్ రాజయ్య చారి, బాబా, శంకర్, గఫూర్, జాయింట్ సెక్రటరీ ఆకుల అనిల్ కుమార్, జాహంగీర్ బాబా, నిజామ్, ఉమర్, కిష్టారెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో అల్లాపూర్ డివిజన్ అధునాతన వసతులతో కూడుకున్నటువంటి అభివృద్ధి చేసుకోగలిగిమన్నారు. రానా ప్రతాప్ నగర్‌లో నూతన బోర్ వాటర్ కొరకు మోటర్ బిగించామని, భూగర్భ డ్రయినేజీ, సీసీ రోడ్లు, ఇలా మౌలిక వసతులతో కూడుకున్నటువంటి అభివృద్ధి చేశామని ఈ సందర్భంగా కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ వీరారెడ్డి, జ్ఞానేశ్వర్, మల్లికార్జున్, రామ్ రెడ్డి, యోగి, పార్వతమ్మ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో టీజీఎంసీ బృందం తనిఖీలు

- నలుగురు నకిలీ వైద్యుల గుర్తింపు

నవాతెలంగాణ-తుర్కయంజాల్

హైదరాబాద్ నగరంలో నకిలీ వైద్యుల హల్‌చల్ కొనసాగుతోంది. పేద ప్రజల అవసరాలు, అమాయక త్వం, అవగాహన లోపం వాళ్లకి వరంగా మార్చుకొని వారి వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరు కాయలుగా నడుపుకుంటున్నారు. వివరాలలోకి వెళ్తే రంగారెడ్డి జిల్లా లోని తుర్కయాంజాల్ ప్రాంతంలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం డా వి. నరేష్‌కుమార్, డా కడాలి విష్ణు లు ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ఎన్ఎంసీ చట్ట విరుద్ధంగా ఎంబీబీఎస్ విద్యార్హత లేకుండా హలోపతి వైద్యం నిర్వహిస్తున్న నకిలీ వైద్యుల సెంట ర్లపై తనిఖీలు నిర్వహించింది.

తుర్కయంజాల్ కమ్మగూడా లోని రాజర్షి ఇన్ఫర్మిటీ నిర్వాహకుడు చంద్రశేఖర్ ఎంబీఏలో హాస్పిటల్ మేనే జ్‌మెంట్ చదివి డాక్టరు అవతారం ఎత్తి తన సెంటర్‌కు రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో 2023 సంవత్సరంలో డా కాత్యాయని, ఈఎన్‌టీ సర్జరీ పేరు మీద ఒక బ్రోకర్ ద్వారా అనుమతి తీసుకొని క్వా లిఫైడ్ డాక్టర్ ఎవరు లేకుండా తానే వారి వద్దకు వచ్చే పేషంట్లకు డాక్టరు వలె నమ్మించి ఇష్టానుసారం యాంటీ బయోటిక్స్, స్టెరాయిడ్ ఇంజెక్షన్స్, సెలైన్‌లు ఇవ్వడం తో పాటు ప్రెస్క్రిప్షన్ రాస్తున్నట్టు తనిఖీ అధికారులు గుర్తించారు. రాజర్షి ఇన్ఫర్మేరీ అనుమతికి సర్టిఫికెట్స్ ఇ చ్చిన డా కాత్యాయని వారానికి ఒకసారి వచ్చి వెళ్తారని చె ప్పిన నిర్వాహకుడు చంద్రశేఖర్‌ని డాక్టర్ ఫోన్ నెంబర్ అడుగగా తన వద్ద లేదని, తాను ఎవరో కూడ తెలియద ని చెప్పి తనకు బ్రోకర్ సర్టిఫికెట్స్ ఇచ్చి డీఎంఅండ్‌హె చ్‌ఓ ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ చేయించాడని మాట మార్చాడు. సదరు బ్రోకర్ పేరు కూడా గుర్తు లేదని, నెంబర్ కూడా దొరకట్లేదు అని నీళ నమిలడం విశేషం.

తమ వద్ద కౌన్సిల్ రిజిస్టర్‌లో ఉన్న నెంబర్ ఆధా రంగా డా.కాత్యాయనిని ఫోన్‌లో సంప్రదించిన తనిఖీ అధికారులు సదరు సెంటర్ కానీ, నిర్వాహకుడు ఎవరో తెలియదని డా కాత్యాయని తెలియ చేశారు. అదే ప్రాంతంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా చదివి ఎటువంటి డాక్టరు లేకుండా, ప్రభుత్వ అనుమతి లేకుండా ఆయన్ష్ డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వహిస్తున్న పి.మహేష్, ఎఏ న్ఎం చదివి కమ్మగూడ ప్రాంతంలో స్మార్ట్ క్యూర్ క్లినిక్ నిర్వహిస్తున్న చంద్రమ్మ / చంద్రకళ, బ్రాహ్మణపల్లి ఎక్స్ రోడ్‌లో 10వ తరగతి మాత్రమే చదివి వాసు మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్‌లో హలోపతి వైద్యం చేస్తున్న సిహె చ్ శ్రీనివాస్‌లపై ఎన్ఎంసీ 34, 54 ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్టు టీజీఎంసీ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మెన్ డా వి.నరేష్‌కుమార్ తెలిపారు. రాజర్షి ఇన్ఫర్మేరీకి దుర్వినియోగం గురించి సర్టిఫికెట్స్‌పై లఖిత పూర్వక స మాధానం ఇవ్వాలని డా.కాత్యాయనికి నోటీసు ఇవ్వను న్నట్టు టీజీఎంసీ సభ్యులు కడాలి విష్ణు తెలిపారు.

శ్రీ శ్రీ శ్రీ మల్లికార్జున స్వామి జాతర



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 129 డివిజన్ పరధిలోని మెట్టుకానిగూడలో శ్రీశ్రీశ్రీ మల్లికార్జున స్వామి ఆలయం కమిటీ సభ్యులు మల్లన్న జాతర నిర్వహించారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ:సంతోషాలతో ఉండాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు పాండు యాదవ్, బాల మల్లేష్, ఆంజనేయులు, శ్రీశైలం యాదవ్, 129 డివిజన్ మాజీ కార్పొరేటర్ పాల కృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ హైదరాబాద్ నగరంలో పలు వివాహాది శుభకార్యాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో చౌడ శ్రీనివాస్, నాగిళ్ళ శ్రీనివాస్, బండి శ్రీనివాస్, షాకీర్, సుజీత్ రెడ్డి, గుమస్తా మధు, రాజిరెడ్డి, పులి సందీప్, తౌఫిక్, చోటు, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో కొందుర్గు విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-కొందుర్గు

నారాయణపేటలో నిర్వహిం చిన 24వ నేషనల్ కరాటే, కుంగ్ ఫూ ఛాంపియన్ 2025 డ్రాగెన్ షాటోఖాన్ కరాటే టోర్నమెంట్‌లో కొందుర్గు మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటా రు. కంచరీ హైందవి స్పైరింగ్‌లో మొదటి బహుమతి సాధించింది. అదే విధంగా వైష్ణవి కటాస్ విభాగంలో మొదటి బహుమతి కైవసం చేసుకుంది. అద్విత్ కుమార్ రెండవ బహుమతి గెలుచుకోగా.. జోష్నా బహుమతి గెలుచుకున్నారు. స్పైరింగ్ విభాగంలో మణికంఠ మొదటి బహుమతి గెలుచుకోగా.. ప్రశాంత్ రెండవ బహుమతి కైవసం చేసుకున్నట్టు కరాటే మాస్టర్ వి. శంకర్ తెలిపారు. వీరిని ఆదివారం అభినందించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ శంకర్, కరాటే విద్యార్థులు, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

డీసీఎంను ఢీకొని వ్యక్తి మృతి



నవతెలంగాణ-తలకొండపల్లి

డీసీఎంను ద్విచక్రవాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మిడ్జిల్ మండల పరిధిలోని ఎముల గేటు దగ్గర ఆదివారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తలకొండపల్లి మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన సొప్పరి రాఘవేందర్ (26) తన ద్విచక్రవాహనంపైన మిడ్జిల్‌లో జరిగే పెండ్లికి వెళ్లారు. తిరిగి వారు ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో మిడ్జిల్ మండల పరిధిలోని ఎముల గేటు దగ్గర విన్కోకోల ఫారం సమీపంలో మిడ్జిల్ నుంచి వెంకటాపూర్ వైపు వస్తున్న డీసీఎంను రాఘవేందర్ ఢీకొట్టారు. దీంతో ఆయన తలకు తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతిచెందాడు.

నేడు ఎంపీ డీకే అరుణ నియోజకవర్గ పర్యటన

- బీజేపీ మండల అధ్యక్షురాలు రొల్లు రాధికగౌడ్

నవతెలంగాణ-కేశంపేట

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో నేడు ఉమ్మడి జిల్లా మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పర్యటించనున్నట్టు బీజేపీ మండల అధ్య క్షురాలు రొల్లు రాధికగౌడ్, ప్రధాన కార్యదర్శి తట్టే పల్లి నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలో అమృత్ 2.0 పథకం కింద సుమారు 28 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని వివరించారు. ఉదయం 10:30గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి కేశంపేట మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజ యవంతం చేయాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
సోమవారం | ఫిబ్రవరి 17, 2025 | www.navatelangana.com

ఉచితంగా పాస్టర్ ట్రైనింగ్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండలోని సాయిబాబా నగర్‌లో గత 15 సంవత్సరాలుగా, ఒలీవల ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ బైబిల్ కాలేజ్ నిర్వహిస్తూ, ఉచితంగా పాస్టర్లకు బైబిల్ కోర్సు ఇవ్వటం జరుగుతుందని ఫౌండర్ డైరెక్టర్ రెవరెండ్ పి.మోజెస్, డైరెక్టర్ దీవెన కుమారి తెలిపారు. ఈ బైబిల్ కాలేజీ జనవరి నుండి డిసెంబర్ వరకు ప్రతి సంవత్సరం కొత్త వారిని చేర్చుకొని, సాయంత్రం 6 గంటల నుండి 9 గంటల వరకు పాస్టర్లకు ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుంది. ఆసక్తి గలవారు బైబిల్ కోర్సులో చేరేవారు ఈ నంబర్లు 9573143491, 7675869437కు కాల్ చేసి అన్ని వివరాలు తెలుసుకోవాలని కోరుతున్నారు.

ఆరోగ్య భద్రత అందరి బాధ్యత..



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఖైరతాబాద్ పోలీసులకు శ్రీకర, మాక్స్ విజన్ కంటి ఆస్పత్రుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరోగ్య భద్రత కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ ఆరోగ్య భద్రత కార్యక్రమంలో భాగంగా వారు పోలీసులకు వైద్యుల సూచనల మేరకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారిని ఆస్పత్రికి వెళ్లాల్సిందిగా సూచిస్తూ అవసరం లేని వారికి తాత్కాలికంగా ఇవ్వాల్సిన మందులను అక్కడే ఇచ్చి వాటిని వైద్యుల సలహాలకు మేరకు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించుకుంటున్న దృశ్యం..

వృక్షార్చనలో భాగస్వాములుకండి





- మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ పిలుపు

నవతెలంగాణ-బంజారాహిల్స్

వృక్షార్చనలో భాగస్వాములు కండి కేసీఆర్ జన్మదిన కానుకగా ఇవ్వండని మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం బంజారాహిల్స్ జలగం వెంగళరావు పార్కులో వృక్షార్చన కార్యక్రమానికి 40 మంది మాజీ కార్పొరేషన్ల చైర్మెన్‌లతో ఆయన పాల్గొని పెద్ద ఎత్తున మొక్కలు నాటి కెసిఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధకులు కేసీఆర్ మానస పుత్రిక అయిన హరితహారంతో నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని ఆకుపచ్చ తెలంగాణగా మార్చడం జరిగిందని, పదేండ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని కానీ పదేండ్లలో జరిగిన అభివృద్ధి గడిచిన సంవత్సర కాలంలో చాలా నష్టానికి గురవుతుందని తెలంగాణ రాష్ట్రానికి మళ్ళీ కెసిఆర్ ముఖ్యమంత్రి ఐతేనే శ్రీరామరక్ష అని, వారు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా భగవంతుని కోరుకుంటున్నట్లు తెలిపారు. రైతు బంధువు, హరిత ప్రేమికుడి కోసం వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ మాజీ కార్పొరేషన్ చైర్మెన్లు ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటడం చాలా సంతోషకరమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు మేడే రాజీవ్ సాగర్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, దేవి ప్రసాద్, ముజీవుద్దిన్, గూడూర్ ప్రవీణ్, ఎర్రోళ్ల శ్రీనివాస్ వాసు, గెల్లు శ్రీనివాస్, జూలూరి గౌరీ శంకర్, మెట్టు శ్రీనివాస్, సుమిత్ర ఆనంద్, రజినిసాయిచంద్, మంత్రి శ్రీదేవి, మన్నె కవిత, చిరుమళ్ల రాకేష్, ఆంజనేయులు గౌడ్, గజ్జెల నగేష్, వాసుదేవ రెడ్డి, వై.సతీష్‌రెడ్డి, పాటిమీది జగన్, ఇంతియాజ్, వల్యా నాయక్, దామోదర్ గుప్తా, కిశోర్ గౌడ్, ఉపేంద్ర, పల్లె రవి, అక్బర్, నాగేందర్ గౌడ్, మఠం బిక్షపతి, వెంకటేశ్వర్ రెడ్డి, సర్వోత్తమ్, మన్నె గోవర్ధన్, తుంగబాలు, గోసుల శ్రీనివాస్, మెట్టు శ్రీనివాస్, శ్రీధర్, రాఘవేంద్ర యాదవ్, పూర్ణ చందర్, సతీష్, ఎన్ఎన్ రాజు, అమృత్ చౌహాన్, స్థానిక కార్పొరేటర్ మన్నే కవిత రెడ్డి తదితరులున్నారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం..

- గోదావరి ఫేజ్-1 దయా పంపింగ్‌కు వాల్వుల అమరిక
- రేపు ఉదయం 6గంటల వరకు కొనసాగనున్న పనులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మహానగరానికి తాగునీరు సరఫరా చేసే గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్-1లోని కొండపాక పంపింగ్ స్టేషన్ వద్దగల 3000 ఎంఎం దయా ఎంఎస్ పంపింగ్ మెయిన్‌కు.. 900 ఎంఎం దయా వాల్వులు (బీఎఫ్అండ్ ఎస్ఆర్వీ) అమర్చనున్నందున సోమవారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు వాటర్‌బోర్డు అధికారులు తెలిపారు. ఈ రోజు ఉదయం 6 గంటల నుంచి రేపు(మంగళవారం) ఉదయం 6 గంటల వరకు ఈ పనులు కొనసాగుతాయని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావునా జలమండలి పరిధిలో పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందనీ, కావునా అంతరాయం ఏర్పడే ప్రాంతాల ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

అంతరాయం కలిగే ప్రాంతాలు ఇవే..

1. ఓఅండ్ఎం డివిజన్-6 : ఎస్ఆర్‌నగర్, సనత్ నగర్, బోరబండ, ఎస్పీఆర్ హిల్స్, ఎర్రగడ్డ, బంజారాహిల్స్, వెంగళ్ రావు నగర్, ఎల్లారెడ్డిగూడ, సోమాజిగూడ, ఫతేనగర్.
2. ఓఅండ్ఎం డివిజన్-9 : కూకట్ పల్లి, భాగ్యనగర్, వివేకానంద నగర్, ఎల్లమ్మబండ, మూసాపేట్, భరత్ నగర్, మోతీనగర్, గాయత్రి నగర్, బాబా నగర్, కేపీహెచ్‌బీ, బాలాజీ నగర్, హస్మత్ పేట్.
3. ఓఅండ్ఎం డివిజన్-12 : చింతల్, సుచిత్ర, జీడిమెట్ల, షాపూర్ నగర్, గాజుల రామారం, సూరారం, ఆదర్శ్ నగర్, భగత్ సింగ్ నగర్, జగద్గిరిగుట్ట, ఉషోదయ.
4. ఓఅండ్ఎం డివిజన్-13 : అల్వాల్, ఫాదర్ బాలయ్య నగర్, వెంకటాపురం, మచ్చబొల్లారం. డిఫెన్స్ కాలనీ, వాజ్‌పేయ్ నగర్, యాప్రాల్, చాణిక్యపురి, గౌతమ్ నగర్, సాయినాథపురం.
5. ఓఅండ్ఎండివిజన్-14 : చెర్లపల్లి, సాయిబాబా నగర్, రాధికా.
6. ఓఅండ్ఎం డివిజన్-15 : కొండాపూర్, డోయెన్స్, మాదాపూర్ (కొన్ని ప్రాంతాలు).
7. ఓఅండ్ఎం డివిజన్-17 : హాఫీజ్ పేట్, మియాపూర్.
8. ఓఅండ్ఎం డివిజన్-21 : కొంపల్లి, గుండ్ల పోచంపల్లి, తూంకుంట, జవహర్ నగర్, దమ్మాయిగూడ, నాగారం.
9. ఓఅండ్ఎం డివిజన్-22 : నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతి నగర్, గండి మైసమ్మ, తెల్లాపూర్, బొల్లారం.
10. ట్రాన్స్‌మిషన్ డివిజన్-4 : ఎంఈఎస్, త్రిశూల్ లైన్స్, గన్ రాక్, హకీంపేట్ ఎయిర్ ఫోర్స్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, బీబీనగర్ ఎయిమ్స్.
11. ఆర్‌డబ్ల్యూఎస్ ఆఫ్ టేక్స్ ప్రాంతాలు : ప్రజ్ఞాపూర్ (గజ్వేల్), ఆలేర్ (భువనగిరి), ఘన్‌పూర్ (మేడ్చల్/శామీర్ పేట్).

ఈతకు వెళ్లి చెరువులో గల్లంతైన ఇద్దరు యువకులు

- ఆచూకీ కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు



నవతెలంగాణ-శామీర్‌పేట

అమ్మవారిని దర్శించుకుని ఈతకు వెళ్లి చెరువులో ముగ్గురు గల్లంతైన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పొన్నాల గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం నగరంలోని జగద్గిరిగుట్టకు చెందిన ఆరుగురు యువకులు (మిత్రులు) బాలు, సందీప్ సాగర్, రాంపల్లి సందీప్ , సాయి చందర్, ఒగ్గు బాలకృష్ణ, నాగారంకు చెందిన కర్ర నితీశ్ కుమార్, శామీర్‌పేట మండలంలోని పొన్నాల గ్రామ పరిధిలోని చిత్తారమ్మ దర్శనానికి ఉదయం అందాజ 11కి వచ్చారు. చిత్తారమ్మ అమ్మవారిని దర్శించుకొని కోడిని కోసి, గుడి వెనకాల ఉన్న చెరువు దగ్గర వంట వండుకొని వాళ్ళ వెంట తెచ్చుకున్న (కొందరు మద్యం, కొందరు కల్లు) సేవించారు. అందాజ సాయంత్రం 5 గంటలకి ముగ్గురు వ్యక్తులు పాలసంతుల బాలు, అలలికంటి సందీప్ సాగర్, ఒగ్గు బాలకృష్ణ చెరువులోకి ఈతకు వెళ్లారు. ఒగ్గు బాలకృష్ణ తిరిగి రాగా పాల సంతుల బాలు(25), అలలికంటి సందీప్ సాగర్(27) చెరువులో గల్లంతయ్యారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం ఫైర్ సిబ్బంది, గజ ఈత గాళ్ల సహాయంతో ఆచూకీ కోసం వెతుకుతున్నామని పోలీసులు తెలిపారు.

వడ్డే ఓబన్న జీవిత చరిత్ర అందరూ తెలుసుకోవాలి

- కంటెస్టెడ్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

వడ్డే ఓబన్న చేసిన త్యాగాలు, ఆయన జీవిత చరిత్ర ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జూబ్లీహిల్స్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం, ఎస్పీఆర్ హిల్‌లోని ఉన్న వడ్డే ఓవన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సమీపంలోని కృష్ణుడి దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ మాట్లాడుతూ వడ్డే ఓబన్న బ్రిటిష్ వారితో పోరాడి ఎన్నో త్యాగాలు చేశారని , ఆయన త్యాగాలు ఎప్పటికీ మరువలేమన్నారు. అనంతరం వడ్డెర ఐక్యవేదిక అధ్యక్షుడు వేముల యాదయ్య మాట్లాడుతూ 1983లో ఎస్పీఆర్ హిల్‌లోని 9 ఎకరాల 30 గుంటల స్థలం వడ్డెర కులానికి అప్పటి సీఎం ఎన్టీ రామారావు, ఎమ్మెల్యే పి.జనార్ధన్ రెడ్డి కేటాయించారని, ఆ స్థలం వడ్డెరలకు మాత్రమే ఇవ్వాలని ఎలాంటి పోరాటం అయినా చేయుటకు సిద్ధంగా ఉన్నావని, మా పోరాటానికి నవీన్ యాదవ్ అండగా ఉండాలని, ఆయన సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డెర ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు నరసింహ, పాండు వడ్డెర కుల నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి 'వంద'నం

- ఒకేసారి 100 మిల్లెట్ స్టోర్ల ప్రారంభం..



నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రస్తుత జీవనశైలికి అనుగుణమైన ఆహారం మిల్లెట్స్ అని టాలీవుడ్ వర్ధమాన తారలు వేద్విక, వాన్యా అగర్వాల్‌లు అన్నారు. ఈ చిరుధాన్యాలు ఆరోగ్య ప్రదాయిని అని అన్నారు. స్వల్ప పెట్టుబడితో 100 మంది మహిళా ఔత్సాహిక, దిగువ తరగతి ఆదాయ వర్గాల కోసం ఏర్పాటు చేసిన 100 మిల్లెట్ స్టోర్లను ఏకకాలంలో మాదాపూర్‌లోని మినర్వా హెూటల్స్‌లో తెలుగు రాష్ట్రాల ప్రఖ్యాత బిజినెస్ మెంటర్, డిజిటల్ మార్కెటింగ్ ట్రైనర్ శ్రీనివాస్ సరకదంతో వేద్విక, వాన్యా అగర్వాల్‌లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వేద్విక, వాన్యా అగర్వాల్‌లు మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అదే విధంగా చిరు ధాన్యాలవైపు చిరువ్యాపారులను ప్రోత్సహించడానికి ఓ బృహత్తర కార్యక్రమన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ సరకదం మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ గత 2023ను అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరం ప్రకటన స్ఫూర్తి తాము నెలకొల్పిన మిల్లెట్స్ నేషనల్ పోర్టల్ (మిల్లెట్స్ డాట్ న్యూస్) ద్వారా ఆరోగ్యకరమైన ఆహారోత్పత్తులను ప్రజలకు చేరువ చేసే క్రమంలో తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా రైతులతో కలిసి పనిచేస్తున్నామని అలాగే స్వల్ప పెట్టుబడుల తోనే మిల్లెట్ స్టోర్లను ఏర్పాటు చేసేందుకు వీలుగా ఔత్సాహిక వ్యాపారులకు అండదండలు అందిస్తున్నామని వివరించారు. తెలుగు రాష్ట్రాల్లో రానున్న రోజుల్లో 1,280 మండలాల్లో ఈ మిల్లెట్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని తెలియజేస్తూ పోస్టర్‌ను ఆవిష్కరించి వివరించారు. హెల్త్ అండ్ న్యూట్రిషన్ అంబాసిడర్స్ ద్వారా ప్రజల ఆరోగ్య సందేహాలను నివృత్తి చేసేందుకు గాను ప్రస్తుతం 50 మంది వైద్యులను కలిగి ఉన్నామని, రాబోవు సంవత్సర కాలానికి ఆ సంఖ్యను 1000కి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

పేద మధ్యతరగతి వర్గాలకు అండగా ఉంటాం



- వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ

నవతెలంగాణ-కంటోన్మెంట్

పేద మధ్యతరగతి వర్గాలకు అండగా దళిత చైతన్య సంఘం ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుందని దళిత చైతన్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ అన్నారు. దళిత చైతన్య సంఘం ఏర్పడి 8 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద పేద మహిళలకు ఉచితంగా ముప్పిడి నవీన్ కుమార్ మాదిగ...తన తల్లి శాంతాబాయి చేతుల మీదుగా చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముప్పిడి నవీన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న దళితులను ఏకం చేస్తూనే ఇతర కులాల పేద మధ్య తరగతి వర్గాలకు అండగా ఉంటామన్నారు.అంతకు ముందు బల్కంపేట ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడితోపాటు అభిషేక్, సందీప్,రత్నమ్మ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

- డీప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్



నవతెలంగాణ-కంటోన్మెంట్

పబ్లిక్ స్కూల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరు తూ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కుని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు అనేక సమస్యలు ఉన్నాయని వివరించారు. 2025-26కు గానూ 1వ తరగతి ప్రవేశాలకు ప్రతి సంవత్సరం డిసెంబర్ నెలలో అడ్మిషన్ నోటిఫికేషన్ రావాల్సి ఉండగా ఫిబ్రవరి మాసం సగం పూర్తి అవుతున్న ఇప్పటికీ వరకు నోటిఫికేషన్ రాకపోవడం, అలాగే గత ప్రభుత్వం విద్యార్థుల స్కాలర్ షిప్‌ను కూడా పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. వెంటనే స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలని కోరారు.

నిమ్స్ యాజమాన్యం నిర్లక్ష్యానికి నీటి వృధా

- వాటర్ బోర్డుకు సమాచారం లేకుండానే పైపులైన్ తవ్వకాల వల్ల రహదారిపాలైన మంచినీరు





నవతెలంగాణ-బంజారాహిల్స్


మంచి, మురుగు నీటి పైపులైన్ తవ్వకాల వల్ల రహదారి పాలైన మంచినీరు.., వారాల తరబడి సరఫరాకు నోచుకొని వైనం వాటర్ బోర్డుకు సమాచారం ఇచ్చి ఉంటే పనులు కొంచెం సులభతరంగా ఉండేవని ఆస్పత్రిలో పనిచేసే సీనియర్లు, రోగులు అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఒకవైపు నూతన ఆస్పత్రి పనుల తో భారీగా తవ్వకాలు పాత భవనాలు కూల్చివేతలు చకచక జరు గుతున్నాయి. వాటి కోసం ఏర్పాటు చేసిన నీటి సరఫరా ఆగ లేదు.. ఇలా నీటి వృధా పెరుగుతున్న నేపథ్యంలో యాజమాన్యం వాటర్ బోర్డు అధికారుల సహకారంతో పాత భవనాల నీటి సరఫరా ముందుగా ఆపేసి ప్రస్తుతం కొనసాగుతున్న ఆ స్పత్రికి మాత్రమే నీటిని వినియోగిస్తే వేసవి కాలంలో గట్టెక్కేందుకు మార్గం సుగమం అవుతుందని పలువురు ఆరోపణలు చేయడం గమన్హారం. వారి అభిప్రాయాలను పరిగణంలో తీసుకొని ముం దుకు వెళ్తారో ఇలాగా వృధా చేస్తూ అంత మా ఇష్టం అంటూ సొంత అజెండాతో కొనసాగుతారో వేచి చూడాల్సిందే..

భవాని శంకర్ పుట్టినరోజు వేడుకలు..



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ, రహమత్ నగర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ భవాని శంకర్ పుట్టినరోజు వేడుకలను ఆదివారం కృష్ణా నగర్ లోని సాయి సరస్వతి హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. రెండుసార్లు తన తల్లి బండపల్లి చంద్రమను అత్యధిక మెజార్టీతో రహమత్ నగర్ కార్పొరేటర్‌గా గెలిపించిన ఘనత భవాని శంకర్‌కు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్యార నాగరాజు రహమత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ, జాఫర్ హుస్సేన్ రహమత్ నగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు, అరుణ్ గౌడ్, రవీందర్ రెడ్డి, సాయి సూరజ్, రాంబాబు, మేఘన పద్మ సువర్ణ, సుందర్ రాజ్, విజయ్ శివ, మలాకి, బాబాయ్, డివిజన్ కార్యకర్తలు అనేకమంది పాల్గొని శాలువాలతో సత్కరించి కేక్ కటింగ్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



నవతెలంగాణ-బేగంపేట

సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏఐఎంసీ సభ్యురాలు డా. కోటా నీలిమ అమీర్‌పేట్ డివిజన్ మైనారిటీ నేత అర్షత్ తల్లి అకాల మరణంపై తీవ్ర సంతాపం తెలిపారు. ఆది వారం ఆమె బీకే గూడలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఉచిత విద్యుత్ బిల్లులను వెంటనే చెల్లించాలి



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ప్రభుత్వం ఇచ్చినటు వంటి ఉచిత విద్యుత్ బిల్లును వెంటనే చెల్లించాలని జూబ్లీహిల్స్ జోన్ సంఘం కార్యదర్శి కేశరాజు యాదగిరి అన్నారు. ఆదివారం అమీర్‌పేటలో రజకుల సమస్యలుపై అధ్యయనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ జోన్ కార్యదర్శి కేశరాజు యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షులు పరిమి భాస్కర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చినటు వంటి ఉచిత విద్యుత్ బిల్లును వెంటనే చెల్లించాలని, లేనియెడల జూబ్లీహిల్స్ జోన్‌లో పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శులు మరియాల గోపాల్ పాల్గొని మాట్లాడుతూ రజకులు అత్యాధునిక టెక్నాలజీతో ఇస్త్రీ షాపు నడపాలని, ఇస్త్రీ చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రజకులు ఈ సంవత్సరం 2025 సంఘం సభ్యత్వం నమోదు చేయించుకోవాలని , అందరూ ఐక్యంగా ఉండాలన్నారు. చేనేత, గీత సోదరులకు ఇస్తున్నట్లు పెన్షన్ 50 సంవత్సరాలు నిండిన ప్రతి రజకుడికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇస్త్రీ షాపులకు ఉచిత కరెంటు మీటర్లు సప్లై చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ ప్రజాసంఘాల కార్యదర్శి రాపర్తి అశోక్ , కేశరాజు గోపి, కేశరాజు ఉపేందర్, కె.ధనుంజయ,కె శ్రీను, ఎన్. వెంకటస్వామి, పి.రాజు, కె.రేణు, కె.రామా, కే.శ్రీలత, కే.రజిత, భారతి, కోమల,రాధిక తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పాటుపడిన 'గొర్రెపాటి మాధవరావు'

- విశ్రాంత జడ్జి జస్టిస్ సుదర్శన్



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రజా సంక్షేమానికి పాటుపడిన గొప్ప మానవ హక్కుల న్యాయవాది గొర్రెపాటి మాధవరావు అని విశ్రాంత జడ్జి జస్టిస్ సుదర్శన్ అన్నారు. చట్టాలపై అవగాహన కల్పిస్తూ న్యాయం కోసం వచ్చిన పేదల పక్షాన పోరాడి ప్రజా హక్కుల నేతగా అందరి హృదయాల్లో నిలిచిపోయారని కొనియాడారు. మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుం దరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన న్యాయవాది గొర్రెపాటి మాధవరావు సంస్మరణ, పుస్తకావిష్కరణలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విలువలకు కట్టుబడి ప్రజల సమస్యల పరిష్కారాల్లో ముందుండేవారని కొనియాడారు. మానవ హక్కుల వేదిక మాజీ అధ్యక్షుడు జీవన్‌కుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగం, న్యాయం, చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పిస్తూ ఎన్నో వ్యాసాలు రాశారని తెలిపారు. న్యాయవాదిగా ప్రజల్లో హక్కుల పట్ల చైతన్యం నింపడం, హక్కుల ఉల్లంఘన కేసులలో జూనియర్ న్యాయవాదులకు మార్గదర్శకత్వం ఇవ్వడంలో ఆయన విశేష కృషి చేశారని తెలిపారు. ఆయనను స్మరించుకుంటూ 'ప్రజా హక్కుల న్యాయవాది గొర్రెపాటి మాధవరావు' పేరుతో పుస్తకాన్ని రూపొందించినట్లు వివరించారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు భుజంగరావు, ప్రజా సంఘాల నేతలు, న్యాయవాదులు కృష్ణారావు, రవి, కె.గోవర్ధన్, చంద్రశేఖర్, రామకృష్ణ, మీరా సహాని, స్మైలీ, బాబూరావు, శంకర్, మార్వాడి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-ముషీరాబాద్

బీఆర్ఎస్ నగర నాయకుడు రవీంద్ర కోక జన్మదినం సందర్భంగా గడ్డం ప్రవీణ్, బూతమోల్ ఆంజనేయులు, కొమ్ము రాజేష్ ఆధ్వర్యంలో ఆదివారం ముషీరాబాద్ రెయిన్‌బో ఫౌండేషన్‌లో అనాథ పిల్లలకు పండ్లు వంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రకాంత్, నందురెడ్డి, గజేల్ వినయ్, మోసెస్, మహ్మద్ ఇస్మాయిల్, మహ్మద్ ఘోసే తదితరులున్నారు.

18న ఇందిరా పార్కు వద్ద గ్రామీణ వైద్యుల ఆత్మగౌరవ సభ

నవతెలంగాణ-బంజారా హిల్స్

హలో ఆర్ఎంపీ చలో హైదరాబాద్ అనే నినాదంతో తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో 18న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర తెలంగాణ అనుభవ వైద్యుల సంఘాల సమైక్య అధ్యక్షులు చొప్పరి శంకర్ ముదిరాజ్, రాష్ట్ర పట్టణ గ్రామీణ వైద్యుల ఐక్యవేదిక అధ్యక్షులు కొల్లేటి బాల బ్రహ్మణ చారి, టీఆర్‌పిఎస్ ఆర్ఎంపీ, పీఎంపీ వైద్య సంఘాల అధ్యక్షులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ప్రజాపాలన ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాలని గుర్తు చేస్తూ నెరవేర్చని పక్షంలోనే ఈ నిర్ణయం తీసుకుని నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ప్రకటన విడుదల చేశారు.

సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్‌కు సన్మానం



నవతెలంగాణ-ముషీరాబాద్

సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షునిగా నియమితులైన గుండగోని భరత్ గౌడ్‌కు సన్మానం నిర్వహించారు. ముషీరాబాద్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు గుండగోని భరత్ గౌడ్‌కు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీలోని పార్టీకి పని చేసిన వారికి ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా బీజేపీ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా బిజెపి మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రేవంత్ రెడ్డి, హిట్లర్, స్టాలిన్ అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేట ర్లు పావని వినయ్ కుమార్, రచన శ్రీ, సుప్రియ నవీన్ గౌడ్, రవి చారి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మీ, బీజేపీ మహంకాళి జిల్లా మాజీ అధ్యక్షుడు శ్యామ్ సుందర్, బీజేపీనాయకులు సదానంద్ ముదిరాజ్, ఆర్.విశ్వం, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్, బీజేపీ మహంకాళీ జిల్లా గిరిజన మోర్చ అధ్యక్షుడు బాలకృష్ణ, తదితరులున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
సోమవారం | ఫిబ్రవరి 17, 2025 | www.navatelangana.com

నేడు సప్త కళాకారులకు సత్కారంధ

నవతెలంగాణ-కల్చరర్

జాతీయ సంగీత కళాకారుల సంఘం నిర్వహణలో త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై సోమవారం సాయంత్రం ప్రముఖ సంగీత రంగ కళాకారులతో పాటు నాట్య గురువు కు సప్త కళాకారుల పేరిట సత్కారం నిర్వహిస్తున్నామని సంఘం అధ్యక్షుడు చెన్నా రావు తెలిపేరు త్యాగరాయ గానసభ లోని సమావేశ మందిరం లో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను తెలిపారు ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె వి రమణ జన్మ దిన సందర్భంలో రాఘవాచారి,హరి ప్రియ, డి వి మోహన కృష్ణ,ద్వారం సత్యనారాయణ ధూళిపాళ్ల శ్రీ రామ మూర్తి,జానకీ రాములు తో పాటు నాట్య గురువు డాక్టర్ అలేఖ్య పుంజల ను వివిధ బిరుదులతో సత్కరిస్తామని తెలిపారు ఇటీవల పద్మశ్రీ అవార్డు ప్రకటించబడిన సహస్రావధాని డాక్టర్ నాగ ఫణి శర్మ ను అభినందన పూర్వక సత్కారం చేస్తామని డాక్టర్ కె వి రమణ పాల్గొంటారు అని చెప్పారు ఈ సందర్భం గా ప్రముఖ గాయకుడు వినోద్ బాబు బృందం సినీ గీతాలు తో పాటు నాద స్వర విన్యాసం ఉంటాయి.



హనుమాన్ నగర్ లో కంటి మరియు అన్ని రకములు గల హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగినది నాగోల్
-నవతెలంగాణ, సిటీడెస్క్

గణిత శాస్త్రంతో మేధో మథనం



-రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ

నవతెలంగాణ-కల్చరర్

మేధో మథనం గణిత శాస్త్రం తో సాధ్యమని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. స్మార్ట్ జీనియస్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి లో నిర్వహించిన అబాకస్ గ్లోబల్ లెవెల్ కాంపిటీషన్స్ లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం రవీంద్రభారతి ప్రధాన వేదిక పై జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పాల్గొని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మ్యాథమెటిక్స్ తో మెదడు చురుకుగా పని చేస్తుందని అన్నారు. విద్యార్థులు మారుతున్న టెక్నాలజీ అందిపుచ్చుకొని అందుకు అనుగుణంగా రాణించాలని సూచించారు. విద్యార్థులు విద్య తో పాటు భిన్న రంగాలలో ప్రవేశం కలిగినప్పుడే సంపూర్ణ విద్యావంతులు కాగలరని అయన చెప్పారు. స్మార్ట్ జీనియస్ సంస్థ విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీసి వారిని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ బాలకృష్ణ రెడ్డి మాట్లాడుతూ.. నేటి సమాజంలో విద్య ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రపంచీకరణ నేపథ్యంలో సాంకేతిక విజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులకు విద్యను అందించే విధంగా ఉపాధ్యాయులు ప్రణాళికలను రూపొందించు కోవాలనీ సూచించారు. టెక్నాలజీ పరంగా ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ విద్యకు టెక్నాలజీ అవసరమన్నారు. వికసిత్ భారత్ లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగు కాగలవు అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివినప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని చెప్పారు. స్మార్ట్ జీనియస్ చైర్మన్ రాజ్యలక్ష్మి రాజ్ మోహన్ మాట్లాడుతూ.. స్మార్ట్ జీనియస్ గుర్తింపు పొందిన సంస్థ అని తెలిపారు. అబాకస్ వల్ల విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచడమే కాకుండా మ్యాథమెటిక్స్ కు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. స్మార్ట్ జీనియస్ నిర్వహించిన అబాకస్, వేదిక్, మ్యాథమెటిక్స్, హ్యాండ్ రైటింగ్ పోటీలలో వివిధ రాష్ట్రాల నుండి దాదాపు 1500 మంది విద్యార్థులు పాల్గొని 230 మంది విద్యార్థులు ఛాంపియన్స్ గా నిలిచారని వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర స్కూల్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరసింహారెడ్డి, అడిషన్ కలెక్టర్ కాత్రివరన్ , జాయింట్ డైరెక్టర్ వెంకట నరసమ్మ పాల్గొన్నారు.



శంకరనారాయణీయం చమత్కార హాస్య రమణీయం



నవతెలంగాణ-కల్చరర్

పరస్పర ఆత్మీయత అభిమానం జీవిత కాలాన్ని పెంచుతాయి అని ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె వి రమణ అన్నారు ప్రతి వ్యక్తీ తనకు తోచిన రీతిలో పరులకి సహాయ పడితే వారి మనసే ఆనంద నిలయం అని ఆయన చెప్పారు శ్రీ త్యాగరాయ గానసభ లోని లలిత కళా వేదిక పై కమలాకర చారిటబుల్ ట్రస్ట్ కమలాకర లలిత కళా భారతి నిర్వహణ లో డాక్టర్ కె వి రమణ జన్మ దిన సందర్భంలో జరుగుతున్న అభినందన పరంపర లో భాగంగా ప్రఖ్యాత హాస్యావధాని శంకర నారాయణ చే రమణీయ హాస్యావధానం ఆద్యంతం చమత్కార హాస్య భరితం గా సాగింది ప్రేక్షకులే ప్రుచ్ఛకులు గా వారు అడిగిన ప్రశ్నలకు చమత్కార యుతం గా సమాధానాలు ఇచ్చారు ఈ సందర్భం గా జరిగిన సభా కార్యక్రమంలో సాహిత్య వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలు ఉమ్మడి సాహితీ ఆస్తి రమణాచారి అన్నారు మానవ సేవే మాధవ సేవ అని నమ్మిన వారు కొనియాడారు ప్రముఖ రచయిత్రి డాక్టర్ కె వి కృష్ణ కుమారి మాట్లాడుతూ రమణాచారి హృదయం మాతృ హృదయం అన్నారు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య గౌరీ శంకర్ మాట్లాడుతూ సాహిత్య అభినివేశం వున్న మహనీయ మూర్తి రమణాచారి అన్నారు వేదిక పై ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఆచార్య కసిరెడి వెంకట రెడ్డి కవి వి ఆంజనేయ రాజు తదితరులు పాల్గొన్న వేదిక పై భారతీ కమలాకర్ స్వాగతం పలికారు

కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

● పీఏసీ చైర్మెన్, ఎమ్మెల్యే గాంధీ

నవతెలంగాణ-శేరిలింగంపల్లి

కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తామని పీఏసీ చైర్మెన్, ఎమ్మెల్యే గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని శిల్ప వ్యాలీ కాలనీ వాసులు పలు సమస్యలు, చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై ఎమ్మె ల్యేను వివేకానందనగర్‌లోని అయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శిల్పవ్యాలీ కాలనీ వాసులు మాట్లాడుతూ తమ కాలనీలో మౌలిక వసతులు కలిపించినం దుకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా శిల్ప వ్యాలీ కాలనీలో అంపూర్తిగా మిగిలిపోయిన సీసీరోడ్లను వేయాలని, వరద నీటి కాల్వ, యూజీడీ పనులు చేపట్టాలని, తాగునీటి వ్యవస్థ ను మెరుగుపర్చలని, వీధి దీపాల వ్యవస్థను ఏర్పాటు చేయాలని వినతి పత్రం ద్వారా కోరారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ త్వరలోనే కాలనీలో పర్యటిస్తాన ని, శిల్ప వ్యాలీ కాలనీలో నెలకొన్న అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. కాలనీలో అన్ని రకా ల మౌలిక వసతులు కలిపించామని తెలిపారు. అసంపూర్తిగా మిగిలి పోయిన రోడ్లను, యూజీడీ, వరద నీటి కాల్వ నిర్మాణం పనులు అతి త్వరలో చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అసం పూర్తిగా మిగిలిపోయిన రోడ్ల పనులు వెంటనే చేపట్టి ప్రజలకు ఉపశ మనం కలిగేలా చూడాలని అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా మెరుగైన నీటి సరఫరా చేయాలని, అవసరమున్న చోట నీటి సరఫరా సమయం పెంచాలని సూచించారు. తక్కువ ప్రెజర్‌తో వచ్చే చోట తగు చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిల్ప వ్యాలీ కాలనీ వాసులు ధీరజ్, గౌతమ్, విద్య సాగర్, గోవర్ధన్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, దిలీప్, బాబు రావు, మణికంఠ, ఆనంద్, మోహన్, వినయ్, ప్రణీత్, మనోహర్, ప్రవీణ్, సంపత్, శోభన, బాల విష్ణు, భరత్, సాయి వినయ్, నవీన్, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

నాట్యం ఏకాగ్రత, క్రమశిక్షణ నేర్పుతుంది

నవతెలంగాణ-కల్చరర్

నాట్యం వల్ల ఏకాగ్రత క్రమ శిక్షణ కలుగుతాయని బాలల సాహిత్య రచయిత చొక్కాపు రమణ అన్నారు శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సంగీత నాట్య వేదిక పై నృసింహ కూచిపూడి నాట్య భారతి నిర్వహణలో సుప్రజ నాయని శిష్య బృందం కూచిపూడి నాట్య అంశాలు నర్తించారు వాగ్గేయ కారులు అన్నమయ్య దీక్షితార్ తదితరులు కీర్తనలు నృత్య రూపం లో చూడ ముచ్చట గా ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రమణ మాట్లాడుతూ గురువు ప్రతిభ శిష్యుల ప్రదర్శన వల్ల తెలుస్తుంది అని సుప్రజ శ్రీనివాస్ లు ఉత్తమ నాట్య గురువులు అని అభినందించారు సంఖ్యా శాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ వ్యాఖ్యాత గాంధీ పాల్గొన్న కార్యక్రమానికి సంస్థ స్థాపకుడుశ్రీనివాస్ కుమార్ స్వాగతం పలికారు.



మానవ పురోభివృద్ధికి విద్య ఆరోగ్యం అవసరం



నవతెలంగాణ-కల్చరర్

మానవ పురోభివృద్ధి కి విద్య ఆరోగ్యం అవసరం అని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి విద్యావైద్య రంగాల పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. స్కిల్ ఇండియా యూనివర్సిటీ స్పోర్ట్స్ యూనివర్సిటీ రాష్ట్రం లో ఏర్పాటు చేయబోతున్నామని, దీనిలో విద్యార్థులు వారి వారి ఆసక్తి మేర ప్రవేశించే అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. తెలుగు లలిత కళా తోరణం ప్రాంగణంలో సుచిర్ ఇండియా ఫౌండేషన్ నిర్వహణలో సర్‌సీవీ రామన్ యంగ్ ఇండియా జీనియస్ అవార్డ్స్ ప్రదానోత్సవం పలు సాంస్కృతిక ప్రదర్శనల వేడుకల మధ్య జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ గత మూడు దశాబ్దాల పైగా విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి గొప్ప శాస్త్రవేత్త రామన్ పేరిట అవార్డ్స్ ఇవ్వటం అపురూపం అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో టాలెంట్ సెర్చ్ చేసి సూచిర్ ఇండియా యజ్ఞ తుల్య కార్యక్రమం నిర్వహిస్తోందని ప్రశంసించారు. నటుడు రావు రమేష్ మాట్లాడుతూ.. జీనియస్ అవార్డ్స్ అందుకున్న వారు రామన్ స్ఫూర్తి తో ఉన్నత స్థానానికి చేరుకోవాలి అని ఆకాంక్షించారు. ఫౌండేషన్ స్థాపకుడు కిరణ్ మాట్లాడుతూ ప్రతిభ ఉన్న విద్యార్థులను వారిని ఉన్నతంగా తీర్చిదిద్దే గురువులను సత్కరించుకోవడం 32 ఏండ్లుగా చేస్తున్నామని విద్యా సంస్థలకు అవసరమైన పరికరాలు అందజేస్తున్నామని వివరించారు. అనంతరం జీనియస్ అవార్డ్స్ గురుదేవో భవ అవార్డ్స్ తుమ్మల అందజేశారు.

సర్వజన సాహితీ సామాజిక సేవా సంస్థ ఆరంభం



నవతెలంగాణ-కల్చరర్

త్యాగరాయ గానసభ లోని కళా దీక్షితులు కళా వేదిక పై సర్వజన సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆరంభమైంది సంస్థ అధ్యక్షులు మహమ్మదు అబ్దుల్ రషీద్ సంస్థ లక్ష్యాలు తెలుపుతూ బడుగు బలహీనవర్గాలకు ప్రజలకు సాహిత్యం ద్వారా వారిని చైతన్య పరిచే విధం గా బస్తీల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు సంస్థ సభ్యులు దీపక్ నృతి అన్వర్ రవీంద్ర బాబు రాములు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడవాలి

- కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి

నవతెలంగాణ - చర్లపల్లి

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్ లో మహావీర్ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను సింగం చెరువు తండాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. గిరి జనుల అభివృద్ధి కోసం ఎన్నో త్యాగాలు చేసిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ప్రతి ఏడాది నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడువాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శంకర్ నాయక్, పీరు నాయక్, మహేష్, నాయకులు తండా వాసుగౌడ్, పద్మరెడ్డి, కిషన్, సింగం చెరువు తండా వాసులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
సోమవారం | ఫిబ్రవరి 17, 2025 | www.navatelangana.com

కుల గణన సర్వేలో వివరాలను నమోదు చేసుకోండి

మున్సిపల్ కమిషనర్ వసంత ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు అవకాశం



నవతెలంగాణ - జవహర్ నగర్

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ, కుల సర్వేలో పాల్గొనని కుటుంబాలు తమ వివరాలను నమోదు చేసుకోవాలని జవహర్ నగర్ మున్సిపల్ కమిషనర్ వసంత ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్యాలయంలోని ప్రజా పాలన సేవా కేంద్రంలో ఫిబ్రవరి 16 నుండి 28 వరకు ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. మున్సిపల్ కార్యాలయానికి రాలేని వారు టోల్ ఫ్రీ నెంబర్ (8978995862)కు ఫోన్ చేసి మీ అడ్రస్‌ను చెప్పితే మీ ఇంటికి వచ్చి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్వే ఫామ్స్ మున్సిపల్ కార్యాలయంలోఅందుబాటులో ఉంటాయన్నారు. ఆన్‌లైన్‌లో http://seeepcsurey.cgg.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

వ్యర్థాలను మున్సిపల్ వాహనాలకు అందించాలి

నవతెలంగాణ - చర్లపల్లి

డిప్యూటీ కమిషనర్ కాప్రా సర్కిల్ ఆదేశాల మేరకు వారాంతపు సంతలో మార్కెట్ వ్యాపారుస్తుల సౌకర్యార్థం పట్టణ పారిశుధ్య చర్యలలో భాగంగా వ్యర్థాలను మున్సిపల్ వాహనాలను అందించాలని జీహెచ్ఎంసీ అధికారులు ఆదివారం మల్లాపూర్‌లోని వివేకానంద నగర్‌లోని వారాంతపు సంతలో కూరగాయలు వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. మార్కెట్ వ్యాపారస్తుల వ్యాపార నిర్వహణలో భాగంగా వెలువడే చెత్తాచెదారము, మిగిలిన కూరగాయల లాంటి వ్యర్థాలను స్వచ్ఛందంగా వ్యాపారస్తులే వచ్చి వారి వ్యర్థాలను మున్సిపల్ వాహనాలకు అందించాల సూచించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులు మాట్లాడుతూ.. ప్రతి మార్కెట్లో వాహనాల ఏర్పాటు ద్వారా చెత్తాచెదారాన్ని రోడ్డుపైన పడవ వేయకుండా ట్రయల్ అండ్ ఎర్రర్ కింద ముందు పెద్ద మార్కెట్ల వద్ద, మధ్య రకం మార్కెట్ల వద్ద ఈ వాహనాలు ఏర్పాటు చేసి, రాత్రి లోపు వాహనదారులకు, పాదచారులకు మరుసటి రోజు ఇబ్బంది కలగకుండా ఈ ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

అంబేద్కర్ విగ్రహం సర్కిల్ సుందరీకరణ పనులను వేగవంతం చేయాలి



నవతెలంగాణ-కాప్రా

ఈసీఐఎల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం సర్కిల్ సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూపు, ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ రైట్ ప్రొటెక్షన్ సొసైటీ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. జ్ఞానమాల కార్యక్రమం నిర్వహణ అనంతరం అంబేద్కర్ సర్కిల్‌ను చిన్నదిగా చేసి సర్కిల్ పునఃనిర్మాణం చేస్తున్నారని తెలిపారు. ఆదివారం స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరి రావు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహం సర్కిల్‌ను చిన్నదిగా చేసి సుందరీకరణ చేస్తామని అధికారులు చెప్పారని తెలిపారు. సర్కిల్ చిన్నదిగా చేయడానికి చేపట్టిన నిర్మాణ పనులు జాప్యం కావడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని తెలిపారు. పనులను అంబేద్కర్ జయంతి నాటికి సంపూర్ణంగా పూర్తి చేయాలన్నారు. ప్రతి ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం నిర్వహిస్తూ అంబేద్కర్ విగ్రహానికి దండ వేసి నివాళులర్పించే సాంప్రదాయం దీర్ఘ కాలంగా కొనసాగుతున్నదన్నారు. అందువలన త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసేందుకు నిచ్చెనను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. సర్కిల్‌లో జాతీయ జెండాను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ రైట్ ప్రొటెక్షన్ సొసైటీ నాయకులు సిహెచ్ నాగేశ్వరరావు, ప్రభుదాస్, యాదగిరి, గగన్ కుమార్, మురారి, భిక్షపతి తదితరులున్నారు.

మధురానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ - చర్లపల్లి

చర్లపల్లి డివిజన్‌లోని మధురానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా వంగ కొండల్ రెడ్డి, వాకిటి అనిలారెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా దిరావత్ లింగం నాయక్, కేసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, కోశాధికారిగా మెగావత్ శ్రీనివాస్ నాయక్, కార్యనిర్వాక కార్యదర్శులుగా సాయి పంతులు, తాత సుజాత, సంయుక్త కార్యదర్శులుగా విలాసాగర్ సుధాకర్, మా ఊరి ఈశ్వర్, హనుమ, నిమ్మ ఉదయ్ రెడ్డి, సలహాదారులుగా చంద్రశేఖర్, విజయ్, శ్రీనివాస్, మంతు నాయక్, కార్యవర్గ సభ్యులుగా అయ్యప్ప, శ్రీవాణి, లావణ్య, తాతారావు, ఆర్.ఉదయ్ కుమార్, సతీష్, నరసయ్య, శ్రీకాంత్ రెడ్డి, హరినాయక్, చంద్రారెడ్డిలు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన మధురా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇతర కార్యవర్గ సభ్యులను చర్లపల్లి కాలనీల సమాఖ్య సీసీఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మధురానగర్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని నూతన కమిటీకి చర్లపల్లి కాలనీల సమాఖ్య సీసీఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ కుటుంబాలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పంచశీల్ కాలనీలో కార్పొరేటర్ స్వర్ణరాజు పర్యటన



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి HMWSSB అధికారులతో కలిసి డివిజన్‌లోని పంచశీల్ కాలనీ ఫేజ్-1లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా పంచశీల్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వారి దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. తాగునీరు, నూతన భూగర్భ డ్రయినేజీ వ్యవస్థ పైపులైన్ల ఏర్పాటు చేయాలని కోరారు. కార్పొరేటర్ స్పందించి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్వయంగా వినతిపత్రం HMWSSB అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణితో పాటు HMWSSB ఏఈ రోహిత్, కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బీజేఆర్ కాలనీలో 142వ వారం జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా మండల పరిధిలోని జమ్మిగడ్డ ప్రాంతం బీజేఆర్ కాలనీలో జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం మహాత్మ జ్యోతిరావు పూలే, బీఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు సమర్పించే జ్ఞానమాల కార్యక్రమా 142వ వారానికి చేరింది. ఈ ఆదివారం మానవ హక్కుల ప్రతినిధి శ్రీనివాస్ మహనీయుల విగ్రహాలకు పూలమాల వేసి జ్ఞానమాల సమర్పించారు. అనంతరం వారికి జ్ఞానమాల టీం సభ్యులు చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, సభ్యులు ఎస్ఎ రహీమ్, నర్సింహ్మా చారి, రవి నాయక్, నరేందర్ రావు, జాషువా రాములు, నగేష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ మహనీయులకు జ్ఞానమాల సమర్పణ



నవతెలంగాణ - జవహర్ నగర్

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాజీ నగర్ చౌరస్తాలో అంబేద్కర్ మహనీయులకు ఆదివారం భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 27వ వారం జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఓబీసీ చైర్మెన్ పసుపులేటి వీర భాస్కరావు హాజరై అంబేద్కర్ మహనీయులకు పూలమాలలు సమర్పించారు. అనంతరం పార్టీలకు, కుల, మతాలకు, అతీతంగా భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని, అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి నిర్వాహకులు మహంకాళి భిక్షపతి, మాజీ కార్పొరేటర్ గొడుగు వేణు, రమేష్, గడ్డం గిరి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ గడ్డం శీను, జిల్లా కన్వీనర్ వెంకటేష్, దున్నపోతుల నరసింహ, విజయ శంకర్, యాదగిరి, వి వెంకటేష్, వి రామారావు, తిరుపతి వరుకుప్పల వెంకటేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొని

రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో వసూల్ రాజాలు..!

- డాక్యుమెంట్ రైటర్లదే హవా
- అడిగినంత ఇస్తే సరి.. లేదంటే కొర్రీ..!
- ప్రయివేటు వ్యక్తుల హల్‌చల్.. ప్రజల బేజార్..!
- ఎప్పటికప్పుడు తనిఖీలు చేయని ఉన్నతాధికారులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మేడ్చల్, మల్కాజిగిరి, ఘట్‌కేసర్, కీసర, వల్లభనగర్, శామీర్‌పేట, కూకట్‌పల్లి, ఉప్పల్, బాలానగర్, నారపల్లి, కాప్రా, కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో పని చేసే కొందరు ఉద్యోగులు ప్రయివేటు వ్యక్తులతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేయి తడపనిదే ఏ పనీ జర గదన్న రీతిలో ఆఫీసుల్లో కార్యకలాపాలు సాగుతున్నట్టు సమాచారం. జిల్లా వ్యాప్తంగా నిత్యం వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. ఏ రిజిస్ట్రేషన్‌కైనా డాక్యుమెంట్ తప్పనిసరి. కొందరు అడ్వకేట్ల ద్వారా అవసరమైన పత్రాలు రూపొందించుకుంటే.. మరికొందరు డాక్యుమెంట్ రైటర్లను, ఇంకొందరు ప్రయివేటు వ్యక్తులను సంప్రదిస్తుంటారు. అదే వారికి ఆదాయ వనరు. ఎవరు వారి దగ్గరకు వెళ్లినా.. కమిషన్ల పేరిట వేలకు వేలు లాగేస్తున్నారు.

> సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద డాక్యుమెంట్ రైటర్లదే హవా కొనసాగుతోంది. అధికారుల పేర్లు చెప్పి అధిక మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్నారు. కొందరు సబ్ రిజిస్ట్రార్లు వారితో కుమ్మక్కు కాగా.. మరికొందరు అనుకూలంగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. అడిగినంత ఇస్తే సరి.. లేదంటే కొర్రీలు పెడుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయకపోవడంతోనే డాక్యుమెంట్ రైటర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

వాస్తవానికి ప్రభుత్వం స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్స్ రేట్లను సర్కిళ్ల వారీగా నిర్ణయించింది. ప్లాట్, నివాస గృహం, విల్లాతోపాటు పలు రకాల ఆస్తులకు ఛార్జీలను ప్రకటించింది. అయినా అడిగినంత ఇవ్వకపోతే కొర్రీలు పెడుతున్నారు.

ఆఫీసుల వద్ద అధిక వసూళ్లు!

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో డాక్యుమెంట్ రైటర్లు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారనీ, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వానికి చెల్లించాల్సిన చార్జీలతో పాటు అదనంగా ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.2 వేలకు పైనే వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అందులో అధికారులకే ఎక్కువ వాటా ఇవ్వాలని రైటర్లు బాహాటంగానే వసూళ్లకు తెగబడుతున్నట్టు కొందరు బాధితులు చెబుతున్నారు.

ప్రయివేటు వ్యక్తులకే వత్తాసు..!

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రజలకు సమాధానం చెప్పేవారు ఎవరూ ఉండరు. ఎవరినైనా అడిగినా బయట ఫలానా పేరు గల ఆఫీసులోకి వెళ్లి అడుగు అనే ఉచిత సలహాలు ఇస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. దీంతో చేసేదేమీలేక ప్రజలు ప్రయివేటు వ్యక్తులను ఆశ్రయిస్తూ అదనంగా డబ్బులు ముట్టజెప్పాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో ఏసీబీ దాడులు, రాష్ట్ర స్థాయి అధికారులు తనిఖీలు చేయకపోవడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో వసూళ్ల పర్వం విచ్చలవిడిగా సాగుతోందనే ఆరోపణలు ఉన్నాయి.

దొరకడం కష్టమే..!

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వసూళ్ల పర్వం మొత్తం ప్రయివేటు వ్యక్తుల చేతుల మీదుగానే సాగుతుండటంతో ఉద్యోగులు అవినీతిశాఖ అధికారులకు దొరకడం చాలా అరుదుగా జరుగుతుంది. ఆఫీసులో అడుగు పెట్టడం నుంచి తిరిగి బయటకు వచ్చే దాకా ఖర్చులన్నీ లెక్కలేసి డాక్యుమెంట్ రైటర్లు ముందుగానే వసూలు చేస్తారు. ఆ తర్వాతే డాక్యుమెంట్ రిజిస్ట్రార్ టేబుల్ మీదకు వెళ్తుంది. ఆ తర్వాత స్టాంపింగ్, రిజిస్టర్‌లో సంతకాలు.. ఇలా ఒక్కోదానికి ఒక్కో రేటు ఫిక్స్ చేసి వసూళ్లు చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇదంతా రైటర్ల చేతుల మీదుగా సాగుతుండటంతో ఉద్యోగులు అవినీతి ఉచ్చు నుంచి తప్పించుకుంటున్నారు. చివరకు వివాహల రిజిస్ట్రేషన్లు, ఈసీ నకలు కాపీలకు, డూప్లికేట్ రిజిస్ట్రేషన్ పత్రాలకు ఇలా ఒక్కోదానికి ఒక్కో రేట్ ఫిక్స్ చేసి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

హెచ్-సిటీ పనులకు స్థల పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

శేరిలింగంపల్లి జోన్‌లో పలు అభివృద్ధి పనులకు ఆదివారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి స్థల పరిశీలన చేశారు. ఇంటర్ డిపార్టుమెంట్ కన్వర్జెన్సీ పర్యటనలో భాగంగా హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, టీఎస్ఐఐసీ పోలీస్, విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి పరిశీలన చేశారు. వారితో పాటు జోనల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్, ప్రాజెక్టు మెయింటెనెన్స్ ఇంజినీరింగ్ అధికారులతో పలు ప్రాంతాల్లో ప్రతిపాదించిన పనుల స్థలాలను పరిశీలించారు. హెచ్-సిటీ ద్వారా ప్రతిపాదించిన ఫ్లై ఓవర్లు, రోడ్డు విస్తరణతో పాటు జంక్షన్ ఇంప్రూవ్మెంట్ పనుల ప్రతిపాదన పనులను ఈ సందర్భంగా పరిశీలించారు. జంక్షన్ వద్ద హెచ్-సిటీ ప్రతిపాదన పనుల వద్ద యుటిలిటీ తొలగింపుతోపాటు స్థల సేకరణకు చర్యలు తొందరగా తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంబంధిత విభాగాల అధికారులతో కలిసి కమిషనర్ బస్సులో ప్రయాణించి ప్రతిపాదిత పనుల వద్ద ఆయా శాఖలకు సంబంధించిన యుటిలిటీ విద్యుత్, వాటర్ వర్క్స్, టెలిఫోన్ వైర్లు వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను కోరారు. హెచ్-సిటీ పనుల టెండర్ ప్రక్రియ తుది దశలో ఉన్న నేపథ్యంలో పనులను కొనసాగించేందుకు యూటిలిటీలు తొలగింపు చర్యలు ముమ్మరంగా తీసుకోవాలని ఆయా హెచ్ఓడీలను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం హెచ్-సిటీ పనులను ప్రతిష్టాత్మకంగా అమలు చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆయా శాఖలు సమన్వయంతో కలిసి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా హెచ్-సిటీ ద్వారా ప్రతిపాదించిన పనులైన ఖాజాగూడ జంక్షన్, సీపీ ఆఫీస్ గచ్చిబౌలి జంక్షన్, ట్రిపుల్ ఐటీ జంక్షన్, విప్రో జంక్షన్, కాంటినెంటల్ జంక్షన్, డీఎల్ఎఫ్ రోడ్డు మజీద్ బండ (బొటానికల్ గార్డెన్), చందానగర్ రైల్వే స్టేషన్, లింగంపల్లి ఫ్లైఓవర్, శ్రీదేవి టాకీస్ గంగారం రోడ్డు, ఆల్విన్ ఎక్స్ రోడ్ తదితర ప్రతిపాదించిన పనుల స్థల పరిశీలన చేసిన జీహెచ్ఎంసీ పనులను కమిషనర్ పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర పురపాలక శాఖ డిప్యూటీ సెక్రెటరీ ప్రియాంక, వాటర్ వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డి, జాయింట్ సీపీ డెవిస్, చీఫ్ ఇంజినీర్ భాస్కర్‌రెడ్డి, టీఎస్‌పీడీసీఎల్ అధికారులు శేఖర్, పాండ్యన్, జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, వేణు గోపాల్‌రెడ్డి, టీఎస్ఐఐ సీఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్, జోనల్ సీపీ, ఏసీపీ, ప్రాజెక్టు ఈఈలు, డిప్యూటీ ఈఈలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ మల్లికార్జున స్వామి కల్యాణం

పాల్గొన్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి గ్రామంలోని లోటస్ ఎన్ క్లేవ్ కాలనీలోని శ్రీ మల్లికార్జున పద్మావతి సమేత స్వామి వార్ల కల్యాణం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ కురుమ సంఘం సభ్యులు చెర్లపల్లి ఈశ్వర్, జీతయ్య, పెద్ద మల్లేష్, కృష్ణ కుర్మ, శెల్వోజి కురుమ సంఘం సభ్యుల ఆహ్వానం మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుర్గం శివ శంకర్ ముదిరాజ్, సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్లు కొడే మహేష్, జాకట దేవ, రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, నారెడ్డి రవీందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసి సెల్ అధ్యక్షులు గువ్వ రవి ముదిరాజ్, మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్, మున్సిపాలిటీ ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు గుండ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

పాలకులం కాదు..ప్రజా సేవకులం : కార్పొరేటర్ బన్నాల



నవతెలంగాణ-ఉప్పల్

తాము పాలకులం కాదనీ, ప్రజా సేకులమని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. డివిజన్‌లోని శ్రీనగర్ కాలనీలో, చిల్కానగర్ గవర్నమెంట్ స్కూల్ వెనకాల పాండు గల్లీలో మౌలిక సదుపాయాలు, సీసీ రోడ్డు, శివరేజ్ లైను, స్ట్రామ్ వాటర్ లైను, ఎలక్ట్రికల్ పోల్స్, వాటిపైన నూతన లైట్స్ ఏర్పాటు చేసినందుకు కాలనీ అసోసియేషన్ సభ్యులు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌ను సన్మానించి మెమెంటోతో అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కేసీఆర్, కేటీఆర్ ఇచ్చిన అవకాశం కల్పించారని, మీరందరూ తనను గెలిపించినందుకు డివిజన్‌ను అభివృద్ధి చేశానన్నారు. జీహెచ్ఎంసీలోని 150 డివిజన్లలో చిల్కానగర్ అభివృద్ధిలో ఆదర్శంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏదుల్లా కొండల్ రెడ్డి ,కోకొండ జగన్, మహమూద్, షనాజ్,శ్యామ్ శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అధ్యక్షులు కొండయ్య, మనోహర్రావు, అంజయ్య, శ్రీనివాస్, రణధీర్, శ్రీహరి రెడ్డి ,రాములు, సత్యనారాయణ, దేవేందర్ రెడ్డి , ప్రసాద్ ,కాజా , పాండు గల్లి సభ్యులు పాండు, హనీఫ్,రాజు, నవీన్, నాగరాజ్ , విశ్వనాథ్, పద్మ, బషీర్, మహమూద్, తదితరులున్నారు.

బీఆర్ అంబేద్కర్ అణగారిన వర్గాల అశాజ్యోతి



నవతెలంగాణ-కీసర

భారత రాజ్యంగా నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అణగారిన వర్గాలకు అశాజ్యోతిగా నిలిచా రని, ఆయన స్ఫూర్తితో హక్కుల సాధన కోసం పోరా డి రాజ్యాంగ ఫలాలను అందరికీ అందేలా చూడటమే అంబేద్కర్, రమాబాయ్ దంపతులకు నిజమైన నివాళి అని దళిత బహుజన మహిళ నేతలు అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో మాల సంఘం ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా ఈ ఆదివారం 150వ జ్ఞానమాల, రామాబాయి అంబేద్కర్ జయంతి కార్యక్రమానికి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేత, మాజీ కౌన్సిలర్ మంగళపూరీ వెంకటేష్, కాంగ్రెస్ మహిళ నాయకురాలు గుజ్జుక నర్మద, మాల సంఘం మాజీ అధ్యక్షురాలు పాడుగుల రూపా పాల్గొని జ్ఞాన మాల సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మనం అనుభవిస్తున్న ఫలాలు అన్ని రాజ్యాంగం అందించిన ఫలాలేనన్నారు. ఆకలి, అసమానతలు లేని సమసమాజ స్థాపన కోసం హక్కులను సాధించి పెట్టారన్నారు. ఆయన ఆశయ సాధనను ముందుకు తీసుకెళ్ళడమే ఆయనకిచ్చే అసలైన నివాళి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు సంఘం మేడ్చల్ జిల్లా కన్వీనర్ గుజ్జుక పరుశురాం , ఆర్జికే కాలనీ సంఘం అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ , మాల సంఘం పెద్దలు పాడుగుల చంద్రమౌళి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గొల్లూరి రాజు, కోశాధికారి చెన్నయ్య, సభ్యులు వెంకటేష్, గౌతమ్, శ్రీనివాస్ , దుబాయ్ రాజు, బిఎస్ రావు, కేవి రావు, మనోజు, వీరేశం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌లో ఎగ్జిబిషన్ జ్ఞాన్ ఫియస్టా 2025 వేడుకలు



నవతెలంగాణ - చర్లపల్లి

డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ వివిధ తరగతులకు చెందిన విద్యార్థుల ప్రతిభ, నైపుణ్యాలను ప్రదర్శించే ఎగ్జిబిషన్ జ్ఞాన్ ఫియస్టా ను విజయవంతంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఎగ్జిబిషన్ లో గణితం, ఇంగ్లీష్, సోషల్ సైన్స్, ఐసీటి, ఆర్ట్స్, కాఫ్ట్స్ వంటి సబ్జెక్టులను కవర్ చేసే ప్రాజెక్టు, ప్రెజెంటేషన్ లను ఆకట్టుకునే విధంగా విద్యార్థులు ప్రదర్శించారు. స్కూల్ లైబ్రరీ, ఫైనాన్షియల్ లిటరసీ, స్కూల్ సినిమా, సాఫ్ట్ స్కిల్స్, మ్యూజిక్ డ్యాన్స్ కూడా ప్రదర్శించబడ్డావి.విద్యార్థులు తమ ప్రాజెక్టులను ఉత్సాహంగా లక్ష్యాలు, ఫలితాలు విజయవంతంగా ప్రదర్శించారు, సందర్శకులకు ఎగ్జిబిషన్ అద్భుతమైన అనుభూతిని కలిగించింది. హాజరైన వారి నుండి సానుకూల స్పందన, సూచనలు సలహాలు వచ్చాయి. పాఠశాల కమిటీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు సహాయక తల్లిదండ్రుల సహకార ప్రయత్నాల ఫలితంగా జ్ఞాన్ ఫియస్టా ను విజయవంతంగా నిర్వహించామన్నారు. చైర్మన్ కె.నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్ కె.నవీన్ కుమార్ పాఠశాల యాజమాన్య బృందం మొత్తం ఎగ్జిబిషన్ లో పాల్గొన్నారు. జ్ఞాన్ ఫియస్టా-2025 అద్భుతమైన విజయాన్ని సాధించింది, నిర్వాహకులను పాల్గొన్న వారు తమ కృషిని ఈవెంట్ ను అభినందించారని పాఠశాల ప్రిన్సిపాల్ సుమా మీనన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ కమలామనోహర్ రావు, కోర్ ఆపరేషన్స్ హెడ్ కిషోర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుమా మీనన్, వైస్ ప్రిన్సిపాల్ లు తదితరులు పాల్గొన్నారు.





మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆదివారం ఓ కార్యక్రమానికి వెళ్లిన ఆయన అక్కడ తనకు పాల డబ్బాతో కనిపించిన స్కూటర్‌పై ఎక్కి కూర్చున్నారు. ఒకప్పుడు తాను స్కూటర్ పైనే పాల వ్యాపారం చేసే వాడిని గుర్తు చేసుకున్నారు. స్కూటర్‌ను నడుపుతూ, ఫోటోలు దిగుతూ అందరినీ నవ్వించారు. పాలు అమ్మిన వాళ్లు ఎప్పటికైనా సక్సెస్ అయ్యి తీరుతారంటూ స్కూటర్ పై పాలమ్ముతున్న ఆ వ్యాపారిని శాలువా కప్పి సన్మానించారు. 1నవతెలంగాణ,మేడ్చల్

మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు..



నవతెలంగాణ - చర్లపల్లి

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో ఆదివారం దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ బొజ్జ రాకేష్ ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. ఏబీసీడీ వర్గీకరణ ఆమోదించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బొజ్జ రాకేష్ మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల సేవలను గుర్తించి ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. 3వేల ఆశా వర్కర్ల పోస్టులను భర్తీ చేయాలని మంత్రికి మెమొరండం అందజేశామన్నారు. ఆశా వర్కర్లకు న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ ఇప్పల కుమార్, మాజీద్, పులి శ్రీకాంత్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాదాపూర్ హైటెక్స్ కన్వెన్షన్ లో ఆదివారం శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, రాగం సుజాత కుమారుడు రాగం అనిరుధ్ యాదవ్, పటాన్ చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, రమాదేవి కుమార్తె జాగృతి సాయి వివాహ కార్యక్రమానికి హైదరాబాద్ నగర తొలి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, అఖిల భారత యాదవ సంఘం, తెలంగాణ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు.
నవతెలంగాణ - చర్లపల్లి

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ - జవహర్‌నగర్

బాలాజీ నగర్ 33 కేవీ సబ్ స్టేషన్ నుండి వెలువడే 11 కేవీ సాయి బాబా ఫీడర్‌లో స్తంభాల టోరెక్షన్ కార ణంగా సమ్మర్ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సోమ వారం ఉదయం 10 గంటల నుండి 11గంటల వరకు బాలాజీ నగర్ మెయిన్ రోడ్డు, మహంకాళి మెయిన్ రోడ్డు, మోహన్ రావు కాలనీ, ఆనంద్ నగర్ కాలనీ, మార్కెట్ రోడ్డు, శాంతి నగర్, ముత్తుస్వామి కాలనీ, వెంకటేశ్వర కాలనీ, చంద్రగిరి కాలనీ, ఫైరింగ్ రేంజ్, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని బాలాజీ నగర్ ఏఈ సాంబశివ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



నత్తిని అధిగమించి... పాప్‌సింగర్ అయ్యింది

భారత సంతతికి చెందిన బ్రిటీష్ కళాకారిణి రాధికా వెకారియా ముప్ఫై ఏండ్ల వయసులో ప్రపంచవ్యాప్తంగా సంచనం సృష్టిస్తోంది. ఒకప్పుడు సరిగ్గా మాట్లాడలేక ఇబ్బంది పడింది. తన పేరు పలకడానికి కూడా కష్టపడిన ఆమె ఇప్పుడు సంగీత ప్రపంచాన్ని ఉర్రూతలూగిస్తోంది. బాల్యంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంది. అనేక అవమానాలు భరించింది. వేధింపులు, బెదిరింపులు సైతం ఎదుర్కొవల్సి వచ్చింది. ఆ అవమానాలు, వేధింపుల నుంచే తన విజయాన్ని వెదుక్కుంది. మౌనంగా ఉంటూనే ఎవ్వరూ ఊహించని స్థాయికి ఎదిగిన ఆమె స్ఫూర్తిదాయక

మొదటి సారి గ్రీమీ అవార్డుకు నామినేట్ అయిన భారతీయ సంతతికి చెందిన బ్రిటిష్ వాయిద్య కళాకారిణిగా రాధిక వెకారియా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఫిబ్రవరి 2న లాస్ ఏంజిల్స్‌లో జరిగిన గ్రామీ అవార్డ్స్ కార్యక్రమంలో టేలర్ స్విఫ్ట్, బిల్లీ ఎలిష్, సబ్రినా కార్పెంటర్ చాపెల్ రోన్ వంటి పాపులర్ దిగ్గజాలతో కలిసి నడిచింది.

ఆత్మవిశ్వాసంతో ముందగుడు

2013 నుండి అమెరికాలో నివసిస్తున్న రాధిక వెకారియా లండన్‌లో పుట్టింది. ఈమె తాతముత్తాతలు భారత సంతతికి చెందినవారు. బాల్యం నుంచి దీర్ఘకాలిక ప్రసంగలోపం(నత్తి)తో బాధపడేది. మాట్లాడడంలో ఇబ్బంది ఉన్నా తాను కచ్చితంగా పాడగలనని గ్రహించింది. ఆత్మవిశ్వాసంతో ముందగుడు వేసింది. అందుకే మాట్లాడటం నేర్చుకునే ముందు పాడటం నేర్చుకుంది. అమ్మమ్మ నుంచి స్ఫూర్తి పొందిన రాధిక చిన్నప్పటి నుంచి శాస్త్రీయ సంగీతంపై ఆసక్తి పెంచుకుంది. ఆర్టిస్ట్‌గా రాణించింది. వారియర్స్ ఆఫ్ లైట్ ఆల్బమ్ నామినేషన్‌కు ఎంపికైంది. ఈ ఆల్బమ్‌ను రాధిక సంస్కృతం, హిందీ, తమిళం, ఆంగ్లభాషల్లో పాడటం విశేషం. ఉత్తమ న్యూ ఏజ్, యాంబియంట్ లేదా చాంట్ ఆల్బమ్ విభాగంలో అనౌష్కా శంకర్, రికీ కేజ్ వంటి ప్రముఖ కళాకారులతో తలపడింది.

ఆమె ఏమంటుందంటే...

'మాటల సమస్య ఉన్న చాలా మంది నిజానికి చాలా మంచి గాయకులు. దానికి శ్రావ్యత, కొంచెం స్వరం, కొంచెం సంగీత జ్ఞానం అలవడితే గాయకులుగా రాణిస్తారు. అంతేకాదు అది మనసుకు ప్రశాంతత నిస్తుంది. మెదడుకు మంచిది. నాడీ వ్యవస్థకు మేలు చేస్తుంది. అందుకే నాకు పాడటం అలవాటైంది. అసలు నాకున్న సమస్యను అధిగమించగలనని ఊహించలేదు. చాలా సంతోషంగా ఉంది. నా పాట విని స్నేహితులు, కుటుంబ సభ్యులు ముగ్దులయ్యారు. అసలు వేదికలపై మాట్లాడతానని, ఇప్పుడు చేస్తున్న పనులన్నీ చేస్తానని ఎప్పుడూ అనుకోలేదు. నేను నేర్చుకున్న సంగీతమే నన్ను స్వేచ్ఛగా మాట్లాటగలిగేలా చేసింది. నా వయసు పెరుగుతున్న కొద్దీ నాలోని సమస్య నయం కావడం ప్రారంభమయింది. పెద్దయ్యాక పాడడానికి ధానం చేసేదాన్ని. అది చాలా ప్రభావాన్ని చూపించింది. నాలోని లోపాన్ని చూసి భయపడడం మానేసి, నాలో ఏదో శక్తి ఉందని, పాడగలని గుర్తించడమే నా జీవితంలో ఓ పెద్ద మలుపుకు కారణమయ్యింది' అంటూ ఆమె ఎంతో సంతోషంగా పంచుకున్నారు.



కొన్ని జాగ్రత్తలు పాటిస్తే...

ప్రస్తుతం మన జీవితంలో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు భాగంగా మారిపోయాయి. కొందరి ఉద్యోగాలు అయితే వీటి మీదే ఆధారపడి ఉంటున్నాయి. తరచూ అంతర్జాలంతో గడిపేవారూ గంటల తరబడి పీసీల ముందు కూర్చుంటున్నారు. ఇలా ఎక్కువసేపు డిజిటల్ పరికరాల తెరను చూస్తే కండ్లు ఒత్తిడికి గురై అలసిపోవచ్చని కంటి నిపుణులు చెబుతున్నారు. కొన్నిసార్లు చూపు కూడా దెబ్బతినొచ్చని హెచ్చరిస్తున్నారు. కాబట్టి తప్పనిసరిగా కంప్యూటర్‌తో పనిచేసేవారు కొన్ని జాగ్రత్తలు పాటించటం మంచిదని సూచిస్తున్నారు.



- మరీ ప్రకాశవంతమైన లైట్ల వెలుగులో పనిచేస్తే కష్టపడి చూడాల్సి ఉంటుంది. ఫలితంగా కండ్లు త్వరగా, బాగా అలసిపోతాయి. కాబట్టి తగినంత వెలుతురు ఉండేలా చూసుకోవాలి.
- తల పైన నేరుగా కాంతి పడినా, కిటికీ నుంచి ప్రకాశవంతమైన ఎండ పడినా స్క్రీన్ చూసేటప్పుడు కండ్లకు ఇబ్బంది కలుగుతుంది. అందువల్ల వీటిని నివారించుకోవాలి. వీలైతే గచ్చుకు లైట్లు (ఫ్లోర్ ల్యాంప్స్) అమర్చుకోవాలి. ఒకవేళ కిటికీ తెరవటం తప్పనిసరైతే పక్క వైపు నుంచి కాంతి పడేలా చూసుకోవాలి. కిటికీకి ఎదురుగా గానీ కిటికీకి వీపు చేసి గానీ కూర్చోవద్దు. కర్టెన్లు వేస్తే బయటి వెలుగు తగ్గించుకోవచ్చు.
- డిస్‌ప్లే మీద యాంటీగ్లేర్ స్క్రీన్ బిగిస్తే కండ్లకు హాయిగా ఉంటుంది. ఒకవేళ కళ్లద్దాలు ధరిస్తే యాంటీ రిఫ్లెక్టింగ్ పూత ఉన్నవి తీసుకోవాలి. ఇది తెర నుంచి ప్రతిఫలించే కాంతిని కళ్లకు అంతగా చేరకుండా అడ్డుకుంటుంది.
- ఒకవైపు ప్రింట్ తీసుకున్న పేజీని, మరోవైపు కంప్యూటర్ తెరను మార్చి మార్చి చూడాల్సి వస్తే తెర పక్కన స్టాండ్‌కు పేజీని అమర్చుకోవాలి. స్టాండు మీద తగినంత వెలుతురు పడేలా చూసుకోవాలి. మీరు డెస్క్ ల్యాంప్‌ను వాడుతున్నట్టయితే దీన్నుంచి వచ్చే కాంతి.. కండ్ల మీద, కంప్యూటర్ తెర మీద గానీ పడకుండా చూసుకోవాలి.
- చేసే పని నుంచి తరచూ విరామం తీసుకోవాలి. ప్రతి గంటకూ కనీసం 10 నిమిషాల సేపు విశ్రాంతి తీసుకుంటే మంచిదని నిపుణులు అంటున్నారు. కంప్యూటర్ మీద పనిచేయటం వల్ల తలెత్తే మెడ, వీపు, భుజాల నొప్పి తగ్గటానికిది సాయపడడమే కాకుండా ఇది కండ్ల మీద ఒత్తిడి తగ్గిస్తుంది.
- డిస్‌ప్లే సెటింగ్స్ మార్చుకోవడం వల్ల కండ్లకు ప్రయోజనం ఉంటుంది. చుట్టుపక్కల పరిస్థితులకు అనుగుణంగా డిస్‌ప్లే బ్రైట్‌నెస్ మార్చుకోవాలి. వెబ్ పేజీలో తెల్ల భాగాన్ని చూసినప్పుడు కాంతి వస్తున్నట్టు అనిపిస్తే చాలా బ్రైట్‌గా ఉందని.. మసకగా, బూడిద రంగులో కనిపిస్తే డార్క్‌గా ఉందని అర్థం చేసుకోవాలి. టెక్స్ట్‌సైజు, కాంట్రాస్ట్‌నూ సౌకర్యవంతంగా ఉండేలా అడ్జస్ట్ చేసుకోవాలి.
- దూరం వస్తువులను 10-15 సెకండ్ల పాటు చూసి, వెంటనే దగ్గర వస్తువుల మీద 10-15 సెకండ్ల సేపు దృష్టి పెట్టాలి. ఇలా పది సార్లు చేస్తే.. తదేకంగా స్క్రీన్‌ను చూసినప్పుడు బిగుసుకున్న కండరాలు వదులవుతాయి.



సులభంగా శుభ్రం చేద్దాం...

ఇల్లు శుభ్రంగా, అందంగా కనిపించాలని ప్రతి ఒక్కరూ అనుకుంటుంది. దీని కోసం ఎంతో కష్టపడుతుంటారు. కానీ వంట, పిల్లలు.. ఇంకా కొందరికి ఆఫీసు పనులు ఇలా అనేక కారణాలతో ఇల్లు సర్దే పనులు వాయిదావేస్తుంటారు. ఎప్పుడైనా ఖాళీ దొరికినప్పుడు చేద్దాంలే అనుకుంటారు. ఆ తర్వాత సమయం దొరకక ఏ పండగలప్పుడో సర్దుకునే సరికి పని కొండంత అయిపోతుంది. అయితే ఇలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు ఒక నియమాన్ని పాటిస్తే చాలంటున్నారు నిపుణులు. దీని వల్ల ఈజీగా ఇల్లును సర్దుకోవచ్చని సూచిస్తున్నారు. ఈ నియమం ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

1- 3- 5 రూల్: 1- 3- 5 రూల్ అంటే ఒక పెద్దపని, మూడు మధ్యతరహావి, అయిదు చిన్న చిన్న పనులని అర్థం. అయితే రోజూ ఈ నియమాన్ని పాటిస్తూ వెళ్లాలని నిపుణులు అంటున్నారు. పెద్దపని అన్నారు కదా అని కిచెన్ అంతా సర్దేస్తా, కబోర్డంతా దులిపేస్తా అని పెట్టుకుంటే రోజూ అలసటే మిగులుతుంది. ఇంకా ఇలా చేస్తే మిగతా 3ం5 పనులెలా పూర్తవుతాయి? అందుకే ఎలాగూ రోజూ కొనసాగించాలని అనుకున్నాం కాబట్టి పనుల్ని విభజించుకోవాలని సూచిస్తున్నారు. ఉదాహరణకు పడకగదినే తీసుకుంటే అందులో కబోర్డులో ఒక అరను ఈరోజు సర్దడం, లేదంటే అరగంట ఈ పని చేస్తా అని నియమం పెట్టుకోవాలని చెబుతున్నారు.

అనంతరం ఆరోజుకి అక్కడితో ఆపేసి తర్వాత 5-10 నిమిషాలు పట్టే మూడు పనులు చేయాలని సూచిస్తున్నారు. దుస్తులు మడత పెట్టడం, కడిగిన గిన్నెలు అరల్లో సర్దడం ఏదైనా చేయచ్చు. ఆ తర్వాత అయిదు నిమిషాల్లోపు వాటిని అంటే టీపాయ్ తుడవడం, దానిపై ఉండే వస్తువులను సర్దడం, రిమోట్ స్టాండ్ శుభ్రం చేయడం లాంటివి చేయాలట. ఇలా అన్నీ చేసేస్తే ఆరోజుకి సరిపోతుంది. అయితే, ఒకదాని తర్వాత ఒకటి వరుసగా చేయాలన్న నియమమూ లేదని.. మీకెప్పుడు తోస్తే అప్పుడు చేయొచ్చని అంటున్నారు. ఏమేం చేయాలన్నది పొద్దున్నే ఓసారి అనుకోవడమో కాగితం మీద రాసుకోవడమో చేస్తే సరిపోతుందని సలహా ఇస్తున్నారు.

ముఖ్యంగా పనులు మధ్యలోనే ఆగిపోతున్నాయన్న కంగారూ పడవద్దని నిపుణులు అంటున్నారు. ఒకరోజు తీసేయాల్సినవి పక్కనపెట్టాలని.. రెండోరోజు శుభ్రత, మూడోరోజు సర్దుకోవాలని సూచిస్తున్నారు. ఇలా ఇక్కడ ఆరోజుకి పర్‌ఫెక్ట్‌గా పూర్తవ్వాలన్న తొందరేమీ వద్దని.. నెమ్మదిగానే చేసుకుంటూ వెళ్లండని తెలిపారు. ఇలా చేస్తే పోనుపోనూ మీకు ఇదో అలవాటుగా మారుతుందని.. క్రమంగా ఇల్లూ శుభ్రంగా ఉంటుందని వివరిస్తున్నారు.

ఆజంజాహి భూమిపై నేతల కన్ను

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నించినా వీలు కాలేదు. 2011 నుంచి ఈ భూమిపై కన్నేసిన వాళ్లు మిల్లు కార్మిక భవనం పేరిట రంగ ప్రవేశం చేయడం, తెర వెనుక నాటి మంత్రి, మేయర్, ఎమ్మెల్యే ఒక వ్యాపారవేత్తకు సహకరించడంతో అతని పేరిట 1,200 గజాలు రిజిస్ట్రేషన్ అయింది. కార్మికులకు మిల్లు స్థలంలో నివేశనస్థలాలు ఇవ్వాలంటూ జిల్లా కోర్టు, హైకోర్టు వరకు న్యాయ పోరాటం చేశారు. ఈ క్రమంలో మిల్లు స్థలంలో 'కుడా' లే అవుట్‌లోనే మిల్లు కార్మికులకు నివేశన స్థలాలు ఇవ్వాలని కోర్టు తీర్పునిచ్చింది. జిల్లా కలెక్టర్ ఈ తీర్పును భేఖాతర్ చేసిన క్రమంలో మిల్లు కార్మికులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీంతో కలెక్టర్ మిల్లు కార్మికులను పిలిపించుకొని రాజీ చేసుకున్నారు. ఈ ప్రక్రియలో తెర వెనుక ఉన్న నేతలు ఈ భవన స్థలాన్ని వదులుకుంటేనే నివేశన స్థలాలు ఇస్తామని మెలికపెట్టారు. అలా మిల్లు స్థలంలో కాకుండా 316 మంది మిల్లు కార్మికులకు ఉనికిచెర్ల వద్ద 'కుడా' చేసిన 'మా సిటీ' లే అవుట్‌లో నివేశన స్థలాలు ఇచ్చారు. దీంతో కొంతమంది వైఖరి వల్ల సదరు వ్యాపారికి ఆ స్థలంపై పూర్తి అధికారాలు వచ్చినట్టయింది. సదరు వ్యాపారి నేరుగా ఆ భూమిపైకి వెళ్లడానికి తెర వెనుక రంగం సిద్ధం చేసుకున్నారు

నాడు వ్యతిరేకించి.. నేడు భరోసానిచ్చి..

ఆజంజాహి మిల్లు భవన భూమి విషయంలో సదరు వ్యాపారవేత్త ఆక్రమణను 2014లో వరంగల్ తూర్పు నియోజకవర్గం బీఆర్‌ఎస్‌లోని ఒక నేత వ్యతిరేకిస్తే మరో నేత తనకనుకూలుడైన వ్యాపారవేత్తకు పూర్తిగా సహకరించి ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించడంలో కీలకపాత్ర పోషించారు. దీనికి అధికారులు పూర్తిగా సహకరించారు. నాడు వ్యతిరేకించిన మరో బీఆర్‌ఎస్ నేత పార్టీ మారాక నేడు 'తూర్పు'లో కీలక నేతగా ఉండి రూ.5కోట్లు తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఆజంజాహి మిల్లు భవన స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడానికి ప్రముఖ నేత రంగ ప్రవేశం చేసి నేరుగా నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం విమర్శలకు తావిచ్చింది. తానే డైరెక్ట్‌గా ఎంట్రీ ఇస్తే ఎవరూ అడ్డురారని భావించి వేసిన అడుగు విమర్శలకు దారితీసింది. కోర్టులో ఆ కేసు వున్నందునా కార్మికులకు మరో స్థలం చూసు కుంటే సొంత ఖర్చులతో భవనాన్ని కట్టించి ఇస్తానని ప్రకటించారు. ఇదిలావు ంటే కమలనాధులు గతంలో ఇదే ప్రాంతంలో పార్క్‌కు శంకుస్థాపన చేసినా కట్టలేకపోయారు. ఆ ప్రాంతంలో పలు ప్రయివేటు నిర్మాణాలు వెలిశాయి. ఈ వ్యవహారంలో బీజేపీ కూడా తనవంతు పాత్ర పోషించడానికి రంగం సిద్ధం చేసుకుంది.

ఆ స్థలాన్ని సర్కారే స్వాధీనం చేసుకోవాలి..

ఆజంజాహి మిల్లు కార్మిక భవన స్థలాన్ని ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలనే డిమాండ్ పెరుగుతోంది. మిల్లే లేనప్పుడు మిల్లు కార్మిక సంఘం ఎక్కడిది ? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంతేకాక మిల్లు కార్మికులకు ఉనికిచర్ల వద్ద 'కుడా' లే అవుట్ ప్లాట్లను పంపిణీ చేసింది. పర్యవసానంగా వ్యాపారికి అనుకూలంగా కోర్టులో కార్మికులు సాక్ష్యం చెప్పినట్టు తెలుస్తోంది. దీంతో వ్యాపారి నేరుగా భూమిపైకి పోవడం వివాదానికి కారణమైంది. అప్పనంగా మిల్లు భూమిని కాజేయడానికి జరుగుతున్న వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఆ భూమిని ప్రజోపయోగానికి వినియోగించుకోవాలని నగరవాసులు, వామపక్ష కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

భారత్‌కు ట్రంప్ మరోషాక్

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించింది. భారత్‌లో జరిగే ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యను పెంచేందుకు అందించే 21 మిలియన్ డాలర్లను రద్దు చేసినట్టు పేర్కొన్నది. డోజ్.. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది.

కోతలపై బీజేపీ స్పందన

డోజ్ విభాగం తాజా నిర్ణయంపై బీజేపీ నేత అమిత్ మాలవీయ స్పందించారు. "ఓటర్లు సంఖ్య పెంచేందుకు 21 మిలియన్ డాలర్ల? ఇది భారతదేశ ఎన్నికల ప్రక్రియలో ప్రత్యక్ష భాగం కాదు. దీని నుంచి ఎవరు లాభపడుతున్నారు? అధికార పార్టీ మాత్రం కాదు" అని మాలవీయ ఎక్స్‌లో రాసుకొచ్చారు.

బంగ్లాదేశ్‌కూ 29 మిలియన్ డాలర్ల కోత

బంగ్లాదేశ్‌లో రాజకీయ స్థిరత్వాన్ని మెరుగుపరిచేందుకు అందిస్తున్న 29 మిలియన్ డాలర్లకు కూడా డోజ్ కోత విధించింది. ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా రాజీనామా అనంతరం మహమ్మద్ యూనస్ నేతృత్వంలో మధ్యంతర ప్రభుత్వం ఏర్పాటైన సంగతి తెలిసిందే. ఇక నేపాల్, కంబోడియా వంటి పలు ఆసియా పలు దేశాలకు కూడా వివిధ రూపాల్లో అమెరికా అందించే సాయాన్ని నిలిపివేశారు.

దిగజారిన అదానీ ఆస్తుల విలువ

న్యూఢిల్లీ : దేశంలో మూడో అతి పెద్ద పారిశ్రామిక కూటమి అయిన అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ ప్రపంచ కుబేరుల జాబితాలో 23వ స్థానానికి పడిపోయారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ల సూచిక ప్రకారం ఆయన నికర ఆస్తుల విలువ ఈ నెల 14న (శుక్రవారం) ఒక్క రోజే 2.73 బిలియన్ డాలర్ల మేర పడిపోయింది. మన కరెన్సీలో చెప్పాలంటే దాని విలువ రూ.23,660,495,500. ఇప్పుడాయన నికర ఆస్తుల విలువ 66.1 బిలియన్ డాలర్లు. ఈ ఏడాది గౌతమ్ అదానీ నికర ఆస్తుల విలువ 12.6 బిలియన్ డాలర్లు తగ్గింది. ఈ నేపథ్యంలో ఇప్పుడాయన ఆసియా సంపన్నుల జాబితాలో మూడో స్థానానికి దిగజారే అవకాశం ఉంది.

ఇదిలావుండగా దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఎనిమిదో సెషన్‌లో నష్టాలు చవిచూశాయి. ఫలితంగా దేశంలోని బిలియనీర్ల నికర ఆస్తుల విలువ తగ్గిపోయింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్, ఆసియాలో మూడో అది పెద్ద సంపన్నుడు అయిన ముకేష్ అంబానీ నికర ఆస్తుల విలువ ఈ ఏడాది 4.55 బిలియన్ డాలర్లు తగ్గింది. ప్రపంచ సంపన్నుల జాబితాలో ఆయన 17వ స్థానంలో ఉన్నారు. ఆయన నికర ఆస్తుల విలువ ప్రస్తుతం 86.1 బిలియన్ డాలర్లు. హెచ్‌సీఎల్‌కు చెందిన శివ్ నాదర్ ఈ సంవత్సరం 4.14 బిలియన్ డాలర్లు కోల్పోయారు. షాపూర్‌జీ మిస్త్రీ 2.18 బిలియన్ డాలర్లు, అజీమ్ ప్రేమ్‌జీ 188 మిలియన్ డాలర్లు, సావిత్రి జిందాల్ 5.20 బిలియన్ డాలర్లు, సన్ ఫార్మాకు చెందిన దిలీప్ సంఘ్వీ 3.40 బిలియన్ డాలర్లు కోల్పోయారు.

ప్రపంచంలో నికర ఆస్తుల విలువను భారీగా కోల్పోయిన వారి జాబితాలో ఎలన్ మస్క్ మొదటి స్థానంలో నిలిచారు. ఆదాయ సముపార్జనలో మార్క్ జూకర్‌బర్గ్ ప్రథమ స్థానంలో ఉన్నారు. ప్రపంచంలో అత్యంత సంపన్నుడైన మస్క్ ఈ ఏడాది 34.1 బిలియన్ డాలర్ల నికర విలువను కోల్పోయారు. దీంతో ఇప్పుడాయన ఆస్తుల నికర విలువ 398 బిలియన్ డాలర్లకు తగ్గింది. మరోవైపు ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా వేదికల సీఈఓ మార్క్ జూకర్‌బర్గ్ నికర ఆస్తుల విలువ ఈ సంవత్సరం 52 బిలియన్ డాలర్ల మేర పెరిగింది. ప్రపంచ సంపన్నుల జాబితాలో 259 బిలియన్ డాలర్ల నికర విలువతో ఆయన రెండో స్థానంలో నిలిచారు.

వికటన్ వెబ్‌సైట్ బ్లాక్

(మొదటిపేజీ తరువాయి)

చేసిన కొన్ని గంటల తర్వాత వికటన్ వెబ్‌సైట్ అందుబాటులోకి రాలేదు. వెబ్‌సైట్ అందుబాటులో లేదన్న విషయాన్ని చాలా మంది యూజర్లు తమకు చెప్పినట్టు వికటన్ తెలిపింది.

ఇటీవల ప్రధాని మోడీ అమెరికాలో పర్యటించిన విషయం విదితమే. మరోపక్క, అమెరికాలో ఉన్న భారతీయులను అక్రమ వలసదారుల పేరిట చేతులు, కాళ్లకు సంకెళ్లు వేసి అమెరికా యంత్రాంగం అమానుషంగా ప్రవర్తించటం, భారత్‌పై ట్రంప్ సుంకాల హెచ్చరికల నేపథ్యంలో తీవ్ర చర్చ నడిచింది. ఈ నేపథ్యంలో వికటన్ ఒక వ్యంగ్య కార్టూన్‌ను పబ్లిష్ చేసింది. ఇందులో ప్రధాని మోడీ చేతికి సంకెళ్లతో ట్రంప్ పక్కన కూర్చుంటారు. అయితే, ఈ కార్టూన్‌ను తమిళనాడు బీజేపీ యూనిట్ తీవ్రంగా ఆక్షేపించింది.

తమ వెబ్‌సైట్ బ్లాక్‌కు సంబంధించి కేంద్రం నుంచి తమకు ఎలాంటి సమాచారమూ అందలేదని సదరు మీడియా గ్రూపు వెల్లడించింది. తమ వెబ్‌సైట్‌ను చేరుకోలేకపోతున్నామంటూ పలువురు ఎక్స్ యూజర్లు తమకు తెలిపినట్టు వివరించింది. "కేంద్రం వికటన్ వెబ్‌సైట్‌ను బ్లాక్ చేసిందని పలు కథనాలు వచ్చాయి. వివిధ ప్రదేశాల నుంచి అనేక మంది వినియోగదారులు వికటన్ వెబ్‌సైట్‌ను చేరుకోలేకపోతున్నామని తెలిపారు. ఇప్పటి వరకైతే వికటన్ వెబ్‌సైట్‌ను బ్లాక్ చేయటానికి సంబంధించి కేంద్రం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా లేదు" అని ఒక అధికారి ప్రకటనలో వికటన్ వివరించింది. "ఈ కార్టూన్‌ను బీజేపీ మద్దతుదారులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విమర్శించారు. వికటన్‌పై కేంద్రానికి అన్నామలై(తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు) ఫిర్యాదు చేసినట్టు సమాచారం. దాదాపు ఒక శతాబ్ద కాలంగా, భావప్రకటనా స్వేచ్ఛకు వికటన్ మద్దతుగా నిలుస్తోంది. మేము ఎల్లప్పుడూ వాక్‌స్వాతంత్ర్యాన్ని కాపాడాలనే సూత్రంతో పని చేస్తున్నాం. దానిని అలాగే కొనసాగిస్తాం. మా వెబ్‌సైట్ బ్లాక్ కావటానికి గల కారణాలను తెలుసుకోవటానికి మేము ఇంకా ప్రయత్నిస్తున్నాం. ఈ విషయాన్ని మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లే ప్రక్రియలో ఉన్నాం" అని వికటన్ వివరించింది. వికటన్ వెబ్‌సైట్‌ను బ్లాక్ చేయటం తమిళనాడు మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బీజేపీ చేసిన ఫిర్యాదుతోనే వెబ్‌సైట్ బ్లాక్ అయిందని అంతా భావిస్తున్నారు.

సీఎం స్టాలిన్ ఖండన

ఈ విషయంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ స్పందించారు. వికటన్ వెబ్‌సైట్‌ను బ్లాక్ చేయటాన్ని ఆయన ఖండించారు. "అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నందుకు మీడియాను బ్లాక్ చేయటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఇది బీజేపీ ఫాసిస్ట్ స్వభావానికి ఒక ఉదాహరణ. బ్లాక్ అయిన వెబ్‌సైట్‌కు తక్షణమే యాక్సెస్ ఇవ్వాలి. వికటన్.. జర్నలిజం ఇండస్ట్రీలో దాదాపు శతాబ్ద కాలంగా కొనసాగుతోంది" అని స్టాలిన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

కార్పొరేట్ల చేతుల్లోకి టూరిజం

(మొదటిపేజీ తరువాయి)

ఐదేండ్ల పాటు అమల్లో ఉండేలా రాష్ట్ర పర్యాటక శాఖ దీన్ని రూపొందించింది. రాష్ట్రంలో పర్యాటకాన్ని పరుగులు పెట్టించేందుకు ఇందులో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రాంతాలు, వారసత్వ కట్టడాలు, సహజ జల వనరులు, అడవులు, కొండలు, కోనలు, కోటలు, ప్రకృతి రమణీయతను ఆస్వాదించే ప్రాంతాలను బీవోటీ ప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు ఇందులో ప్రణాళికలు సిద్ధం చేసింది. పర్యాటక ప్రాజెక్టులను ప్రారంభించేవారికి వివిధ రాయితీలను ఈ పాలసీలో ప్రతిపాదించింది. ఆయా ప్రాజెక్టులకు ప్రభుత్వ భూములనూ లీజుకు ఇవ్వనున్నది. మూలధన పెట్టుబడులపైనా రాయితీలు ఇచ్చేందుకు



నిర్ణయించింది. దాదాపు మూడు లక్షల మందికి అదనపు ఉపాధి అవకాశాలు కల్పించడం, దేశీయ, అంతర్జాతీయ పర్యాటకుల్ని ఆకర్షించడంలో దేశంలో తొలి ఐదు స్థానాల్లో తెలంగాణను నిలపడం. రాష్ట్ర ఆదాయంలో 10 శాతం, అంతకంటే ఎక్కువగా టూరిజం నుంచి వచ్చేలా చూడటం వంటి అనేక నిర్ణయాలను ఈ పాలసీలో చేర్చింది.

మొదటి దశలో .....

అనంతగిరి, కోటపల్లి, పరిగి, దామగుండం, సోమశిల కృష్ణానది బ్యాక్‌వాటర్, అలంపూర్, కొల్లాపూర్, బీచుపల్లి, అమ్రాబాద్ టైగర్ రిజర్వు, రామప్ప, లక్నవరం, మేడారం, బొగత జలపాతం, కాళేశ్వరం: నాగార్జునసాగర్, భద్రాచలం, కిన్నెరసాని వన్యప్రాణుల అభయారణ్యం, చార్మినార్, మక్కామసీదు, చౌమొహల్లా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియం, గోల్కొండ స్మారక చిహ్నాలు, శ్రీరామసాగర్, జన్నారం, కుంటాలజలపాతం, రామగిరి ఖిల్లా మొదలగు ప్రాంతాలను మొదటి దశలో బీవోటీ ప్రాతిపదికన అప్పగించనున్నట్టు సమాచారం.

కార్పొరేట్ల రుణ మాఫీ కోసమే కేంద్రం అప్పులు

(మొదటిపేజీ తరువాయి)

తెచ్చిన అప్పుతో దశాబ్దాలపాటు ఈ నేలను పట్టి పీడించిన తాగు, సాగునీటి కష్టాలను శాశ్వతంగా నిర్మూలించే ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను నిర్మించామని వివరించారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను వెన్నాడిన విద్యుత్ సమస్యను పారదోలేందుకు భారీ ప్లాంట్ల నిర్మాణానికి, మరోవైపు రాష్ట్రంలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను ఉపయోగించిన విషయం తెలంగాణ సమాజానికి తెలుసని తెలిపారు. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి లోబడి చేసిన అప్పును తప్పుగా చూపించే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండించారు. అటు కేంద్ర బడ్జెట్‌లోనూ, ఇటు రైల్వే కేటాయింపుల్లో మోడీ సర్కారు తెలంగాణపై వివక్ష చూపిందని విమర్శించారు. అధికారంలోకి రాగానే తెలంగాణలోని ఏడుమండలాలను, లోయర్ సీలేరు విద్యుత్ ప్రాజెక్టును లాక్కొని కొత్తగా ఏర్పడిన రాష్ట్రం గొంతుకోసిన విషయాన్ని తెలంగాణ సమాజం మరిచిపోలేదని గుర్తుచేశారు. విభజన హక్కులను నెరవేర్చాలని అడిగితే కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం దారుణమని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో పసుపు బోర్డుకు ఒక్క పైసా కూడా కేటాయించకుండా మాటలకే పరిమితం కావడమేంటని ప్రశ్నించారు. ఐటీఐఆర్ ప్రాజెక్టును పునరుద్ధరించాలని పదేండ్లలో పదులసార్లు మొరపెట్టుకున్నా కేంద్రం వినిపించుకోలేదని ఎత్తిచూపారు. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను విస్మరించడం మోసంకాదా? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సొంత ఖర్చులతో చేపట్టిన మిషన్ భగీరథ ద్వారా వంద శాతం ఇండ్లకు తాగునీళ్లు ఇచ్చిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దితే, జల్ జీవన్ మిషన్ కింద 38 లక్షల నల్లా కనెక్షన్లు ఇచ్చామని కేంద్రం తన ఖాతాలో వేసుకోవడం దుర్మార్గమని విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లాలో మూతపడ్డ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను తెరిపించి యువతకు ఉపాధి కల్పించాలని పదేపదే విజ్ఞప్తిచేసినా కేంద్రం వినిపించుకోకపోవడం ఆ ప్రాంత ప్రజలపట్ల బీజేపీకి ఉన్న నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని తెలిపారు. బీజేపీ నుంచి ఎనిమిది మంది ఎంపీలను గెలిపించినా ఎనిమిది పైసలు కూడా తీసుకురాలేని అసమర్థతను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

పుస్తక ప్రదర్శనకు ఏబీవీపీ అడ్డు

(మొదటిపేజీ తరువాయి)

షెడ్యూల్ విభేదాల కారణంగానే ఇది జరిగిందని వర్మ స్పష్టం చేశారు. ఆర్‌ఎస్ఎస్ నిర్వహించే ముందస్తు షెడ్యూల్ కార్యక్రమానికి రాంలీలా మైదానం ఇప్పటికే రిజర్వు చేయబడిందని వివరించారు.

శ్రీనగర్‌లో జరగనున్న పుస్తక ప్రదర్శన రద్దుపై నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. స్థానిక యంత్రాంగం సాహిత్య కార్యక్రమాలపై పక్షపాతంతో వ్యవహరిస్తుందని ఆరోపించింది. శ్రీనగర్ వంటి విద్యా కేంద్రానికి ఈ సంఘటన "దురదృష్టకరం" అని వివరించింది. ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి అంకిత్ సుంద్రియల్, రాష్ట్ర కార్యదర్శి ముకుల్ కుమార్ సంయుక్తంగా మాట్లాడుతూ.. "పుస్తక ప్రదర్శనలో ప్రఖ్యాత గర్వాలి కళాకారుడు నరేంద్ర సింగ్ నేగి పాల్గొననున్నారు. హిందీ, ఇంగ్లీష్ , స్థానిక గర్వాలి రచయితల నుంచి 75,000కి పైగా పుస్తకాలు ప్రదర్శించారు" అని అన్నారు. సుందరియల్ మాట్లాడుతూ "బీజేపీ, ఆర్‌ఎస్ఎస్ అనుబంధ విద్యార్థి సంస్థ ఈ కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తున్నట్టు వెలుగులోకి వచ్చింది. నరేంద్ర సింగ్ నేగి కూడా ఈ ప్రదర్శనకు అనుమతి నిరాకరించడంపై సోషల్ మీడియాలో తన అసంత ృప్తిని వ్యక్తం చేశారు" అన్ని చెప్పారు. "ఇది పుస్తకాలకు వ్యతిరేకత మాత్రమే కాదు, మన సంస్కృతికి వ్యతిరేకత. విద్యా కార్యకలాపాలకు ఆటంకం కలిగించే ఏ సంస్థకైనా తనను తాను విద్యార్థి సంస్థగా పిలుచుకునే హక్కు లేదు" అని సుంద్రియల్ నొక్కిచెప్పారు. పుస్తక ప్రదర్శన రద్దు గురించి రచయిత , చరిత్రకారుడు జైసింగ్ రావత్ ఆందోళనలను వ్యక్తం చేశారు. "పుస్తకాల భయం ఉందంటే అవి ఇప్పటికీ అధికారాన్ని కలిగి ఉన్నాయని సూచిస్తుంది. ఆర్టికల్ 19 ప్రతి పౌరుడికి భావ ప్రకటనా స్వేచ్ఛను హామీనిస్తుంది. సాహిత్య రంగంలో ఇటువంటి రాజకీయ ఆక్రమణ ప్రజాస్వామ్య వాతావరణానికి హానికరం" అని పేర్కొన్నారు.

సండే పూట చేపల వేట

- చేపలు, మటన్ కోసం బారులు దీరిన జనం
- గిరాకీ దృష్ట్యా ఈ రెండింటి ధరల పెంపు
- కేజీకి రూ.50కి పైన పెంచినా కొనుగోళ్లు
- సోషల్‌మీడియానే ముంచిందంటున్న చికెన్‌షాపుల నిర్వాహకులు

బర్డ్‌ఫ్లూ ప్రచారంతో చికెన్ షాపులు వెలవెల



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ప్రతి ఆదివారం సందడిగా ఉండే చికెన్‌షాపులు బర్డ్‌ఫ్లూ ప్రచారంతో నిన్నటి ఆదివారం వెలవెలబోయాయి. ముందుజాగ్రత్తగా చికెన్ తినడం మానేస్తున్న మాంసం ప్రియులు చేపలు, మటన్ దుకాణాలకు క్యూ కట్టారు. చేపలు, మటన్ అమ్మకాలు జోరందుకోవడంతో ఒక్కసారిగా ధరలు పెంచారు. గతంలో కిలో మటన్ రూ.700-రూ.800 వరకు విక్రయించేవారు. నిన్నటి ఆదివారం మాత్రం అదనంగా రూ.100 వసూలు చేశారు. అలాగే, సాధారణంగా రూ.130-రూ.150 వరకు అమ్మే బొచ్చ, రవ్వ, బంగారుతీగ వంటి చేపలను ఏకంగా కిలో రూ.180కి పైగా విక్రయించారు. జల్ల రకం చేపను మాత్రం రూ.150కి అమ్మారు. బర్డ్‌ఫ్లూ ప్రచారానికి ముందు కిలో రూ.350 పలికిన కొర్రమీను ఇప్పుడు రూ.450కి విక్రయిస్తుండటం గమనార్హం. ఇక కిలో రూ.300 ఉండే రొయ్యలు.. నాణ్యతను బట్టి రూ.400 వరకు అమ్మారు. లైవ్ ఫిష్‌కు రూ.20-30 అదనంగా వసూలు చేశారు. చేసేదీలేక మాంసప్రియులు అదనపు రేటును భరించి కొనుగోలు చేశారు. ఖమ్మంలోని పలు మాంసం, చేపల విక్రయాల అడ్డాల్లో జనం భారీగా బారులుదీరారు. గంటలు వేచి ఉండి చేపలు, రొయ్యలు శుభ్రం చేయించుకున్నారు తప్ప చికెన్ జోలికి ఎవరూ వెళ్లకపోవడం గమనార్హం. అలాగే మటన్‌షాపుల వద్ద కూడా గంటల తరబడి వేచివున్నారు.

నూటికి 5శాతానికి మించి చికెన్ వ్యాపారమూ లేదు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాయే కాదు రాష్ట్రంలో అనేక చోట్ల నూటికి 5శాతానికి మించి వ్యాపారం లేదని చికెన్ దుకాణాల నిర్వాహకులు వాపోయారు. సాధారణంగా ఆదివారం చికెన్ కొట్టేందుకు అదనంగా వర్కర్లను పెట్టుకుంటారు. కానీ గత రెండు ఆదివారాల నుంచి అదనపు మనుషులు కాదు కదా.. ఉన్నవారికే పనిలేకుండా పోయిందని నిర్వాహకులు వాపోయారు. సాధారణంగా ఆదివారం ఖమ్మం జిల్లాలో 100 టన్నుల చికెన్ బిజినెస్ జరిగితే ఈ సండే నాలుగైదు టన్నుల వ్యాపారం కూడా లేదని చికెన్‌షాపుల యజమానుల సంఘం కార్యదర్శి పారా సత్యనారాయణ తెలిపారు. జిల్లాలోని వెయ్యి దుకాణాల్లో ఒక్కదానిలోనూ 5శాతానికి మించి వ్యాపారం లేదన్నారు. మాఘ మాసం కావడంతో శుభకార్యాలు, పెళ్లిండ్లు, ఫంక్షన్లు ఎక్కువగా ఉండటంతో ఆ ఐదు శాతమైనా విక్రయాలు జరిగాయన్నారు. పది రోజుల క్రితం ఫంక్షన్లకు చికెన్ ఆర్డర్ ఇచ్చినవారు సైతం వాటిని క్యాన్సిల్ చేసుకున్నారు. చికెన్‌కు సరిపడా అదనంగా మటన్ తెప్పించుకున్నారు.

నిర్వహణ ఖర్చులు కూడా రాలేదు..

బర్డ్‌ఫ్లూ ప్రచారానికి ముందు కిలో రూ.280కి పైన విక్రయించిన చికెన్‌ను ఈ ఆదివారం స్కిన్‌లెస్ రూ.240లోపే అమ్మారు. చాలా దుకాణాల్లో రూ.200కే విక్రయించారు. షాపు తెరిస్తే రూ.1500కు పైగా ఖర్చు వస్తుంది. ప్రతి ఆదివారం రూ.30వేలకు పైన బిజినెస్ జరిగే షాపులో కనీసం రూ.వెయ్యి కూడా వ్యాపారం కాలేదు. సాధారణ ఆదివారాల్లో ఒక్కోషాపులో 30-40 వరకు అమ్మే నాటుకోళ్లు ఈ ఆదివారం పది కూడా అమ్ముడుపోలేదు. మూడు క్వింటాళ్లు అమ్మే షాపులో 30 కిలోలు కూడా కోళ్లు విక్రయించలేదు. చికెన్ 150 కిలోలు అమ్మేది పది కిలోలు కూడా అమ్మలేదు. బర్డ్‌ఫ్లూ ప్రచారంతో ఎక్కువ ఫారాల్లో కోళ్ల పెంపకం నిలిపివేశారు. ఈ ప్రచారం తగ్గాక రూ.300కు పైగా అమ్మే అవకాశం ఉందంటున్నారు. ఒక్కో షాపు కిరాయి రూ.20వేలు, ఒక్కో వర్కర్‌కు నెలకు రూ.17వేలు వేతనం ఇస్తున్నారు. యజమానితో కలిపి నెలకు రూ.లక్షకు పైన నిర్వహణ ఖర్చు వస్తుంది. అటువంటి షాపులో నెలకు కనీసం రూ.1.50 లక్షల టర్నోవర్ ఉంటేనే యజమానికి కనీసం రూ.50వేలు మిగులుతాయి. కానీ ఈ ఆదివారం నిర్వహణ ఖర్చులు కూడా రాలేదని చికెన్ వ్యాపారులు వాపోయారు.

చికెన్ బదులు రొయ్యలు తెచ్చాం



ప్రతి ఆదివారం ఎక్కువగా చికెన్ తెచ్చేవాళ్లం. ఎప్పుడో ఒకసారి మటన్ తెచ్చుకునేవాళ్లం. ఈసారి బర్డ్‌ఫ్లూ ప్రచారంతో ముందుజాగ్రత్తగా చికెన్ బదులు రొయ్యలు తెచ్చాం. చేపలు, మటన్, రొయ్యలు ఇలా అన్నింటికీ గతం కంటే కిలో రూ.50కి పైనే పెంచి అమ్ముతున్నారు.

- సరికొండ వెంకటేశ్వరరాజు, ఖమ్మం

సోషల్‌మీడియా ప్రచారమే ముంచింది



తెలంగాణలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ వ్యాపించిన దాఖలాలు లేవు. సోషల్ మీడియాలో కొందరు దురుద్దేశంతో ప్రచారం చేయటమే మా కొంప ముంచింది. ఈ ఆదివారం కనీసం మెయింటెనెన్స్ మందం కూడా చికెన్ అమ్మలేకపోయాం. రాష్ట్రంలో లేని బర్డ్‌ఫ్లూపై వారం రోజుల వ్యవధిలోనే ఈ స్థాయిలో వదంతులు వ్యాపించటం మునుపెన్నడూ చూడలేదు. కరోనాకు ముందు కూడా ఇలాంటి ప్రచారమే జరిగింది. కానీ వీఐపీలు కొందరు చికెన్ తినడంతో ఈ ప్రచారం ఆగింది. ప్రస్తుతం ప్రభుత్వం సైతం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. కానీ కొందరు సోషల్ మీడియాలో అదే పనిగా ప్రచారం చేస్తున్నారు. వంద డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలో ఉడికించే చికెన్‌తో ఎలాంటి ప్రమాదం లేదని డాక్టర్లు చెబుతున్నా.. సోషల్ మీడియా ప్రచారం ముందు అదీ నిలువలేకపోతోంది.

-పగడాల శ్రీకాంత్, చికెన్‌షాప్ యజమాని, ఖమ్మం



షెడ్యూల్ వచ్చేసింది

- ఈడెన్‌గార్డెన్స్‌లో ఐపీఎల్ తొలి, ఫైనల్ మ్యాచ్
- క్వాలిఫయర్1, ఎలిమినేటర్‌కు హైదరాబాద్ ఆతిథ్యం
- ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 షెడ్యూల్ విడుదల

అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 షెడ్యూల్ వచ్చేసింది. 74 మ్యాచులు, 65 రోజుల పాటు అలరించేందుకు మార్చి 22న ఐపీఎల్ అభిమానుల ముందుకు రానుంది. సీజన్ తొలి, ఫైనల్ మ్యాచ్‌కు ఈడెన్‌గార్డెన్స్ వేదిక కానుండగా.. క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ మ్యాచులకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది.



నవతెలంగాణ-హైదరాబాద్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కత నైట్‌రైడర్స్ సొంత మైదానం ఈడెన్‌గార్డెన్స్ 2025 సీజన్ తొలి, ఫైనల్ మ్యాచులకు ఆతిథ్యం ఇవ్వనుండగా, గత సీజన్ రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్ సొంత మైదానం ఉప్పల్ స్టేడియం క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్‌లకు వేదిక కానుంది. 2025 ఐపీఎల్ ఆరంభ మ్యాచ్ మార్చి 22న జరుగనుండగా, టైటిల్ పోరు మే 25న షెడ్యూల్ చేశారు. ఈ మేరకు ఐపీఎల్ షెడ్యూల్‌ను లీగ్ నిర్వాహకులు ఆదివారం విడుదల చేశారు. 2013, 2015లో ఐపీఎల్ ఫైనల్స్‌కు వేదికగా నిలిచిన కోల్‌కత ఈడెన్ గార్డెన్స్ సుమారు దశాబ్దం తర్వాత మళ్లీ ఐపీఎల్ అంతిమ సమరానికి వేదిక కానుంది.

పది జట్లు, రెండు గ్రూప్‌లు

ఐపీఎల్ 2025 టైటిల్ వేటలో పది జట్లు నిలిచాయి. పది జట్లను సీడింగ్ ప్రకారం రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్-ఏలో కోల్‌కత నైట్‌రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్, రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్‌కింగ్స్, పంజాబ్ కింగ్స్ ఉండగా.. గ్రూప్-బిలో సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్, ముంబయి ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ నిలిచాయి. ప్రతి జట్టు సొంత గ్రూప్‌లోని ఇతర నాలుగు జట్లతో, ఆవల గ్రూప్‌లోని సమాన సీడింగ్ కలిగిన జట్టుతో రెండేసి మ్యాచులు ఆడనుంది. దీనికి తోడు ఆవల గ్రూప్‌లోని ఇతర నాలుగు జట్లతో ఒక్కోసారి తలపడనుంది. అంతిమంగా, ప్రతి జట్టు లీగ్ దశలో 14 మ్యాచులు ఆడుతుంది. లీగ్ దశ సహా ప్లే ఆఫ్స్‌తో కలిసి 74 మ్యాచులు షెడ్యూల్ చేశారు. ఓవరాల్‌గా పాయింట్ల పట్టికలో టాప్-4లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి.

హైదరాబాద్‌లో ప్లే ఆఫ్స్

ఐపీఎల్‌లో ఈ సీజన్‌లో హైదరాబాద్ ఏడు లీగ్ దశ మ్యాచులు సహా రెండు కీలక ప్లే ఆఫ్స్ మ్యాచులకు ఆతిథ్యం ఇవ్వనుంది. మార్చి 22న కోల్‌కతలో ఆరంభ మ్యాచ్ ఉండగా.. తర్వాతి రోజు లీగ్‌లో రెండో మ్యాచ్ హైదరాబాద్‌లో జరుగనుంది. రాజస్థాన్ రాయల్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో తలపడనుంది. సొంత మైదానంలో రాజస్థాన్ రాయల్స్ సహా లక్నో సూపర్‌జెయింట్స్ (మార్చి 27), గుజరాత్ జెయింట్స్ (ఏప్రిల్ 6), పంజాబ్ కింగ్స్ (ఏప్రిల్ 12), ముంబయి ఇండియన్స్ (ఏప్రిల్ 23), ఢిల్లీ క్యాపిటల్స్ (మే 5), కోల్‌కత నైట్‌రైడర్స్ (మే 10)తో సన్‌రైజర్స్ తలపడనుంది. చెన్నై సూపర్‌కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మరో గ్రూప్‌లో ఉండగా ఈసారి గ్రూప్ దశలో ఆ జట్లతో ఒక్కసారి మాత్రమే ఆడనుండగా.. ఆ రెండు మ్యాచులను సైతం బెంగళూర్, చెన్నైలో షెడ్యూల్ చేశారు. ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించిన నాలుగు జట్లు కచ్చితంగా హైదరాబాద్‌లో ఓ మ్యాచ్ ఆడనున్నాయి. క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ మ్యాచులు ఉప్పల్‌లో జరుగనున్నాయి. దీంతో చెన్నై సూపర్‌కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌లు ప్లే ఆఫ్స్‌కు చేరుకుంటే.. ఈ సీజన్లోనూ విరాట్ కోహ్లి, ఎం.ఎస్ ధోని మెరుపులను ఉప్పల్ స్టేడియంలో వీక్షించవచ్చు.

13 స్టేడియాల్లో..

పీఎల్ మ్యాచులు ఈ సీజన్‌లో ఏకంగా 13 స్టేడియాల్లో జరుగనుంది. సంప్రదాయ పది స్టేడియాలకు తోడు ఈసారి మరో మూడు స్టేడియాలు అదనంగా తోడయ్యాయి. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రెండో సొంత మైదానంగా విశాఖపట్నంను ఎంచుకుంది. పంజాబ్ కింగ్స్ రెండో సొంత మైదానంగా ధర్మశాలను ఎంచుకోగా.. గువహటిని రాజస్థాన్ రాయల్స్ రెండో సొంత మైదానంగా ఎంచుకుంది. ధర్మశాలలో పంజాబ్ కింగ్స్ వరుసగా మూడు మ్యాచులు (మే 4-11) ఆడనుంది. ఢిల్లీ క్యాపిటల్స్, ముంబయి ఇండియన్స్, లక్నో సూపర్‌జెయింట్స్‌తో వరుస మ్యాచుల్లో ఆడనుంది. మరో జట్టు సైతం వరుసగా సొంత గడ్డపై మూడు మ్యాచులు ఆడటం లేదు. విశాఖపట్నంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్‌జెయింట్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ ఆడనుంది. గువహటిలో రాయల్స్ సైతం రెండు మ్యాచులు ఆడనుంది. ఈ సీజన్‌లో 74 మ్యాచులను 65 రోజుల్లో షెడ్యూల్ చేయగా.. అందులో 12 డబుల్ హెడర్స్ ఉన్నాయి. రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్‌జెయింట్స్, గుజరాత్ టైటాన్స్‌లు మూడేసి మధ్యాహ్నం మ్యాచులు ఆడనుండగా.. ఇతర ఏడు జట్లు రెండేసి మ్యాచులు ఆడనున్నాయి. రాత్రి మ్యాచులు 7.30 గంటలకు, మధ్యాహ్నం మ్యాచులు 3.30 గంటలకు ఆరంభం అవుతాయి.

అలనాటి నటి కృష్ణవేణి కన్నుమూత



కృష్ణవేణి

అలనాటి నటి, గాయని, నిర్మాత కృష్ణవేణి (101) ఇకలేరు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె ఆదివారం తెల్లవారు జామున 4 గంటలకు ఫిల్మ్‌నగర్‌లోని స్వగృహంలో తుదిశ్వాస విడిచినట్లు ఆమె కుమార్తె, నిర్మాత అనూరాధా దేవి తెలిపారు. కృష్ణవేణి పేరు వినగానే.. ఎన్టీఆర్‌ని వెండితెరకు పరిచయం చేసిన నిర్మాత అని గుర్తొస్తుంది.

డిసెంబర్ 24, 1924లో కృష్ణజిల్లాలోని పంగిడిగూడంలో డా. ఎర్రంశెట్టి లక్ష్మణరావు, నాగరాజమ్మకు కృష్ణవేణి జన్మించారు. చిన్నప్పటి నుంచి ఆమెకు నటన, నృత్యంపై అభిలాష ఎక్కువ. 'తులాభారం' నాటకంలోని ఆమె నటనను చూసిన దర్శకుడు సి.పుల్లయ్య బాలనటిగా 'సతీ అనసూయ' (1936)తో వెండితెరకు పరిచయం చేశారు. బాల నటిగా తెలుగు, తమిళ భాషా చిత్రాలలో నటించిన ఆమె 1938లో విడుదలైన 'కచదేవయాని' చిత్రంతో కథానాయికగా ప్రేక్షకులకు పరిచయం అయ్యారు. 'మళ్ళీపెళ్ళి', 'జీవన జ్యోతి', 'దక్షయజ్ఞం', 'భక్త ప్రహ్లాద', 'భీష్మ', 'బ్రహ్మారథం', 'లక్ష్మమ్మ' 'గొల్లభామ', 'మనదేశం', 'ఆహుతి', 'తిరుగుబోతు', 'పేరంటాలు' వంటి తదితర ఎన్నో చిత్రాల్లో ఆమె నటించారు. రూ. 45 వేలు అత్యధిక పారితోషికం అందుకున్న తొలితరం కథానాయిక కృష్ణవేణి. 'మహానంద' చిత్రంలో నటిస్తున్న సమయంలో మీర్జాపురం రాజా వారితో ఏర్పడిన పరిచయం, పరిణయానికి దారి తీసింది. భర్త శోభనాచల స్టూడియోస్ వ్యవహారాలను కూడా ఆమె పర్యవేక్షించారు.
ఈ బ్యానర్‌లో వచ్చిన తొలి సాంఘీక చిత్రం 'జీవనజ్యోతి'. ఈ చిత్రంతో చదలవాడ నారాయణరావును హీరోగా పరిచయం చేశారు. 1942లో కృష్ణవేణి, మీర్జాపురం రాజా దంపతులకు అనూరాధాదేవి జన్మించారు. ఆమె పేరుతో ఎం.ఆర్.ఎ అనే బ్యానర్‌ను స్థాపించారు. ఈ బ్యానర్ ద్వారానే 1949లో 'మనదేశం' సినిమాతో ఎన్టీఆర్‌ను తెలుగు సినిమా రంగానికి పరిచయం చేశారు. ఆమె నిర్మించడమే కాకుండా నాయికగా నటించారు కూడా. ఎల్.వి.ప్రసాద్ దీనికి దర్శకుడు. ఈ సినిమా కోసం ఎన్టీఆర్‌కి ఆమె ఇచ్చిన పారితోషికం రూ.250 మాత్రమే.
ఎన్టీఆర్, సంగీత దర్శకులు ఘంటశాల, రమేష్‌నాయుడు, గాయనిమణులు పి.లీల, జిక్కీ, దర్శకుడు ఎర్రా అప్పారావు వంటి హేమాహేమీలను వెండితెరకు పరిచయం చేసిన తొలి తెలుగు మహిళా నిర్మాత కృష్ణవేణి. అలాగే 'కీలు గుర్రాలు', 'భలే మిత్రుల కథ' వంటి చిత్రాల్లోనే కాకుండా ఆమె కథానాయికగా నటించిన అన్ని చిత్రాల్లోనూ పాటలు పాడి, గాయనిగా కూడా శ్రోతలను అలరించారు.
2004లో ప్రతిష్టాత్మక రఘుపతి వెంకయ్యనాయుడు పురస్కారం ఆమెను వరించింది. నటిగా కృష్ణవేణి ఆఖరి చిత్రం 'దాంపత్యం'. ఆమె కుమార్తె అనూరాధా దేవి సైతం తల్లి అడుగుజాడల్లో నడుస్తూ పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించి, నిర్మాతగా సత్తా చాటారు. సినీ పరిశ్రమలో శతవసంతాలను పూర్తిచేసుకున్న అరుదైన నటి కృష్ణవేణి మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.
'ఎన్టీఆర్ నటజీవితానికి తొలుత అవకాశం అందించిన కృష్ణవేణి బహుముఖ ప్రజ్ఞాశాలి. నటిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా తెలుగు సినీ చరిత్రలో ఆమెది ఓ ప్రత్యేక అధ్యాయం'

- బాలకృష్ణ

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తొలి మహిళా నిర్మాతగా గుర్తింపు పొందిన కృష్ణవేణి నటిగా, గాయనిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా బహుముఖ ప్రజ్ఞ చాటుకున్నారు. ఎన్టీఆర్, ఘంటసాల వెంకటేశ్వరరావులను తెలుగు సినీ పరిశ్రమకు పరిచయం చేసి ప్రత్యేక గుర్తింపు పొందారు.

- పవన్‌కళ్యాణ్

నవచిత్రం

గొప్ప గౌరవాన్ని తీసుకొచ్చిన సినిమా



చందూ మొండేటి

"తండేల్ రిలీజ్ తర్వాత చాలా మంది దర్శకులు, హీరోలు కాల్ చేశారు. నాని, రామ్ కాల్ చేసి డబుల్ బ్లాక్ బస్టర్ .. ఎలా వుంది ఫీలింగ్ అన్నారు. 'ఇది ఒక దర్శకుడి సినిమా' అని రాఘవేంద్రరావు చెప్పడం వెరీ మెమరబుల్' అని దర్శకుడు చందూ మొండేటి అన్నారు.
నాగచైతన్య, సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీవాసు నిర్మించారు. ఈనెల 7న విడుదలైన ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ సక్సెస్‌ని సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు చందూ మొండేటి మీడియాతో ముచ్చటించారు.

- ఈ కథ విన్నప్పుడు పాక్ నేపథ్యంలో చేద్దామని అనుకున్నాను. కానీ ఆలోచిస్తే ఇందులో బ్యూటీఫుల్ ఎమోషన్ ఉంది. ఈ ప్రేమకథలో ఎడబాటు, విరహం చాలా ప్రత్యేకం. ఇద్దరు ప్రేమికులు ఒక విషయాన్ని కమ్యునికేట్ చేయాలంటే నెల రోజులు ఆగాలి. ఈ పాయింట్ నాకు చాలా ఎగ్జైటింగ్‌గా అనిపించింది. అందుకే మెదట నుంచి ఈ సినిమా మేం ఎమోషనల్ లవ్ స్టోరీ అనే ప్రమోట్ చేశాం. ఇది ప్యూర్ లవ్‌స్టోరీ.
- చైతుతో తెనాలి రామకృష్ణుడు బయోపిక్ ఎనౌన్స్ చేశాను. ఎందుకంటే చైతు చాలా సిన్సియర్. ఆయన సిన్సియర్‌గా ఎఫర్ట్ పెట్టారు కాబట్టే 'తండేల్' సక్సెస్‌కి మించిన ప్రశంసలు ఆయన నటనకి వస్తున్నాయి.
- నా డైరెక్షన్‌లో నాగచైతన్యకి ఫస్ట్ వందకోట్ల సినిమా ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. గీతా ఆర్ట్స్. అరవింద్, వాసు, చైతు, సాయి పల్లవి, దేవిశ్రీ.. ఇలా అందరి ఎఫర్ట్ ఇది. నా అక్షర రూపానికి వారంతా విజువల్‌ని ఇచ్చారు. నాగార్జున కెరీర్‌లో ఎన్నో బ్లాక్‌బస్టర్స్ చూశారు. ఆయన 'థ్యాంక్ యూ చందు. వి లవ్ యూ'అని చెప్పడం ఆయన గొప్పదనం. అది నాకు గొప్ప ప్రశంస. ఈ సినిమా ఒక గౌరవం తీసుకొస్తుందని ముందు నుంచి నమ్మాం. ప్రేక్షకులు అంతే గౌరవంతో గొప్ప ఘన విజయాన్ని ఇచ్చారు. 'కార్తికేయ3' ఉంటుంది. మధ్యలో ఓ సినిమా ఉంది. హీరో సూర్యతో చర్చలు జరుగుతున్నాయి. అది వర్క్ అవుట్ అవుతుందని ఆశిస్తున్నాను.

'బ్రహ్మా ఆనందం'కు విశేష ఆదరణ



స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన చిత్రం 'బ్రహ్మా ఆనందం'. బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రలు పోషించారు. సావిత్రి, ఉమేష్ కుమార్ సమర్పణలో ఈ చిత్రాన్ని రాహుల్ యాదవ్ నక్కా నిర్మించగా, నూతన దర్శకుడు నిఖిల్ తెరకెక్కించారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది.
ఈ నేపథ్యంలో చిత్రయూనిట్ నిర్వహించిన సక్సెస్ మీట్‌లో బ్రహ్మానందం మాట్లాడుతూ, 'సినిమాను చూసిన వారంతా మా అబ్బాయి గురించే మాట్లాడుతున్నారు. మీ కన్నా.. మీ అబ్బాయి బాగా చేశాడని మెచ్చుకుంటూ ఉంటే తండ్రిగా నాకు చాలా సంతోషంగా అనిపించింది. చాలా కాలం తరువాత ఓ మంచి సినిమాను, మంచి పాత్రను చేశాననే సంతృప్తి కలిగింది' అని అన్నారు. 'మా సినిమాను చూసిన వారంతా నా గురించి మాట్లాడుతున్నారు. నాన్నతో కలిసి చేసిన ఈ సినిమా మీ అదరణ పొందడం చాలా ఆనందంగా ఉంది. మళ్లీ రాహుల్ యాదవ్‌తోనే వైబ్ సినిమాను చేస్తున్నాను. ఈ సినిమాలో మరింత కొత్తగా కనిపిస్తాను' అని హీరో రాజా గౌతమ్ చెప్పారు. నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా మాట్లాడుతూ, 'నేను నిర్మించిన గత చిత్రాలు మంచి మౌత్ టాక్‌తోనే హిట్ అయ్యాయి. ఈ మూవీకి కూడా మంచి మౌత్ టాక్ వచ్చింది. ఇప్పటి వరకు అన్ని చోట్లా షోలు ఫుల్ అవుతున్నాయి' అని తెలిపారు.

తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో..



సముద్రఖని, ధన్‌రాజ్

సముద్రఖని ప్రధానపాత్రలో నటించిన ద్విభాషా చిత్రం 'రామం రాఘవం'. స్లేట్ పెన్సిల్ స్టోరీస్ పతాకంపై ప్రభాకర్ అరిపాక సమర్పణలో పృథ్వీ పోలవరపు ఈ చిత్రాన్ని నిర్మించారు. ధన్‌రాజ్ దర్శకత్వం వహించారు.
ఈ సినిమా ఈనెల 21న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ నేపథ్యంలో హీరో నాని ఈ చిత్ర ట్రైలర్‌ను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ధన్‌రాజ్ నాకు కెరీర్ మొదటి నుంచే పరిచయం. అయితే తను కామెడీ సినిమా తీస్తాడేమో అనుకున్నా. కానీ నాకు ట్రైలర్ చూపించి ఎమోషనల్ డ్రైవ్‌లోకి తీసుకెళ్లాడు. సముద్రఖని వర్క్ అంటే వ్యక్తిగతంగా నాకు ఎంతో ఇష్టం. ఆయన నేను ఫ్యామిలీలా ఉంటాము. నిర్మాత పృథ్వీ పోలవరపు మంచి కంటెంట్ ఉన్న సినిమాని నిర్మించటం మంచి విషయం. 'ఒకే ఒక లోకం నువ్వు' వంటి పాటని అందించిన సంగీత దర్శకుడు అరుణ్ చిలివేరు ఈ సినిమాకు చక్కని సంగీతాన్ని ఇచ్చారని ట్రైలర్ చూస్తేనే అర్థం అవుతుంది' అని తెలిపారు.
'నా సొంత తమ్ముడులాంటి నాని ట్రైలర్‌ని లాంచ్ చేయటం సంతోషంగా ఉంది. మా సినిమాని థియేటర్‌లో చూసి, నన్ను మా టీమ్‌ని ఆశీర్వదించండి' అని సముద్రఖని చెప్పారు. దర్శకుడు ధన్‌రాజ్ మాట్లాడుతూ,'తండ్రీకొడుకుల ఎమోషనల్ డ్రామాలో ఇప్పటివరకు ఎవరు ట్రై చేయని యూనిక్ కాన్సెప్ట్‌తో వస్తున్న సినిమా ఇది' అని చెప్పారు.

'ప్రేమతో వదిలేస్తా..' ప్రారంభం



అంజి దర్శకత్వంలో రూపొందబోయే చిత్రం 'ప్రేమతో వదిలేస్తా'. ఈ చిత్ర ప్రారంభోత్సవం ఆర్‌టిసీ క్రాస్‌రోడ్ లోని టి.ఆర్.టి గ్రౌండ్‌లో అత్యంత ఘనంగా జరిగింది. చిక్కడపల్లి ఎస్.ఐ నాగరాజ్ కొబ్బరికాయ కొట్టడంతో ఈ చిత్రాన్ని మేకర్స్ ఆరంభించారు. ముహూర్తపు సన్నివేశానికి ఎమ్మెల్యే ముఠాగోపాల్ తనయుడు జై సింహ క్లాప్ కొట్టారు.
ఈ చిత్ర ప్రారంభోత్సవంలో గోల్డ్‌స్టార్, చక్కు స్టార్, మీనాక్షి, రవీంద్ర, హసినా, పవన్‌నాయుడు, సుధాకర్ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దర్శకుడు అంజి మాట్లాడుతూ, 'ఇదొక భిన్న కథ. 'ప్రేమతో వదిలేస్తా' అని టైటిల్ ఎందుకు పెట్టామో.. సినిమా చూస్తే తప్పకుండా అర్థమవుతుంది. ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ వివరాలను తెలియజేస్తాం. ఈ సినిమాతో దర్శకుడిగా నాకు మంచి పేరు వస్తుందని ఆశిస్తున్నాను' అని తెలిపారు.

మరో సూపర్ హీరో కథ



రిత్విక్ వేట్ల సమర్పణలో రాధిక, శ్రీనివాస్ నిర్మిస్తున్న చిత్రం 'త్రికాల'. ఈ చిత్రానికి శ్రీ సాయిదీప్ చాట్ల, వెంకట్ రమేష్ దాడి సహ నిర్మాతలు. మణి తెల్లగూటి దర్శకుడు. శ్రద్దా దాస్, మాస్టర్ మహేంద్రన్, అజయ్, సాహితి అవంచ, ఆమని, ప్రభాకర్, అంబటి అర్జున్, రౌడీ రోహిణి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.
దర్శకుడు మణి మాట్లాడుతూ, 'త్రికాల సినిమాటిక్ యూనివర్స్ అని ట్రైలర్‌లో పెట్టాం. అంబటి అర్జున్ ఒక్క రోజే షూటింగ్ చేశారు. అదేంటో ఫ్యూచర్‌లో తెలుస్తుంది. షాజిత్, హర్ష వర్ధన్ రామేశ్వర్ సంగీతం అద్భుతంగా ఉంటుంది. మా నిర్మాతలు రాధిక, శ్రీనివాస్ ఈ చిత్రం కోసం చాలా కష్టపడ్డారు. అజయ్ మాకు ఈ ప్రయాణంలో అండగా నిలబడ్డారు. మా చిత్రం సమ్మర్‌లో రాబోతోంది' అని తెలిపారు.
'సనాతన ధర్మాన్ని ముందుకు తీసుకెళ్లాలి అని, మన సూపర్ హీరోల్ని అందరికీ చూపించాలని ఈ సినిమాను తీశాం. బ్యాట్ మ్యాన్, సూపర్ మ్యాన్, స్పైడర్ మ్యాన్‌లా మన 'త్రికాల' ఉంటుంది. టైంతో సంబంధం లేకుండా కాపాడేవాడే 'త్రికాల' అని నిర్మాత రాధిక చెప్పారు.
మరో నిర్మాత శ్రీనివాస్ మాట్లాడుతూ,'ఈ మూవీకి సీజీ వర్క్ ఎక్కువగా అవసరం పడింది. అందుకే రిలీజ్ లేట్ అవుతూ వచ్చింది. మన పురాణాల్లోనే హనుమాన్, భీమ్ వంటి సూపర్ హీరోలున్నారు. మనం ఓ ఫిక్షనల్ హీరోని సృష్టించాలని అనుకున్నాం. అలా పుట్టిందే ఈ త్రికాల. సమ్మర్‌లో ఈ మూవీని రిలీజ్ చేయబోతున్నాం' అని అన్నారు. సహ నిర్మాతలు సాయిదీప్, వెంకట్ రమేష్ మాట్లాడుతూ, 'ఇదొక గొప్ప చిత్రం కాబోతోంది. మా ఆర్టిసుల సహకారం మరవలేనిది. ప్రాస మణి, మహేంద్రన్ అద్భుతంగా నటించారు. సనాతన ధర్మాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఈ మూవీని తీశాం. పవన్ కళ్యాణ్ ఇచ్చిన స్ఫూర్తితోనే ముందుకు వెళ్తున్నాం' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.